సర్దార్ వల్లభభాయి పటేల్

కృతజ్ఞత

ఈ గ్రంధంలోని ఫొటోలను సమకూర్చడంలో మాకు సహకరించిన యీ దిగువ సంస్థల వారికి మా హృదయ పూర్వక కృతజ్ఞత లర్పించుకొంటున్నాం. అవసరమైన కొంత సమాచారం లభ్యం కానందున కొందరి పేర్లు ఇక్కడ ఉదహరించ వీలు పడలేదు. వారికి కూడ మా కృతజ్ఞతలు.

ప్రచురణశాఖ, సూచన - ప్రసారణమంత్రాలయం భారత ప్రభుత్వం
అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోస్, ఢిల్లీ
గాంధీ స్మారక సంగ్రహాలయం, ఢిల్లీ
నవజీవన్ ట్రస్టు, అహమ్మదాబాదు
నెహ్రూ స్మారక సంగ్రహాలయం, మరియు పుస్తకాలయం క్రొత్త ఢిల్లీ
పంజాబు ఫొటో సర్వీస్, క్రొత్త ఢిల్లీ
పత్ర సూచన కార్యాలయం
పి. ఎస్. వర్మా అండ్ కంపెనీ, అలహాబాదు
సర్వోదయ దివస్ సమితి
సూచనా నిదేశాలయం, గుజరాతు ప్రభుత్వం

జాతీయ జీవిత గ్రంథమాల

సర్దార్ వల్లభభాయి పటేల్

రచన :

విష్ణు ప్రభాకర్

అనువాదం :

డా॥ చలసాని సుబ్బారావు

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ప్రథమ ముద్రణ : 1980 (శక 1901)
ద్వితీయ ముద్రణ : 1990 (శక 1912)

రూ. 14.00

Sardar Vallabhbhai Patel *(Telugu)*

డైరక్టరు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
ఎ-5, గ్రీన్ పార్కు, కొత్త ఢిల్లీ-110 016 చే ప్రచురింపబడినది.

ముందు మాట

కార్యశీలుడైన సర్దార్ వల్లభభాయి పటేల్ విస్తృత జీవితాన్ని కొద్ది పేజీలలో తెలియ చెప్పడం సాధ్యమయ్యే పనికాదు. అది సముద్రాన్ని చెంబులో పట్టించడం లాంటిది. ఏది ప్రధానం, ఏది అప్రధానం దేన్ని వదలాలి దేన్ని తీసుకోవాలి! చెప్పలేము. అయినా ఈ పుస్తకాలను వ్యాసాలను ఆధారం చేసుకొని అలా చేయ ప్రయత్నించాను.

1. సర్దార్ వల్లభభాయి, రెండుభాగాలు—నరహరి పార్టీలు
2. హిందూ కే సర్దార్ — రావుజీభాయిపటేల్
3. సర్దార్ వల్లభభాయి పటేల్ — ఈశ్వరభాయి పటేల్
4. మహాదేవ భాయికి డాయరీ

మరియు సర్వశ్రీ ప్రకాశవీరశాస్త్రి, వి. శంకర్, మాజీ రాష్ట్రపతి వరాహగిరివేంకటగిరి గార్ల వ్యాసాలు.

రచయిత వీరందరికీ కృతజ్ఞుడు.

విష్ణుప్రభాకర్

విషయక్రమం

పుట్టుకతో పరిమళించిన పువ్వు

స్కూలులో ఉపాధ్యాయుడు బోర్డుపై బీజగణితం వేస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా లెక్క సరిగా రావడంలేదు. అప్పుడు క్లాసులోని ఒక కుర్రవాడు లేచి ధైర్యంగా 'మీరీ లెక్క చేయలేరు' అన్నాడు. ఉపాధ్యాయుడు కోపగించుకొంటూ 'అయితే నువ్వుచేయి, చేసి మాష్టరవ్వు' అన్నాడు.

కుర్రవాడు నిర్భయంగా లేస్తాడు. బోర్డువద్దకు వెళ్ళి ఆ లెక్కను సాల్వు చేస్తాడు. తరువాత దర్జాగా వెళ్ళి మాష్టరుగారి కుర్చీపై కూర్చుంటాడు. ఎంత సాహసం! ఉపాధ్యాయుడు మండిపడతాడు. హెడ్మాష్టరు గారికి రిపోర్టు చేస్తాడు. హెడ్మాష్టరు కుర్రవాణ్ణి పిలిపించి ఎందుకలా చేశావని అడుగుతాడు.

కుర్రవాడు తన సహజ ధోరణిలో ఆ మాష్టరుగారే అలా చేయమని చెప్పారు గనుక చేశానన్నాడు. హెడ్మాష్టరుగారు విషయాన్ని అర్థం జేసుకొన్నాడు. కాని 'అబ్బాయీ, నీవలా చేయకూడదు. ఈ పర్యాయమిటువంటి పని చేస్తే స్కూలునుంచి గెంటి వేస్తాను' అని మందలించాడు.

కుర్రవాడు సూటిగా ఒకసారి హెడ్మాష్టరు వంక చూసి 'మీరు గెంటివేయ వలసిన పని లేదు. ఇటువంటి స్కూలులో వుండి నేనేమి నేర్చుకొంటాను. నేనే వెళ్ళిపోతాను' అన్నాడు.

ఒక పర్యాయం కొందరు కుర్రవాళ్ళు తమ గ్రామం నుంచి ఆరుమైళ్ళ దూరం నడిచి చదువుకొనేందుకు మరొక గ్రామం వెళుతున్నారు. రోజూ

అలాగే వెళుతుండేవారు. ఆరోజు అలా వెళుతుండగా మధ్య దారిలో ఒక కుర్రవాడు తమతో లేడని అందరూ గ్రహించారు. తమతో పాటు బయలుదేరినవాడు మధ్యలో తప్పుకున్నాడే ! అందరూ అక్కడ నిలబడి కుర్రవాని కొరకు కేకలు వేశారు ఆ కుర్రవాడు వెనుక నుండి జవాబిస్తూ వస్తున్నాను, వుండండి ' అని అరిచాడు.

కొంచెం సేపటికి ఆ కుర్రవాడు ఆ దారి మధ్యలో పాతివున్న ఒక కొయ్య మేకును బట్టి బలంగా పీకి దూరంగా పారవేసి వచ్చాడు. మిగతా కుర్రవాళ్ళు భయంతో ' ఎవరో రైతు తన పొలానికేదో గుర్తుగా పాతుకున్న కొయ్యమేకు నలా పీకి పారేశావు మరి ఆ రైతు చూసే ? ' అని అడిగారు:

ఆ కుర్రవాడు నిర్లక్ష్యముగా ' యిది నలుగురు నడిచే దారి దారి. మధ్యలో యిటువంటి మేకులు పాత కూడదు. వచ్చే పోయే వారికి దీని వల్ల యిబ్బంది కలుగుతుంది. ఇతరుల కిలా యిబ్బంది కలుగ జేసే వాటిని వుంచకూడదు, తొలగించి వేయాలి, అని నీతి చెప్పాడు.

* * *

ఒక సారి ఉపాధ్యాయుడు ఆఫీసులో తన తోటి వారితో బాతాఖానీ వేసుకొని గంట కొట్టినా క్లాసుకు వెళ్ళలేదు. విద్యార్థులు కొంతసేపు నిరీక్షించి ఆ తరువాత క్లాసులో ఎలుగెతి పాటలు పాడటం మొదలు పెట్టారు, ఆ పాటలు గట్టిగా ఆఫీసులోకి వినిపించాయి. ఉపాధ్యాయుడు హడావుడిగా క్లాసుకువెళ్ళి విద్యార్థులందరిని చివాట్లుపెట్టాడు

అయితే మన కుర్రవానికిది అన్యాయంగా తోచింది. అతను లేచి ధైర్యంగా ' మీరు క్లాసుకు రాలేదు. మీ బాతాఖానీలో మీరున్నారు. మరి మేము పాటలు పాడక ఏడవాలంటారా ? అని అడిగాడు, అది

విని ఉపాధ్యాయుడు మరింత మండి పడ్డాడు. ఆ కుర్రవాణ్ణి క్లాసునుంచి వెళ్ళి పొమ్మన్నాడు. అతను లేచి క్లాసు వంక నిండుగా చూస్తూ బయటికి వెళ్ళిపోయాడు. కాని ఆ మరుక్షణంలో క్లాసులోని కుర్రవాళ్ళందరూ లేచి బయటికి నడిచారు. అది చూసి ఉపాధ్యాయుడు విస్తుపోయాడు.

ఆ మరునాడు కూడ విద్యార్థు లెవరూ క్లాసుకు రాలేదు. ఉపాధ్యాయుడు కంగారుగా వెళ్ళి హెడ్మాష్టరుకు రిపోర్టుచేశాడు. హెడ్మాష్టరు గారు విద్యార్థు లందరినీ పిలిపించి 'మీరు తప్పుచేశారు కనుక మాష్టరు గారికి క్షమాపణ చెప్పుకోండి' అన్నాడు. మన కుర్రవాడు నిర్భయంగా హెడ్మాష్టరు నెదుర్కొన్నాడు. 'అయ్యా, మీ తీర్పు దొంగే పోలీసును మందలించినట్లుంది. తప్పుచేసింది మేముకాదు. మాష్టరుగారే, కనుక క్షమాపణ చెప్పుకోవలసినది కూడ ఆయనే, మేము కాదు ' అన్నాడు.

హెడ్మాష్టరు నిర్ఘాంత పోయాడు. అసలు విషయాన్ని మాత్రం గ్రహించాడు. వెంటనే సమయస్ఫూర్తితో 'సరే అలాగే మీరు క్లాసుకు వెళ్ళండి' అన్నాడు నవ్వుతూ. కుర్రవాళ్ళందరూ తమ విజయానికి సంబరపడుతూ క్లాసులో ప్రవేశించారు.

* * *

ఒకసారి ఆ కుర్రవాని చంకలో కురుపు లేచింది. అది సెగగడ్డ. ఆ నాడు గ్రామాల్లో ఆపరేషన్లు లేవు. అటువంటి గడ్డలకు యినపకడ్డీలు కాల్చి వాత పెట్టేవారు. ఆ కడ్డీలతో వాటిని కాల్చేవారు. ఆ కుర్రవాడు ఆ సెగ గడ్డకు వైద్యం చేయించేందుకు మంగలి వద్దకు వెళ్ళాడు. మంగలి ఒక యినుపకడ్డీని ఎర్రగా కాల్చాడు. కాని దాన్ని కుర్రవాని చంక కంటించేందుకు భయపడ్డాడు. కుర్రవానికి మాత్రము ఎటువంటి భయం కలుగలేదు. సందేహిస్తున్న మంగలి నతను ఆలస్యంచేస్తే కాలిన కడ్డీ మళ్ళీ చల్లారి పోతుందని విసుక్కున్నాడు. వెంటనే తన పని కానివ్వ మని హెచ్చరించాడు. అయినా మంగలి కాల్చలేక పోతున్నాడు. ఒక్కే

సారితో గడ్డలోని చీము బయటికి రాదని మళ్ళీ రెండోసారి కడ్డీని కురుపులో గుచ్చవలసి వస్తుందని, అలా చేస్తే కుర్రవాడు బాధను భరించలేడని మంగలి భయపడుతున్నాడు. కుర్రవాడు విసుగ్గా 'నీవల్ల కాకపోతే నాకివ్వు' అంటూ, ఆ కాలిన కడ్డీని తన చేతిలోకి తీసుకొని ధైర్యంతో దాన్ని ఛంకపై వున్న కురుపు కంటించాడు. అవసరం కొద్దీ దాన్ని కురుపుకు నాలుగు వైపులా త్రిప్పి కాల్చుకొన్నాడు. చీమంతా బయటికి కారి పోయింది.

* * *

ఆ కుర్రవాడే ఒక నాటికి వకీలయ్యాడు. ఆ వకీలొక పర్యాయం హత్యకేసొక దానిని నడుపు తున్నాడు. తాను సమర్థవంతంగా వ్యవహరించకపోతే ఆ ముద్దాయికి ఉరిశిక్ష పడుతుందని తెలుసాయనకు. వాయిదా రోజున కోర్టులో ముద్దాయి తరఫున వాదిస్తుండగా ఆయనకొక టెలిగ్రాం వచ్చింది. వకీలుగారు టెలిగ్రాం తీసుకొని, ప్రశాంతముగా చదువుకొని జేబులో మడిచి పెట్టుకొన్నాడు. ఆ నాటికి కోర్టు ముగిసే వరకు ఆయన తన వాదన వినిపిస్తూనే వున్నాడు. ఆయన గురించి బాగా తెలిసిన ప్లీడరొకాయన కోర్టు బయటకు వచ్చిన తరువాత టెలిగ్రామేమిటని అడిగాడట. మన వకీలు ప్రశాంత ధోరణిలోనే తన భార్య చనిపోయిందని తెలియజేశారు. అది విన్న వాళ్ళందరూ విస్తు పోయారట. వారు 'భార్య చనిపోయిందని తెలిసికూడ వాదన సాగిస్తూనే వున్నావేమయ్యా!' అన్నారట.

'మరి నేనేమి చేయను? ఆమె ఎలాగా చనిపోయింది. ఇక యీ ముద్దాయిని కూడ ఎలా చంపను?' అన్నాడట గంభీరంగా ఈయన.

అప్పుడే వకీలుగారి వయస్సు 33 సంవత్సరాలే. ఈయన మళ్ళీ వివాహం చేసుకోలేదనే విషయం బహుశః పాఠకులకు తెలియదేమో,

1927వ సంవత్సరం, జులై మాసం ఏడు రోజుల నుండి అహమ్మదా బాదు నగరం తుఫానులో చిక్కుకొని వుంది. ఆనాటి అహమ్మదాబాదు మ్యునిసిపాలిటీ చైర్మన్ మన వకీలుగారే. చైర్మన్‌గా ఆయన ఆందోళన పడ్డాడు. ఆ రాత్రి 12 గంటలకు ఆ తుఫానులోనే ఆయన ఒంటరిగా నగర పర్యటనకు బయలుదేరాడట. దారిలో తన లాంటి మొండి సాహసం గల మిత్రుణ్ణి వెంట తీసుకొని రాత్రంతా ఆయన నగరంలో పర్య టించాడట. ఆ చలిలోనే వారు మ్యునిసిపల్ ఇంజనీరు గారింటికి వెళ్ళారు. ఆ తుఫానులో తెల్లవారక ముందే చైర్మన్‌గారు తన యింటికి రావడం చూసి ఇంజనీరు ఆశ్చర్యపోయారు. ఆ ఇంజనీరును తీసుకొని మళ్ళీ వాళ్ళు నగర పర్యటనకు బయలుదేరారు.

తుఫాను తగ్గలేదు. నగరమంతా జలమయమై పోయింది. నాలుగు రోజుల పర్యంతం రాత్రింబవళ్ళు చైర్మన్‌గారు నిద్రాహారాలు మాని నగర వీధులలో నిలువ వున్న నీటిని బయటకు పంపే ఏర్పాటు చేశారు. ఆయన ధైర్యాన్ని పట్టుదలను గమనించి అనేక మంది నగరవాసులైన ప్రజలు ఆ తుఫానులోనే నగర సంరక్షణ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆ నాడు వరద నీటిని బయటకు పంపివేసే ఏర్పాట్లు జరిగి వుండక పోతే ఈ నాటి అహమ్మదాబాదు నగరం మరొక విధంగా వుండేదని ఈ నాటికీ సౌరాష్ట్ర ప్రజలు అనుకొంటూ వుంటారు.

* * *

ఈ ఘట్టాలన్నీ ఆధునిక భారత రాజకీయ రంగంలో ఉక్కుమనిషిగా ప్రఖ్యాతి పొందిన సర్దార్ వల్లభాయి పటేల్ జీవితానికి సంబంధించినవని పాఠకులు గ్రహించి ఉంటారు. పటేల్ ఆధునిక భారతదేశ నిర్మాతలలో అగ్రగణ్యుడు. ఒకప్పుడీ 'సర్దార్' శబ్దం తిరుగుబాటుకు, గెలుపుకు పర్యాయపదంగా వినిపించింది. కనుకనే సర్దార్ పటేల్ తరచు తన స్నేహితులతో అంటూ వుండేవాడట —

" శూరుడు సంగ్రామానికి వెరచి పారిపోరాదు.
వెరచి పారిపోవు వాడసలు శూరుడేకాడు. "

గట్టి శరీరం, కాకలు దీరిన ముఖం, దృఢమైన దవడలు, శత్రువులను సవాలు చేస్తూ మిత్రులకు అభయమిస్తున్న చురుకైన కళ్ళు యిది గుజరాతుకి గర్వకారణమైన సర్దార్ పటేల్ రూపం. ఆయన కర్తవ్యమార్గంపై ఉపమన్యుని వలె కాలూని నిలవ గలగడం నేర్చుకొన్నాడు. ఆయనొక పనిని సంకల్పించాడంటే దానికి విజయం తథ్యమనే భావించవచ్చు. అగ్ని పర్వతంవలె పట్టిన దాన్ని భస్మంచేయగల సామర్థ్యముందాయనకు. కాని దాని ప్రేలుడు స్వభావం మాత్రం ఆయనకులేదు. సహజంగా చాల తక్కువగా మాట్లాడే స్వభావమాయనది. నిజమైన సైనికుడుగాని, సేనా నాయకుడుగాని ఎప్పుడూ అతిగా మాట్లాడడట. కాని చెప్పిన దానికి మాత్రం తిరుగు వుండదట. సర్దార్ పటేల్ జీవితంలో యిటు వంటి సేనా నాయకుని ఛాయలు స్పష్టంగా గోచరిస్తాయి.

బాల్యం

గీతా సందేశాన్ని వినిపించిన వాసుదేవ కృష్ణుడు, ఆర్య సమాజాన్ని స్థాపించిన మహర్షి దయానందుడు, భారత జాతిపిత మహాత్మా గాంధీ, కాంగ్రెసు అధ్యక్షుడు విఠల్‌భాయి పటేల్ వంటి కార్యశూరులు జన్మించిన పుణ్యభూమిపై జన్మించాడు మన సర్దార్ వల్లభభాయి పటేల్. గుజరాతు రాష్ట్రం మధ్యలో ఆణంద తాలూకా, ఆ తాలూకాలో కరమచంద్ అనే గ్రామం వుంది. ఆ గ్రామంలో పాటీదారులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. ఆ రైతుల కుటుంబంలోనే మన పటేల్ జన్మించాడు. ఈయన తండ్రి జవేరభాయి పటేల్ స్వామి నారాయణ సంప్రదాయానుచరుడు, భక్తుడు. వ్యవసాయం కూడ చేస్తూండేవాడు. భగవద్భక్తితో పాటు దేశ భక్తి ఆయన సొత్తు.

1857 వ సంవత్సరంలో భారతీయులు మొదటిసారిగా ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా సుసంఘటితమైన తిరుగుబాటు జరిపారు. ఆ తిరుగుబాటులో పటేల్ తండ్రి జవేరభాయి పటేలుకూడ పాల్గొన్నాడట. జవేరభాయి విప్లవకారులకు సహాయపడాలనే సంకల్పంతో తనగ్రామం వదలి వెళ్ళాడు. విప్లవకారులకనేక విధాలుగా సహకరిస్తూ తిరుగుతూ ఆఖరుకు ఇందోరు నగరంలో అరెస్టయినాడు. ఇందోరు నరేశ్ మల్హారరావుకు బందీగా పట్టుబడ్డాడు. మల్హారరావు ఆనాడు విప్లవంలో పాల్గొనలేదు. కాని విప్లవకారుల కన్నివిధాల సహకరిస్తూండేవాడని చెపుతారు. బందీగా వున్న జవేరభాయి పట్ల ఆయన కఠినంగా వ్యవహరించలేదట. మల్హారరావు చదరంగ ప్రియుడు. ఒకరోజు తన ఆస్థాన ప్రముఖునితో ఆయన చదరంగం ఆడుతున్నాడట. ఆ రోజు ఏ కారణం చేతనో

ఆయన ఆట అడ్డదిడ్డంగా నడుస్తూంది. ఆయన మనస్సు సరిగా పని చేయుటలేదు. కొంచెం దూరంలో వున్న ఖైదీ జవేరభాయిపటేల్ అది గమనిస్తున్నాడు. జవేరభాయికి చదరంగంలో కూడ మంచి ప్రవేశ ముండేదట. రాజుగారి నడకను వారిస్తూ ఆయన 'ఆగడి కాదు, యీ గడికి నడపండి' అని అరిచాడట. రాజుగారు అదరిపడి మేల్కొన్నాడు. తాను తప్పుదారి నడుస్తున్నానని గ్రహించాడు. వెంటనే పావును సరైన గడిలో పెట్టి తలపైకెత్తి చూశాడట. కొంచెం దూరంలో ఖైదీ జవేరభాయి నిలబడి వున్నాడు. ఆప్యాయంగా వివరాలన్నీ అడిగి తెలుసుకొన్నాడు రాజు. సంతోషించాడు. ఆయనకు జవేరభాయి పట్ల గౌరవభావం కలిగింది. ఆయనను జైలునుంచి తప్పించి తన దేశ గౌరవాన్ని ప్రకటించుకొన్నాడట.

వల్లభభాయి పటేల్ 1875 వ సంవత్సరం అక్టోబరు మాసం ఆఖరి రోజున సాహసోపేతుడు, దేశభక్తుడు అయిన జవేరభాయి పటేల్‌కు పుత్రుడుగా జన్మించాడు. ఆయన తల్లి లాడ్బాయి. అప్పుడు నడియాద్ గ్రామంలో తన తండ్రిగారింట్లో వుంది. పటేల్ తాతగారింట్లో పుట్టాడు. అప్పట్లో పటేల్ తండ్రికంటె తాతగారి ఆర్థిక స్థితి బాగుండేదట. పటేల్ తాతగారింటనే పెరిగాడు. పటేల్ తల్లి లాడ్బాయి లోకానుభవం కలిగిన గృహిణి. సరళ స్వభావం గల గుణవంతురాలు. పేదరికంలో కూడ అతిథి మర్యాదల పట్ల ఎక్కువ మక్కువ కలిగి వుండేదట. గాంధీజీ బోధనల ప్రభావం వల్ల అవకాశం దొరికినప్పుడల్లా ఆమె నిత్యం రాట్నం వడుకుతూ వుండేదట.

లాడ్బాయి జవేరభాయికి రెండవభార్య. ఆ దంపతులకు 5 గురు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. వారిలో మూడవ వాడు విఠల్ భాయి పటేల్, నాలుగవ వాడు వల్లభభాయి పటేల్. వీరిరువురు భారత దేశ చరిత్రలో ప్రముఖ దేశభక్తులుగా ప్రఖ్యాతి నార్జించారు.

వల్లభభాయి జీవితంపై ఆయన తల్లిదండ్రుల ప్రభావం పుష్కలంగా ప్రసరించిందని చెప్పవచ్చు. ధర్మ పరాయణత్వం, సేవా తత్పరత,

సంయమ జీవితం మొదలైన కొన్ని మహత్తర గుణాలనాయన తన తల్లి దండ్రుల నుంచే నేర్చుకొన్నాడు. తన జీవితంలో భయం అనే దాన్నా యన ఏనాడూ ఎరుగడు. ఇక ఆయనలోని ఓర్పు ? కష్ట సహిష్ణుత ఇతరులను ముగ్ధులను చేస్తూండేవి. చిన్నతనంలో చంకపై లేచిన సెగ గడ్డను ఎఱ్ఱగా కాలిన యినుప చువ్వతో స్వయంగా కాల్చుకొన్న వైనం మనకు తెలుసును కదా. ఇంగ్లండులో ఆయన బారిష్టర్ చదివేప్పుడిటు వంటి సంఘటన మరొకటి జరిగింది.

ఆ రోజుల్లో ఆయనకు జ్వరం తగిలింది. కాలిలో విపరీతంగా పోటు వచ్చింది. డాక్టరు పరీక్షించి 'నారి కురుపు - ఆపరేషన్ చేయాలి' అని చెప్పాడు. ఆపరేషన్ ఒకసారికాదు, రెండుసార్లు చేసినా అది తగ్గ లేదు. కాలు తీసివేయవలసి వుంటుందన్నారు డాక్టర్లు. తాను కుంటి వాడవడం పటేల్‌కిష్టం లేదు. కాలును మరొక పర్యాయం డాక్టరుకు చూపించాడాయన. ఆ డాక్టరు పరిశీలించి 'మరొకసారి ఆపరేషన్ చేద్దాం, అయితే మత్తుమందు లేకుండా ఆపరేషన్ చేస్తే అధిక ప్రయో జనముండవచ్చు' అన్నాడు.

పటేల్ 'నాకు మత్తుమందవసరము లేదండీ. ఎంత బాధయినా నేను భరించగలను' అన్నాడు సంతోషంతో.

అలాగే ఆపరేషన్ జరిగింది. అద్భుతం - ఆపరేషను మధ్యలో ఆయనేమాత్రం చలించలేదు 'అబ్బా' అనలేదు. డాక్టరూ అతని సహా యకులు ఆశ్చర్యపోయారు. 'ఏమి మనిషి! యిటువంటి రోగిని మేము ఇంతవరకు చూడలేదు' అని విస్తుపోయారు వారు.

ఇటువంటి కథలెన్నో దొర్లాయి సర్దార్ పటేల్ జీవితంలో. నిజంగా 'పటేల్' మొండి వైఖరికి మారుపేరని చెప్పవచ్చు.

ఆయన వకీలుగా వున్ననాటి విషయం—ఒకసారి గోధరాలో ప్లేగు వ్యాధి వ్యాపించింది. కోర్టు హెడ్ క్లర్కు కుమారునికి ప్లేగు సోకింది. పటేల్ రాత్రింబవళ్ళు ఆ కుఱ్ఱవానికి సేవ చేశాడు. కుఱ్ఱవాడు దక్కలేదు,

చనిపోయాడు. కాని పటేల్ స్వయంగా ప్లేగు వ్యాధికి గురయ్యాడు. ప్లేగు జ్వరం ప్రమాదకరమైనది. ఆ రోజుల్లో పెద్ద పెద్దవాళ్ళనది పొట్టన పెట్టుకొంది. పటేల్ తన భార్యను తీసుకొని ఆణంద్ వెళ్ళాడు. భార్యతో 'నీవు కరంసద్ వెళ్ళు. నేను నడియాద్ వెళతాను. అక్కడ నా వ్యాధి కుదురుతుంది.' అన్నారాయన.

భర్త ప్లేగు వ్యాధితో బాధ పడుతూండగా భార్య భర్తను వదలి మరొక చోటికి వెళ్ళడం బాధాకరమైన విషయమనే చెప్పుకోవాలి. కాని ఆమె ' సర్దార్ సతీమణి ' అనిపించుకోవలసి వుందికదా. భర్త చెప్పిన ప్రకారమే ఆమె కరంసద్ వెళ్ళక తప్పలేదు.

చదువుకొరకు సర్దార్ వల్లభభాయి పటేల్ కరంసద్, పెట్లాద్, నడియాద్, బరోడా మొదలగుచోట్లకు వెళ్ళవలసి వచ్చింది. ఎక్కడికి వెళ్ళినా ఆయన 'సర్దార్'గానే జీవించాడు. నడియాద్ ఆయన తాతగారి గ్రామం. అది విద్యాంసుల కాటపట్టు. పటేల్ నడియాద్‌లోని హైస్కూలులో చేరిన తరువాత అక్కడి ఇంగ్లీషు చదువులు బాగుగా లేవని భావించి బరోడా వెళ్ళి అక్కడి హైస్కూలులో చేరాడు. ఆ స్కూలులో గుజరాతీ భాషోపాధ్యాయుడు శ్రీ ఛోటాలాల్ జీ. ఆయన చెప్పేది గుజరాతీయే కాని సంస్కృత భాష పట్ల ఆయనకు మమకారం ఎక్కువ. కుర్రవాడెవడైనా సంస్కృతం వదలి గుజరాతీ క్లాసుకొస్తే బాధపడేవాడట. వల్లభభాయిపటేల్ క్లాసుకు రావడంతోనే ఆయన నవ్వుతూ ప్రశ్నించాడట— 'దయచేయండి మహాశయా, తమరు సంస్కృతాన్ని కాదని గుజరాతీ తీసుకొన్నారు. అయితే సంస్కృతం సరిగా రాని వారికి గుజరాతీ భాష కూడ రాదని తమకికి తెలియదా!'

ఛోటాలాల్‌గారి ధోరణి పటేల్‌గారికి నచ్చలేదు. దాన్ని తన కవమానకరంగా భావించాడు. వెంటనే యీ విధంగా జవాబిచ్చాడు— 'తెలుసునండీ కాని మేమందరం సంస్కృతం తీసుకొంటే తమ క్లాసుకెవరూ రారుగదండీ మరి తమరు యింటివద్దనే వుండిపోవలసి వస్తుందే!'

ఛోటాలాల్‌గారి మెదడుకు పాకు తగిలింది. ఆయనగారి కటువంటి కటు అనుభవమంతవరకు పూర్వం కలుగలేదు. ఇంత నిర్మొగమాటంగా జవాబు వస్తుందని ఆయననుకోలేదు. అప్పుడాయన క్రుద్ధుడై పటేలును బల్లపై నిలబెట్టించాడు. అంతేగాక ఒకటినుండి పది వరకు ఎక్కాలు వ్రాసుకు రావలసినదిగా ఆజ్ఞాపించాడు.

వల్లభభాయి ఛోటాలాల్‌గారి ఆజ్ఞను తన కవమానకరంగా భావించాడు. ఆయన ఎక్కాలు వేసికొని రాలేదు. ఆ కారణంగా ఆయనకు దండన మరింత పెరిగింది. ఆయన దాన్ని మరింత అవమానకరంగా భావించి ఎక్కాలు వేయలేదు. ఈ విధంగా యిరువురి మధ్య పట్టుదల పెరిగి 200 ఎక్కాల వరకు వేసికొని రావలసినదిగా ఆదేశించ బడింది. మరునాడు క్లాసులో మాష్టరు గారు 'ఏమండీ మహాశయులూ, పాడా లెంతవరకు వేసికొచ్చారు ? ఇంతకు పాడాలు తెచ్చారా లేదా ?'' అని పటేల్ నడిగాడు. 'పాడా' అంటే గుజరాతీ భాషలో రెండు అర్థాలున్నాయి. ఒకటి ఎక్కము, రెండు దున్నపిల్ల. వల్లభాయి తడుముకొనకుండ జవాబు చెప్పాడు - "రెండు వందల పాడాలను తెచ్చానండి. కాని వాటిలో రెండు యీ తలుపు దగ్గరకు రాగానే గుంజు కొని పారిపోయాయి. వాటిని చూసి మిగతావన్నీ లోపలికి రాకుండానే పారిపోయాయండీ"

ఎంత ఘాటైన సమాధానం ! విలక్షణమైన వ్యంగ్యం !! ఛోటాలాల్ మాష్టరుగారది సహించలేక పోయాడు. క్రుద్ధుడై 'రేపు నీవు పాడాలు వేసుకు రాకపోతే నీ అంతు తేల్చుతాను. జాగ్రత్త !' అన్నాడు.

మరునాడు కాగితంపై 'రెండు వందలు ఎక్కములు'' అని స్పష్టముగా వ్రాసి అది మాష్టరు ముందు బల్లపై పెట్టాడు. మాష్టరుగారు ఉగ్రుడయాడు. ఒక విద్యార్థి ద్వారా తనకు జరిగిన అవమాన మది ! వెంటనే విద్యార్థి వల్లభభాయి దోషిగా హెడ్మాష్టరు ముందు హాజరుపెట్ట బడ్డాడు. ఆనాడు పటేల్ తన అపరాధానికి చెప్పుకొన్న

సంజాయిషీ ఆయన వ్యక్తిత్వాన్ని తెలియ జేస్తుంది. ఆయన హెడ్మాష్టరు గారితో యీ విధంగా చెప్పాడు. "అయ్యా, నేను దురుసుగా యిచ్చిన సమాధానానికి నన్ను మాష్టరుగారు బెంచిపై ఎక్కించారు. నేను బెంచిపై నిలబడ్డాను. కాని తరువాత నన్ను పాఠాలు వేసు కొని రమ్మనడం ససేమిరా అన్యాయం. నేను ఆరవ తరగతి విద్యార్థిని. ఒకటి రెండు తరగతులు చదువు విద్యార్థుల కిచ్చినట్టు నన్ను పాఠాలు వేసుకొని రమ్మనడం నాకవమానకరం కాదా! మరేదైనా నా క్లాసు పుస్తకం నుంచి కొంత వ్రాసుకొని రమ్మంటే బాగుండేది. అది నాకు కొంత ఉపయోగ పడేది కూడ. నేను చదువు తరగతికి తగినట్లుండేదా దండన. కాని మాష్టరుగారు నాపట్ల అన్యాయంగా వ్యవహరించారు. కనుక నేనాయన ఆదేశాన్ని పాటించలేదు. దీనికి మీరు నాకేమి దండన విధిస్తారో విధించండి. సంతోషంగా స్వీకరిస్తాను."

అంతా విని హెడ్మాష్టరు గారు విద్యార్థిని నిర్దోషిగా నిర్ణయించాడు. ఈ విజయం వల్లభభాయి పటేల్‌కు మొదటి సత్యాగ్రహ పాఠంగా ఉపక రించింది.

మెట్రిక్ పరీక్ష ప్యాసైన తరువాత పటేల్ జిల్లా వకీలు పరీక్షకు కూర్చోవాలని ప్రయత్నించారు. పేదరికంవల్ల అందుకు కావలసిన పుస్తకాలు కొనలేక పోయాడు. పాత పుస్తకాలను ఎరువు తెచ్చుకొని చదువు కొన్నారు. అయినా మొదటి యత్నంలోనే పరీక్ష ప్యాసై పోయాడు. పటేల్ మహత్వాకాంక్షి. బారిష్టరు చదువుకు విదేశాలు వెళ్ళాలని కాంక్షించారు. అయితే ఆయన దగ్గర డబ్బులేదు. సరే కొంత కాలం వకీలుగా డబ్బు సంపాదించి ఆ తరువాత విదేశాలకు వెళ్ళాలని నిశ్చయించు కొన్నారు.

వకీలు జీవితం

వల్లభభాయి పటేల్ వకీలుగా పేరు - ప్రతిష్ఠలు సంపాదించారు. అసలాయన స్వభావరీత్యా ధైర్యస్థుడు. పైగా గర్విష్ఠులైన మేజిస్ట్రేటులకు గుణపాఠం చెప్పడంలో సిద్ధహస్తుడు. పట్టిన కేసులను గెలిపించాలనే గట్టి పట్టుదల గల మనిషి. ఈ విషయంలో ఆయనను గురించి మనమింతకు పూర్వమే తెలుసుకొన్నాం గదా. వకీలుగా ఆయన ప్రతిష్ఠ పెరగడానికిది బలమైన కారణం.

ఒక పర్యాయం ఆబ్కారీ శాఖ యిన్స్పెక్టరు ఒకరు చట్ట విరుద్ధంగా సారా తయారు చేసే వాడినొకణ్ణి పట్టిఅరెస్టు చేశాడు. అతని దగ్గర రెండు సారా సీసాలుకూడ వున్నాయి. ఆ సీసాలు మేజిస్ట్రేటు ముందు దాఖలు చేయబడ్డాయి. ఆ నేరస్థుడు పటేల్ గారిని తన వకీలుగా పెట్టుకొన్నాడు. కేసు నడిచింది. కోర్టులో వాద ప్రతివాదనలు జరిగేటప్పుడు ఇన్స్పెక్టరు కేసుకు సాక్ష్యంగా ఆసారా సీసాలను ప్రవేశ పెట్టాడు. పటేల్ సారా సీసాలను చూసి యీ సీసాలలో ఏముందో ముందు పరీక్ష చేయించాలన్నారు. డాక్టరు పరీక్షవల్ల ఆ సీసాలలో సారాకాక పరిశుద్ధ జలముందని తేలింది. ఇన్స్పెక్టరు కంగారు పడ్డాడు. నోరు తెరిచాడు. ఏం చేస్తాడు పాపం! సరైన సాక్ష్యం లేని కారణంగా కేసు కొట్టివేశారు. పటేల్ గెలిచాడు.

కోర్టు బయటికి వచ్చిన తరువాత ఆ ఇన్స్పెక్టరు వకీలుగారి నడిగాడు- " ఏమండీ ప్లీడరుగారూ, యిదేమిటండీ ఆశ్చర్యం ! సీసాలలో వున్న సారా ఏమైపోయినట్లు ? నీరుందేమిటి ? "

పటేల్ నవ్వుతూ అన్నారు – " మీకు తెలియదు నాకు తెలుసు.

మేజిస్ట్రేటు త్రాగుబోతు. సారా ఆయన త్రాగి సీసాలను నీటితో నింపి వుంచాడు. "

ఆ రోజుల్లో గులాబ్ రాజా అనే దోపిడి దొంగ ఒకడుండేవాడు. అతను పుట్టుకతో దొంగ కాదు. సహవాస దోషం వల్ల, కలుషితమైన సంఘ వ్యవస్థ వల్ల ఎందరో మంచి వాళ్ళు దొంగలుగా మారిపోతున్నారు కదా. గులాబ్‌రాజా కూడ అలాగే కొన్ని కారణాలవల్ల మధ్యలో దొంగగా మారాడు. అతను చురుకైన వాడు, తెలివైనవాడు. పెద్ద పెద్ద దోపిళ్ళు నడిపించాడు. అతని గురించి ఆనాటి కలెక్టరు మిష్టర్ ఉడ్ దగ్గరకు కూడ భోగట్టా చేరింది. కలెక్టరు గులాబ్‌రాజును బంధించి తన ముందు హాజరు పెట్టవలసినదిగా పోలీసు సిబ్బందిని ఆదేశించాడు. సంయోగ వశాత్తు గులాబ్‌రాజా ఆ సమయంలో అక్కడనే వున్నాడు. అతను కలెక్టరుతో అన్నాడు — " నేనే గులాబ్‌రాజా నండీ. నాకు మీరు శిక్ష విధించాలని చూస్తున్నారు. కాని నన్ను మీరేమీ చేయలేరు. అయినా నేరం చేస్తూండగా పట్టుబడి మీదగ్గరకు తీసుకొని రాబడితే మీరు నాకు శిక్ష విధించాలి. కాని నేను నేరస్థుడను కానని మీరు తెలుసుకొనాలి "

గులాబ్‌రాజా అలా అంటూనే అక్కడి నుంచి మెరుపులాగ మాయమైనాడు. కలెక్టరు తన కది అవమానకరంగా భావించాడు. అప్పుడాయన గులాబ్‌రాజా తనపై దాడి చేశాడని, తనను రాళ్ళతో కొట్టాడని కేసు పెట్టాడు. కలెక్టరు పట్టుదల కారణంగా గులాబ్‌రాజాకు 9 మాసాల జైలు శిక్ష పడింది. ఇక గులాబ్‌రాజా పూర్తిగా తిరుగుబాటు దారయ్యాడు. దోపిడీల కంకితమై పోయాడు. అతను సర్దార్ పటేల్ దగ్గరకు లీగల్ ప్రకారం సలహాకొరకు వస్తూండేవాడు. ఈ విషయం పోలీసు అధికారికి తెలిసింది. గులాబ్‌రాజా దొంగ, దోపిడీదారు కనుక అతణ్ని పట్టియివ్వ వలసినదిగా ఆయన పటేల్‌గారికి కబురు పంపాడు.

పటేల్ యీ మాత్రానికి చలిస్తాడా ? ఆయనీ విధంగా వర్తమానం పంపాడు — " గులాబ్‌రాజా నాదగ్గర కొస్తూండేమాట నిజం, కాని

అతను నా పట్ల పెద్ద నమ్మకంతో వస్తున్నాడు. నేను మాత్రం నమ్మక ద్రోహం చేయలేను."

అధికారి అంతటితో సరిపెట్టుకొన లేదు. పటేల్ జీని లోభపెట్ట యత్నించాడు. గులాబ్ రాజాను ప్రభుత్వానికి పట్టియిస్తే మీకు పోలీసు ప్రాసిక్యూటరు పదవి లభిస్తుందని వ్రాసి పంపాడు.

వల్లభభాయికి ఒళ్ళు మండిపోయింది. ఇలా తిరుగు జవాబిచ్చి పంపాడు.- "ఇటువంటి వెధవ పనులుచేసి నేను ప్రాసిక్యూటరు కావాలని కోరడం లేదు. ఇటువంటి కానిపనులు చేసేవాడు వెధవ గాక మరేమిటి ? " అని విసుక్కున్నాడు.

మునసబు కోర్టులోకి ప్లీడరు వెళ్ళేందుకు వేరే ఒక ద్వార బంధం వుండేదట. అక్కడినుంచే ప్లీడర్లు కోర్టులోనికి రావడం, బయటికి వెళ్ళడం జరుగుతూండేది. అయితే ఒక పర్యాయం కోర్టు మునసబు తరచు రాకపోకల వలన విచారణ సమయంలో కొన్ని యిబ్బందులు కలుగు తున్నాయని ఆ ద్వారం మూయించివేశాడు. ఆ ద్వారం మూసినందు వల్ల ప్లీడర్లకు యిబ్బంది కలిగింది. వారు కోర్టుకు రావడంలో ఆలస్యమేర్పడేది. ఏ సమయంలో ఏ లాయరుతో అవసర మొస్తుందో తెలుసుకోవడం కూడ కష్టమైంది. లాయర్లందరూ కలిసి మునసబు దగ్గరకు వెళ్ళి, తమ యిబ్బందిని చెప్పుకొన్నారు. ఆ ద్వారం మళ్ళీ తెరిపించ వలసినదిగా కోరారు. మునసబు వారి కోర్కె నంగీకరించలేదు. ఆ రోజుల్లో వల్లభ భాయి పటేల్ క్రిమినల్ కోర్టుకు తరచు వెళుతూండేవారు. ఆయనకు క్రిమినల్ కేసు లధికంగా వుంటూ వుండేవి. కొన్ని రోజుల తరువాత ఆయన పనిమీద మునసబు కోర్టు కొచ్చాడు. అప్పుడాయనకా ద్వారం సంగతి తెలిసింది. ఆయన లాయర్లందరినీ సమావేశ పరచి ద్వారం వెంటనే తెరిపించకపోతే సమ్మె చేస్తామని కోర్టు మునసబుతో చెప్పవలసినదిగా సూచించారు. ఈ వార్త మునసబుగారికి తెలిసింది. అయితే ఆయన వెంటనే లొంగుతాడా ? కాని ఖేడా జిల్లా జడ్జి మునసబుగారిని

పిలిపించి వెంటనే తగాదా పరిష్కరించు కోమని హెచ్చరించినప్పుడు ఆయన కంగారు పడ్డాడు. ఒక పరిచితుడైన లాయరును పిలిపించి తగాదాను రాజీ పర్చవలసినదిగా కోరాడు. ఆ లాయరు పటేల్ గారి వద్దకు వచ్చి మిమ్మలను మునసబుగారు తమ యింటి వద్ద కలుసుకొన వలసినదిగా కోరారని చెప్పాడు. పటేల్‌జీ 'ఆయన యింటికి వెళ్ళవలసిన అవసరం నాకు లేదు. ఎవరికి అవసరం కలిగితే వారే వస్తారు' అని టలాయించారు.

ఎంత కాదన్నా కోర్టు మునసబు గదా, ఒక లాయరింటికి రావడం తన మర్యాదకు భంగకర మనుకొన్నాడు, అయితే తగాదా పరిష్కరించుకోవడం కూడ అవసరమే. 'నేను తగాదా పరిష్కరించుకొన దలచాను కనుక యితర లాయర్లతో పాటు నాయింట యిష్టా గోష్ఠికి మీరు కూడా హాజరు కావలసింది' అని ఆయన మరల పటేల్ గారికి వర్తమానం పంపాడు, తనింట యితర పెద్దలతో తేనీరు తీసుకొని వెళ్ళ వలసినదిగా కోరాడు.

"వస్తాను. కాని మీవల్ల జరిగిన పొరపాటుకు మీరు ముందు బాధను ప్రకటించవలసి వుంటుంది" అని పటేల్ ఆయనపై షరతు విధించారు. పాపం మునసబుగారు చిక్కులో పడ్డాడు. కాని వేరే గత్యంతరం లేదు. ఇటువంటి లాయరు నీయనంత వరకు చూడలేదు. షరతుని అంగీకరింపక తప్పలేదు. ఆయన తన తొందరపాటు చర్యకు క్షమాపణ చెప్పుకొని లాయర్లందరిని తనింట సమావేశ పరచారు. వారికి తేనీరిచ్చి, మూసి వేయించిన ద్వారం మళ్ళీ తెరిపించాడు.

వల్లభభాయి పటేల్ తెలివి తేటలను సూచించే మరొక విచిత్ర సంఘటన - పటేల్ గారికి పరిచయస్థుడైన ఒకాయన రైల్వే పోలీసు ఇన్స్పెక్టరుద్యోగంలో వుండేవాడు. ఆయనకు తనపై అధికారితో సరిపడేదికాదు. ఆ అధికారి ఆంగ్లేయుడు, అతని సోదరులైదుగురు పెద్ద పెద్ద ఉద్యోగాలలో వుండేవారు. ఆయనొక పర్యాయం ఇనస్పెక్టరుపై ఒక రూపాయి

విలువ కలిగిన కట్టెపుల్లలు దొంగిలించాడనే ఆరోపణపై కేసు పెట్టాడు. ఆ రోజుల్లో రైల్వేశాఖలో తరుచుగా దోపిడీలు, దొంగతనాలు జరుగుతూనే వుండేవి. కనుక ఆచిన్న విషయం పెద్ద సమస్యగా తయారై కూర్చుంది. ఆ దొంగతనం కేసు దర్యాప్తు కొరకొక ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వం తరపున వాదించేందుకు అహమ్మదాబాదునుంచి గవర్నమెంటు వకీలు రప్పించబడ్డాడు. కేసు కోర్టుకొచ్చేందుకు ముందు దానిదర్యాప్తు ఆంగ్లేయాధికారే స్వయంగా జరిపాడు. అసలా దొంగతనానికి పూర్వం సబినస్పెక్టరుగారి కేదైనా నేరంలో శిక్ష పడివుందేమో తెలుసుకుందామని ఆయన ప్రయత్నించాడు.

పోలీసు యినస్పెక్టరు తనకేసు వివరాలన్నీ పటేల్‌గారికి అప్పజెప్పాడు. పటేల్‌గారి సలహాపై ఇనస్పెక్టరు స్వయంగా ఆంగ్లేయాధికారి దగ్గరకు వెళ్ళి తనకింతకు ముందొక కేసులో శిక్ష పడిందని చెప్పాడు. ఆశ్చర్య సంభ్రమాలతో అడిగాడా అధికారి ఎంత శిక్ష పడిందని.

'తొమ్మిది మాసాలు' అంటూ ఇనస్పెక్టరు జైలుశిక్ష ఒంటరిగా అనుభవించానన్నాడు.

'సరే- ఎంతకాలమైంది ?' అని మరల అడిగాడు అధికారి.

'అబ్బో చాలాకాలమైంది.— సుమారు 30 సంవత్సరాలు దాటి వుంటుంది!' అన్నాడు ఇనస్పెక్టరు.

తనకు కావలసిన సమాచారం దొరికిందనుకొన్నాడా అధికారి. వివరాలన్నీ వ్రాసుకొని కోర్టుకు పంపాడు. కేసు విచారణకు వచ్చేనాటికి మన వల్లభభాయి పటేల్ జబ్బుపడ్డాడు. 'ఆయన తరపున ఆయన అన్న విఠల్‌భాయి పటేల్ కోర్టుకు హాజరై ముద్దాయి పక్షాన వాదించాడు. విఠల్‌భాయి పటేల్ ఆవేశపరుడు, యుద్ధప్రియుడు. ఆయన గవర్నమెంటు వకీలుతో వాగ్యుద్ధానికి దిగాడు. దానివల్ల పరిస్థితి విషమించింది. ముద్దాయి యినస్పెక్టరుకు 6 నెలలు జైలు శిక్ష పడింది.

వల్లభభాయి పటేల్‌కీవిషయం తెలిసింది. ఆయన ఆందోళన పడ లేదు, ఆదుర్దా చెందలేదు. యినస్పెక్టరును జామీనుపై విడుదల చేయ యత్నించాడు. పైకోర్టుకీ కేసును అప్పీలు చేయించాడు. కేసు విషయంలో అక్కడ వాదించేందుకొక బారిష్టరును పిలిపించాడు. అయితే ప్రభుత్వం జామీనుపై నేరస్థుని విడుదలచేయ నిరాకరించింది. అప్పుడు పటేల్ అప్పీలును వెంటనే విచారణకు రావలసిందిగా కోరు కున్నాడు. అప్పీలు విచారణకొచ్చింది. గవర్నమెంటు వకీలు తీవ్రంగా వాదిస్తూ "ఇటువంటి నేరాలు తరుచు పట్టుబడుతూంటాయి. అందులోను నేరస్తుడు పోలీసు యినస్పెక్టరు. ఎంత దారుణమైన విషయం! కంచే చేను మేస్తే కాపుకు దిక్కేమిటి?" అన్నాడు.

ముద్దాయి తరఫు బారిష్టరు "మొదటగా నేరాన్ని ఋజువు చేయండి. ఆ తరువాత నేరస్థుడెవరో నిర్ణయించండి. నేరం ఋజువుకానిదే నేర స్థుని గురించి మాట్లాడరాదు." అని గర్జించాడు.

'నేరస్థునికింతకు పూర్వమే ఒక పర్యాయం మరొక కేసులో జైలు శిక్ష విధించడం జరిగింది. ఆ నేరాన్ని గురించికూడ యోచించండి' అన్నాడు గవర్నమెంటు వకీలు.

ముద్దాయి తరఫు బారిష్టరు చకితుడై నిలబడి పోయాడు. జడ్జి బారి ష్టరును జవాబివ్వవలసిందిగా హెచ్చరించాడు. బారిష్టరు వల్లభభాయి పటేల్‌పై మండి పడ్డాడు. నాకీవిషయం ముందే తెలిసివుంటే కేసును అప్పీలు చేయవలసిందిగా సలహా యిచ్చివుండేవాడిని కాదని విసుక్కు న్నాడు.

బారిష్టరు వాదించడం మానుకొని కుర్చీలో కూలబడ్డాడు. కోర్టులో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ప్రేక్షకులతోసహా అందరూ ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. అది వల్లభభాయి కేసవడంవల్ల జనం మరింత ఉత్సాహంతో గుమికూడారు. మొత్తంమీద కథ అడ్డం తిరిగింది. తప్పించుకోవడం కష్టమే. అట్టి పరిస్థితిలో పటేల్ లేచి, "నేరస్థునికింతకు,

పూర్వమే విధించిన శిక్ష ఏమిటో, అదెందుకు విధించబడిందో దయచేసి కోర్టువారు వివరించాలి." అన్నాడు.

జడ్జి పటేల్ కోర్కె నంగీకరించాడు. దానిమీద గవర్నమెంటు వకీలు "నేరస్థుడు స్వయంగా తనకు పడినశిక్ష నంగీకరించగా దీనికిప్పుడు ఋజు వేమిటి? వివరాలెందుకు?" అని మండిపడ్డాడు.

పటేల్ లేచి కేసు వివరాలను గంభీరంగా కోర్టువారికి చదివి వినిపిస్తూ యిలా అన్నాడు— "ముద్దాయికి 9 మాసాల జైలుశిక్ష పడినట్లు దీనిలో వ్రాసి వుంది."

గవర్నమెంటు వకీలు అవునన్నాడు.

"అయితే ఒంటరిగా శిక్ష ననుభవించినట్లున్నాడు." అని అర్థాన్యాసంగా చదివాడు పటేల్.

"నో దఫుట్ - - అతని నేరం తీవ్రమైనదై వుంటుంది." అన్నాడు గవర్నమెంటు వకీలు.

"నేరస్థునికి శిక్ష 30 సంవత్సరాల పూర్వం పడినట్లుంది." అన్నాడు కాగితం తిరగేస్తూ పటేల్.

"అవునండి అంతా వ్రాసి వుంది" – గవర్నమెంటు వకీలు విసుగ్గా అన్నాడు.

"అవునండి అంతా వ్రాసేవుంది. వ్రాసి వున్నదాన్నే నేను చదువు తున్నాను. దీనిలో నేరస్థుని వయస్సిప్పుడు 30 సంవత్సరాలని కూడ వ్రాసి వుంది." పటేల్ గంభీరంగా అన్నాడు.

గవర్నమెంటు వకీలుగారామాట విని అదిరిపడి చిత్తరపోయాడు. 30 సంవత్సరాల వయస్సువారికి 30 సంవత్సరాల పూర్వం 9 మాసాల జైలు శిక్ష! పరమాశ్చర్యం! అదికూడ ఒంటరిగానట!!

కోర్టువారికి విషయం బోధపడింది. కేసు అపహాస్యపాలై పోయింది. కోర్టు హాలంతా నవ్వులతో మారుమ్రోగి పోయింది, గవర్నమెంటు

వకీలు ముఖం తేలవేశాడు. అతని విలక్షణమైన వాదనాపటిమ, ఆంగ్లేయుడైన పోలీసు ఆఫీసరు వ్యవహార దక్షత — అన్నీ ఒక్క పాయిం టుతో నీరుకారి పోయాయి. పటేల్ తన వాదన సాగించాడు. ఫిర్యాదు పక్షాన్ని తూర్పారబట్టాడు. కేసు వీగి పోయింది. యినస్పెక్టరు నిర్దోషి అని తీర్పుచెప్పాడు జడ్జి. అంతేకాదు, వ్యర్థంగా ఆయనపై కేసు మోపిన ఆంగ్లేయాధికారి కోర్టువారి తీవ్ర విమర్శకు గురైనాడు. అతని ఉద్యోగం కూడ వూడిపోయింది.

పటేల్‌గారికి విదేశాలు వెళ్ళి, బారిష్టరు చదువు చదవాలనే కోర్కె మాత్రం తగ్గలేదు. అందుకాయన ప్రయత్నం మానలేదు. విదేశాలలో తనకు కావలసిన ధనాన్ని ప్లీడరీ వృత్తి ద్వారా కొంత కూడబెట్టుకొన్నాడు. విదేశ యాత్రకు కావలసిన ఏర్పాట్లు చేసేందుకు ఒక యాత్రా కంపెనీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. అయితే సంయోగవశాత్తు ఆ కంపెనీ వ్రాసిన ఉత్తరం ఆయన అన్నగారి చేతుల్లో పడింది. కారణం ఇంగ్లీషులో వారిద్దరి పేర్లు వి. బి. పటేల్‌గా వుండేవి. ఉత్తరం చదివి అన్నగారసలు విషయం తెలుసుకొన్నాడు. ఆయనకుకూడ విదేశాలకు వెళ్ళి చదువు కోవాలనివుండేది. ఆయనన్నాడు— "అబ్బాయి. నేను నీకంటె పెద్దవాణ్ణి. నన్ను ముందు ఇంగ్లండు వెళ్ళనివ్వు. నేను తిరిగి వచ్చిన తరువాత నీవు వెళ్ళవచ్చును. నీవే ముందు వెళ్ళితే నేనిక వెళ్ళలేను కదా!"

అన్నగారి కోర్కెను తమ్ముడు కాదనలేక పోయాడు. ఆ ప్రకారమే అనుకున్న 15వ రోజున అన్నగారు ఇంగ్లండు వెళ్ళి, మూడు సంవత్సరాలకు తిరిగి వచ్చాడు. ఆయన చదువు పూర్తి చేసుకొని తిరిగి వచ్చిన తదుపరి మన వల్లభభాయి పటేల్ ఇంగ్లండు వెళ్ళాడు. ఎంత ఔదార్యం!

వల్లభభాయి పటేల్ ఇంగ్లండులో తనబారిష్టరు చదువుని అతి పట్టుదలతో సాగించాడు. అక్కడి భోగ విలాసాలకు దూరంగా నిరాడంబర జీవితాన్ని సాగించాడు. ఆయన నివసించిన చోటునుంచి 'మిడిల్ టెంపుల్'

పదకొండు మైళ్ళు దూరముండేదట. ఉదయం తెలికగా భోజనం చేసి బయలుదేరేవాడట. కాలినడకన పదకొండు మైళ్ళు నడచి గ్రంథాలయం తెరిచే వేళకు 'మిడిల్ టెంపుల్' చేరుకొని అక్కడ పగలంతా న్యాయశాస్త్ర గ్రంథాల నధ్యయనం చేసేవాడట. మధ్యాహ్నం బ్రెడ్డు పాలు తీసికొని సాయంత్రం గ్రంథాలయం మూసివేయబడేంతవరకు గ్రంథపఠన, పరిశీలనలో మునిగి వుండేవాడట. ఈవిధంగా పట్టుదలతో అధ్యయనం చేసి న్యాయశాస్త్ర పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడవడమే కాకుండా ప్రథమ స్థానాన్నికూడ సాధించాడు. ఆయనకు ఉత్తమ విద్యార్థిగా బహుమతులు లభించాయి. రెండు టరం ఫీజుల మాఫీకూడ లభించింది. ఆనాడు పరీక్ష పేపర్లు దిద్దిన ఎగ్జామినర్సు పటేల్ సాధించిన న్యాయశాస్త్ర పరిజ్ఞానానికి ముగ్ధులైనారట. చీఫ్ ఎగ్జామినరు ఆనాటి బొంబాయి హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు పటేల్ ప్రతిభను గురించివ్రాస్తూ ఆయన గొప్ప న్యాయమూర్తిగా రాణించగలడు గనుక న్యాయశాఖలో ఆయనకొక గొప్ప పదవి ఇవ్వవలసినదిగా సిఫార్సు చేశాడట.

అయితే వల్లభభాయి పటేల్ ఆ సిఫార్సును వినియోగించుకోలేదు. కారణం - ఆయన న్యాయమూర్తిగా పేరు గడించాలని భావించలేదు. అహమ్మదాబాదులో బారిష్టరుగా జీవితాన్ని ప్రారంభించాడు. లోగడే కొంత ప్రతిష్ఠ సంపాదించి వున్నాడు గనుక అనతి కాలంలోనే ఆయన సమర్థుడైన బారిష్టరని ప్రఖ్యాతి సంపాదించాడు.

ఆ రోజుల్లో వల్లభభాయి పటేల్ తన అన్నగారితో ఒక ఒడంబడిక చేసుకొన్నాడట. భారత దేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలంటే తమ యిరువురిలో ఒకరు దేశసేవ కంకితమవ్వాలనేదే ఆ ఒడంబడిక సారం. ఆ ప్రకారం యిరువురిలో అన్న విఠల్‌భాయి పటేల్ స్వాతంత్ర్య సమరంలో ప్రవేశించి దేశసేవ చేసేటట్లు, తమ్ముడు వల్లభభాయి న్యాయవాద వృత్తిలోనుంచి ధనం సంపాదించేట్లు - అంటే ఆ విధంగా అన్న పుణ్యం మూటగట్టేట్లు, తమ్ముడు పాపాన్ని ప్రోగుజేసేట్లు బాధ్యతలను పంచుకొన్నారట. అయితే తమ్ముడు వల్లభభాయి పటేల్ తన అన్న

సంపాదించు పుణ్యంలో తనకు కూడ భాగం వస్తుందనే నమ్మకంతో వుండే వాడట. కాని ఆనాడాయన తాను కూడ ఒకప్పుడు పాపం మూటబెట్టడం మానివేసి పుణ్యం సంపాదించడంలోనే నిమగ్నుడవుతానని వూహించి వుండలేదేమో!

రామకృష్ణుని వివేకానందుడు

1915 లో గాంధీజీ దక్షిణాఫ్రికానుంచి భారతదేశమొచ్చారు. అప్పు డాయన అహమ్మదాబాదులోని కోచవరం వద్ద ఆశ్రమం నిర్మించుకొని వుండనారంభించారు. వల్లభభాయి ఆరోజుల్లో గాంధీజీని గురించి అలక్ష్యంగా మాట్లాడేవాడు. ఆయన సిద్ధాంతాలను, నమ్మకాలను ఎగతాళి చేసేవాడట. ఆయనను చూడడానికెళ్ళే వాళ్ళను కూడ చులకన చేసేవాడట. 'ఆశ్రమంలో ఏముందయ్యా, గోధుమలలోని రాళ్ళేరుకొంటూ కూర్చోవడం తప్ప! ఈమాత్రానికే దేశానికి స్వరాజ్యం వస్తుందా?' అని చులకనగా మాట్లాడేవాడట.

కాని వల్లభభాయి గాంధీజీకి ఎక్కువకాలం దూరంగా వుండలేక పోయాడు. ఆయనే కాదు వివేకంగల విద్యావంతులెవ్వరూ దూరంగా వుండలేనంత దగ్గరగా వచ్చేవాడు గాంధీజీ వారికి. స్వరాజ్య సంపాదనకు గాంధిజీ కొన్ని మహత్తరమైన సూత్రాలు సూచించారు. "స్వరాజ్యం అంటే అది ఆంగ్లేయుల దయాదాక్షిణ్యాలతో లభించేది కాదు. దాన్ని అధికారులైన ఆంగ్లేయులనుంచి మనం గుంజుకోవాలి. అందుకు కావల సిన స్తోమత సంపాదించాలి. స్వరాజ్యం దేశప్రజల జన్మహక్కు. దాన్ని సాధించే శక్తిని వారు సమకూర్చుకోవాలి. ఇతరుల దయాభిక్ష కొరకు ప్రాకులాడరాదు" అని ప్రబోధించారు.

గుజరాతు రాజకీయ సంఘ సభ్యుడుగా చేరాలంటే యీ విధానం పట్ల నమ్మకముండాలని గాంధీజీ షరతు పెట్టారు. ఈ విలక్షణ విధానం

వల్లభభాయి నాకర్షించింది. ఇటువంటి షరతు పెట్టినవాడు నిజంగా సామాన్యుడై వుండడనే నమ్మకం కలిగిందాయనకు. అటువంటి వ్యక్తి నాయన అలక్ష్యం చేయలేకపోయాడు. ఆయన చెప్పేదాన్ని గురించి తెలుసుకోవాలనే కుతూహలం పెరిగింది.

దేశంలో వెట్టిచాకిరి ప్రబలంగా వున్న రోజులవి. వెట్టి చాకిరివల్ల అనేకమంది పేదల జీవితాలు అధ్వాన్నమై పోతూండేవి. కుటుంబాలకు కుటుంబాలే దారుణమైన హింసకు గురైపోతూండేవి. దేశభక్తుల నందరినీ ఆ వెట్టి చాకిరీ కలవర పెట్టింది. 1917 సం॥ నవంబరు మాసంలో గోధరాలో గుజరాతు రాజకీయ సంఘ సమావేశం జరిగింది. దాంట్లో పేదల జీవితాలకు దుర్భరంగా పరిణమించిన వెట్టి చాకిరీని రద్దు చేయించాలని తీర్మానం చేయబడింది. వల్లభభాయి పటేల్ స్వయంగా 'వెట్టి చాకిరి రద్దు' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. అందుకు గట్టి కృషి చేశాడాయన. పటేల్ సార్వజనిక జీవితం యీ కృషితోనే ప్రారంభమైనదని చెప్పవచ్చు.

ఆ రోజుల్లో వర్షాలెక్కువగా పడటంవల్ల ఖేరా జిల్లా పంటలు బాగా దెబ్బతిన్నాయి. నాలుగోవంతు పంటకూడ పండలేదు భూములు. ప్రభుత్వం శిస్తు వసూళ్ళను నిలిపివేయ వలసినదే. కాని తప్పుడు లెక్కలతో పండిన పంటలను అధికంగా అంచనా వేసింది రెవెన్యూశాఖ. శిస్తులు కట్టవలసిందిగా రైతులకు తాఖీదులు పంపారు. రైతులప్పుడు గాంధీజీ వద్దకు వెళ్ళారు. గాంధీజీ స్వయంగా దెబ్బతిన్న పంటలను పరిశీలింప జేయించి నష్టాన్ని అంచనా వేయించారు. రైతులు చెప్పుకునేది నిజమేనని తేలింది. ఈ కార్యక్రమంలో వల్లభభాయి పటేల్ ఉత్సాహంతో పాల్గొన్నాడు. ఇంతేగాక శిస్తు చెల్లింపులకు వ్యతిరేకంగా జరిగిన సత్యాగ్రహ పోరాటంలో పటేల్ ఆఖరువరకు గాంధీజీ వెంట వున్నారు. పోరాటం ముగిసిన తరువాత గాంధీజీ తన అనుచరులతో యీ విధంగా అన్నాడట— "నేను మొదట వల్లభభాయిని కలుసుకొన్నప్పుడు యీ మొండిమనిషెవరా అని అనుకొన్నమాట నిజం. కాని కార్య



గుజరాత్‌లోని కరమ్‌సద్‌లో వల్లభభాయి బాల్యం గడిపిన యిల్లు




విద్యార్థిగా



1913 లో ఇంగ్లండునుంచి తిరిగి వచ్చాక సోదరుడు విఠల్ భాయి, వల్లభభాయి.

తల్లి, అన్నదమ్ములతో





1933 మే 29వ తేదీన ఉపవాసం సమాప్తమయ్యాక సర్దార్ గాంధీజీకి ఈ విధంగా వ్రాశారు “ఈ శుభ ఘడియలో నేనూ, జోషీ మీ ఆశీర్వాదాన్ని కోరుతున్నాము. భగవంతుడు మీ పట్ల దయాళువు, మీరూ మా పట్ల దయ చూపమని ప్రార్థిస్తున్నాను.”



1938 ఫిబ్రవరి హరిపుర్ కాంగ్రెసులో



1945 జూలైలో జరిగిన సిమ్లా సమావేశంలో పటేల్, గాంధీ, మణిబెన్



1946 జూలై బొంబాయిలో ఇంటరిమ్ ప్రశ్నగురించి దీర్ఘాలోచనలో
మునిగివున్న గాంధీ, నెహ్రూ, పటేల్



1947 ఆగష్టు 15 కేంద్ర మంత్రి పదవిని స్వీకరిస్తూ

1948 ఆగష్టు 31 జన్మదినం రోజున సకుటుంబముగా





1948 నవంబర్ డచ్ శిల్పి శ్రీమతి క్లేరా క్విన్ ముందు

1949 జనవరి 4 ఉదయపూర్‌లో జరిగిన మహాసభలో ప్రసంగిస్తూ





1949 జనవరి బర్‌దోలీ ఆ|శమంలో నూలువడుకుతూ

రంగంలో ఆయనను చూసిన తరువాత మాత్రం ఇటువంటి మనిషి నాకు కావాలి అనిపించింది."

రామకృష్ణ పరమహంస తన వివేకానందుణ్ని గుర్తించాడు, దగ్గరకు చేరదీశాడు. వల్లభభాయిపటేల్ న్యాయవృత్తిద్వారా ధనం సంపాదించాలనుకున్న తన పూర్వపు నిర్ణయాన్ని పూర్తిగా వదలి ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితంచేయ నిశ్చయించుకొన్నాడు. ప్రజాసేవ నొక ధర్మంగా స్వీకరించాడు. ఆ తరువాత 1919 సం॥లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా గాంధీజీ దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు వల్లభభాయి పటేల్ తన యిల్లు వాకిలిని గురించి పట్టించుకొనడం మానివేసి రాజకీయ రంగంలో ప్రవేశించాడు. అహమ్మదాబాదు నగర మ్యునిసిపాలిటీలో సభ్యుడుగా వుంటూ అనేక సమస్యలపై మాటి మాటికి ప్రభుత్వం వారితో తలబడుతూండేవాడు. తన ప్రజల సుఖ శాంతులకొరకు, అన్ని విధాల వారి అభివృద్ధి కొరకు అనేక ప్రణాళికలు తయారు చేయించి పాటుపడ్డాడు.

అనతి కాలంలోనే పటేల్ గుజరాతు రాష్ట్రంలో గాంధీజీ కత్యంత ప్రీతి పాత్రుడుగాను, ప్రధాన శిష్యుడుగాను రూపొందాడు. సహాయ నిరాకరణోద్యమ సందర్భంలో గాంధీజీ పిలుపునందుకొని ఈ దేశంలో ఆంగ్లేయ విద్యా విధానాలకు వ్యతిరేకంగా స్కూళ్ళను, కాలేజీలను బహిష్కరించవలసిన అవసరమొచ్చినపుడు గుజరాతు కాలేజీ విద్యార్థులు "మేము కళాశాలలను త్యజించి గుజరాతు విద్యాపీఠానికొస్తే అక్కడ మాకెటువంటి విద్య లభిస్తుంది?" అని పటేల్‌నడిగారు.

అప్పుడు పటేల్ వారికి "గుజరాత్ విద్యాపీఠం మీరింతకు పూర్వం గుజరాతు కళాశాలల్లో చదివిన చదువునంతా ముందు మరచిపోయేట్లుగా విద్యనందిస్తుంది" అని తడుముకోకుండా సమాధానమిచ్చాడు. ఎటువంటి నిర్మాణాత్మకమైన జాతీయ భావన!

ఇంగ్లీషు చదువులను బహిష్కరించాలనే ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు నాగపూరులో జండా పుచ్చుకొని జండా సత్యాగ్రహం

ప్రారంభించబడింది. కొందరు ప్రజలు ప్రభుత్వోద్యోగుల కాలనీలలో ఊరేగింపుగా వెళుతుండగా పోలీసులు వారినటకాయించారు. సేఠ్ జమనాలాల్ బజాజ్ పోలీసుచర్య పౌరహక్కులకు భంగకరమని భావించాడు. ఆ అవమానానికి బాధపడ్డాడు. అప్పుడు గాంధీజీ జైలులో వున్నాడు. జమనాలాల్ జీ ప్రభుత్వంవారి ఆజ్ఞను ధిక్కరించాలనుకొన్నాడు. జండా పుచ్చుకొని ప్రభుత్వ కాలనీ మార్గాన నడిచి అరెస్టు అయినాడు. అప్పుడు కాంగ్రెసు ఆ పరిస్థితిపై దీర్ఘంగా యోచించి సత్యాగ్రహ సమరాన్ని ప్రకటించింది. ఆ సమరానికొక సమర్థుడైన నాయకుడు కావాలి. వల్లభభాయి పటేల్ అందుకు తగిన వాడని జాతీయ కాంగ్రెసు ఆయనను జండా సత్యాగ్రహ నాయకునిగా నిర్ణయించింది.

అప్పటికి దేశంలో స్వరాజ్య పార్టీ ఆవిర్భవించింది. గాంధీజీ చౌరీచౌరా సంఘటన తరువాత సత్యాగ్రహ పోరాటాన్ని నిలుపు చేయించాడుకదా. దానితో ప్రజలలో 'ఇటువంటి సత్యాగ్రహం, వల్ల స్వరాజ్యమెలా వస్తుందనే సందేహం కలగ నారంభించింది. శాసన సభలలో ప్రవేశించి స్వరాజ్యం కొరకు చట్టరీత్యా కృషిసలపడం మంచిదనే అభిప్రాయం చాలామందికి కలిగింది.

వల్లభభాయికి మాత్రం శాసన సభలపై నమ్మకముండేది కాదప్పుడు. ఆయన అతి నేర్పుతో, దూరదృష్టితో చక్కటి పథకం వేశాడు. సత్యాగ్రహం వైపుకు ప్రజల నాకర్షించాడు. వారిలో నిరాశ నిస్పృహలను తొలగించాడు. జనం తండోపతండాలుగా సత్యాగ్రహంలో పాల్గొనేందుకు నాగపూరు రావటం మొదలు పెట్టారు. దేశం యావత్తు మేలుకుంది. సర్దార్ పటేల్ సత్యాగ్రహ సమరయోధుల నుద్దేశించి ఆనాడు మాట్లాడిన మాటలు చరిత్ర పుటలలో శాశ్వతంగా నిలచిపోతాయి — "జాతీయ జండా పుచ్చుకొని ఊరేగింపులు జరపడం 'యూనియన్ జాక్' ను అవమానించేందుకుగాని లేక యితర యిబ్బందులను సృష్టించేందుకుగాని కాదు. ఇది భారత ప్రజల ప్రాథమిక పౌరహక్కుల రక్షణకు సంబంధించిన ప్రముఖ సమస్య. అవసరమైన చర్య.

విధిలేక ప్రభుత్వమానాడు సత్యాగ్రహులతో సంధి చేసుకొంది. జైళ్ళలో నిర్బంధించబడిన సత్యాగ్రహ వీరులందరినీ విడుదల చేసింది. ప్రభుత్వ కాలనీలలో జండా ఊరేగింపు నిషేధాన్ని తొలగించి వేసింది.

నాగపూరు జండా సత్యాగ్రహం తరువాత బోర్సద్ తాలూకాలో 'తల పన్ను ఉద్యమం' కూడ వల్లభభాయి నాయకత్వంలోనే నడిచింది. దోపిడీ దొంగల బారినుండి ప్రజలను రక్షించేందుకు బోర్సద్ తాలూకా కదనంగా బయటినుంచి అప్పట్లో 400 పోలీసులు రప్పించబడ్డారు. అయితే వారికోసరమయే ఖర్చును అక్కడి ప్రజలనుంచి వసూలు చేయ వలయునని ప్రభుత్వం నిర్ణయం. ఆ వసూలు 'తలపన్ను' అని పిలువ బడింది. ప్రజలు దొంగలకు సహాయపడుతున్నారు కనుక దొంగల కొరకై చేయబడు అదనపు ఖర్చును కూడ ప్రజలే భరించాలని ప్రభుత్వం చెప్పింది.

దొంగలు ప్రభుత్వ విధానం ఫలితంగా తలెత్తుతూంటారు. ప్రజల దోషమేముంటుంది అందులో ? అందుకదనంగా పన్ను చెల్లించవలసి రావడం అన్యాయం. బోర్సద్ తాలూకా ప్రజలు వల్లభభాయి పటేల్ వద్ద కొచ్చి పడ్డారు. పరిస్థితిని పరిశీలించగా మరింత ఆశ్చర్యకరమైన విష యాలు బయట పడ్డాయి. అప్పుడు కాంగ్రెసు సమావేశం జరిపి తల పన్ను అనేది మన ప్రభుత్వం వారిదుష్టచర్య కనుక దాన్నేమైనా సరే చెల్లించగూడదని నిర్ణయం చేసింది. అందుకు ప్రభుత్వం పెట్టే యిబ్బం దులను, శిక్షలను సహించాలని తీర్మానించుకొన్నారు.

సత్యాగ్రహం ప్రారంభమయింది. ప్రభుత్వం సత్యాగ్రహుల పట్ల కఠినంగా వ్యవహరించింది. ఆస్తులకు వేలాములు, జప్తులు, మొదలగు వాటి కొరకై నోటీసులొచ్చాయి. కాని వాటి అమలు కొరకై గవర్న మెంటు మనుష్యులు వచ్చేటప్పటికి గ్రామాల్లో చలనం లేకుండా వుండేది. ఎవరూ శ్రద్ధ చూపించేవారు కాదు. అధికారులకు ఎటువంటి సహాయం లభించేది కాదు, అసలు పగటి కాలంలో ఎవరూ కనబడేవారు కాదు.

వారు రాత్రుళ్ళు తమ తమ పనులను నిర్వహించుకొంటుండేవారు. రెండు మాసాలు ప్రశాంతంగా సాగిన సత్యాగ్రహాన్ని చూసి ప్రభుత్వం విసుగు చెందింది. వల్లభభాయి పటేల్ యిటు ప్రజలను, అటు దొంగలను కూడ ప్రశాంతంగా వ్యవహరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూండేవాడు. ఆయన ప్రబోధమిలా వుండేది —

"ఇదొక పవిత్ర యజ్ఞం మనం ఆరంభిస్తున్నాం. చిత్త శుద్ధితో దీన్ని నిర్వహించాలి. ఎవరూ దీన్ని హింసాత్మక చర్యలతో భగ్న పరచరాదు. నేరస్థులుగా పరిగణింపబడు సోదరులు కూడ ప్రజలను హింసించు కార్యక్రమాలను కట్టిపెట్టాలి. వారుకూడ ఆత్మ శుద్ధితో యీ పవిత్ర యజ్ఞానికి సహకరించాలి. లేకపోతే వారు సత్యాగ్రహుల గ్రామాలను వదలి వెళ్ళిపోవాలి."

నిజంగానే ఆ తరువాత దొంగలెవ్వరూ బోర్సద్ తాలూకాలో కనుపించలేదు. వారు పటేల్ విజ్ఞప్తిని పాటించారు. పటేల్ ప్రభుత్వం వారి నికృష్ట నీతిని బట్టబయలు చేశాడు. ప్రభుత్వం ఒక ప్రసిద్ధుడైన దోపిడీ దొంగను పట్టేందుకు మరొక దోపిడీ దొంగను వినియోగించిందట. వానికి ఆయుధాలు సమకూర్చి పెట్టింది. వాడిపై ఆంక్షలు ఎత్తివేసింది. వాడు చేయు దోపిడీలను ప్రోత్సహించింది. వాడు ప్రజలను హింసించినా, హత్యలు చేసినా సంతోషంగా సహించింది. వీటన్నిటికి పటేల్ దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. ఆయన ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ అందుకుగాను ప్రభుత్వాన్నే దోషిగా ప్రకటించాడు— "ప్రభుత్వమే దొంగలను సృష్టిస్తూంది. ప్రభుత్వమే దోపిడీలను ప్రోత్సహిస్తూంది. దోపిడీదారులకు ప్రభుత్వం అండగా వుంటూంది. అదే ప్రభుత్వం దోపిడీల నరికడతానని చెపుతూ యిపుడు ప్రజలను పన్నుల కొరకు హింసిస్తూంది. ఆశ్చర్యంగా వుంది. ఇది దోపిడీలుచేయు దొంగ న్యాయ విచారణ జరుపు జడ్జిని శాసించడం వంటిది కాదా? శిక్షించడం వంటిది కాదా?" అని పటేల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు.

పటేల్ ప్రకటనలతో ప్రభుత్వం అదిరిపడింది. పరిశీలన కొరకు హోంశాఖ కార్యదర్శిని పంపించింది. ఆయన పరిశీలనవల్ల ప్రజలు నిర్దోషులని ఋజువైంది. పటేల్ చేయు హడావిడి కొట్టిపారవేయ దగినదిగా గోచరించలేదా అధికారికి. వెంటనే ఆయన తలపన్ను రద్దుచేయవలసినదిగా సిఫార్సు చేశాడు. ముందు జప్తుచేయబడిన సామాను లెవరివి వారికిచ్చి వేయవలెనని సూచించాడు.

1927 వ సంవత్సరంలో గుజరాతు రాష్ట్రానికి గొప్ప వరద ప్రమాదం సంభవించింది. విపరీతంగా నష్టాలు కలిగాయి. అప్పుడు వల్లభభాయి పటేల్ అహమ్మదాబాదు మ్యునిసిపాలిటీకి, ప్రాంతీయ కాంగ్రెసుకు కూడ అధ్యక్షుడుగా వున్నాడు. వరద బీభత్సంలో ఆయన ప్రజలకు చేసిన సేవలను మనం కొంతవరకు తెలిసికొన్నాం. ఇంకా కొంత తెలిసికోవాలి. ఆయన ఆనాడు వరదలవల్ల గుజరాతీయులకు కలిగిన నష్టాలను సేకరించి కేంద్ర అసెంబ్లీకొక రిపోర్టు పంపించాడు. అప్పుడు పటేలు అన్నగారు విఠల్‌భాయిపటేల్ కేంద్ర అసెంబ్లీకి అధ్యక్షుడుగా వున్నాడు. విఠల్‌భాయి వల్లభభాయి పంపిన వరద రిపోర్టును ప్రశాంతంగా చదివి చాలా బాధపడ్డాడు. ఆయన ఆనాటి వైస్రాయి లార్డు ఇర్విన్‌కు గుజరాతు వెళ్ళి పరిస్థితిని స్వయంగా పరిశీలించి కష్ట సమయంలో ప్రజలకు సహాయపడవలసినదిగా మనవి చేశాడు.

వల్లభభాయి పటేల్ కృషి ఫలించింది. విఠల్‌భాయి పటేలు చేసిన విజ్ఞప్తి వైస్రాయి మనస్సును కదిలించింది. వైస్రాయి గుజరాతు పర్యటన జరిపాడు. ఆ పర్యటనలో వల్లభభాయికి వైస్రాయిని కలుసుకొనే అవకాశం లభించింది. ఆయన వైస్రాయికి వివరాలన్నీ సాకల్యంగా అందజేశాడు. వైస్రాయి పరిస్థితిని గ్రహించాడు. నష్టాలనంచనా వేసికొన్నాడు. కూలిపోయిన ఇళ్ళను కట్టుకొనేందుకు, చితికిపోయిన కాపరాలను నిలబెట్టుకొనేందుకు, గుజరాతీయుల కానాడు కోటి రూపాయిలు మంజూరు చేశాడు వైస్రాయి. ఆనాటి పర ప్రభుత్వం ప్రజల కొరకంత పెదమొత్తం మంజూరు చేయడమన్నది నిజంగా ఊహించ

రాని విషయం అది సామాన్య విషయం కాదారోజున. అది పటేల్ సోదరుల శక్తి సామర్థ్యాల ఫలితమేనని యీనాటికీ చెప్పుకొంటూ వుంటారు గుజరాతులో.

దానివల్ల గుజరాతీయులతోపాటు భారతీయుల మనోబలం మరింత పెరిగింది. గాంధీజీకూడ 'సేవా భావానికి లభించిన ఆ విజయాన్ని సత్య-అహింసల విజయంగా భావించి సంతోషించారు.

బార్డోలీ నాయకుడు

1928 వ సం॥ నాటికి వల్లభభాయి పటేలు జీవితం దేశసేవకంకితమై పోయినా 1928లో జరిగిన బార్డోలీ సత్యాగ్రహ సమరంలో ఆయన సర్దారుగా గణతికెక్కారు.

సహాయ నిరాకరణ ఉద్యమాని కారంభంలో గాంధీజీ బార్డోలీనే కేంద్రంగా ఎన్నుకొన్నారు. కాని చౌరీచౌరా సంఘటన తరువాత ఆయన ఆ నిర్ణయాన్ని మార్చుకొన్నారు. అయినా ప్రభుత్వం బార్డోలీపై కినుక వహించివుంది. ఈ కారణంగా 1928 సం॥లో ఆ ప్రాంతంలో శిస్తు రివిజన్ జరిపినప్పుడు అక్కడి భూములపై 22 శాతం పన్నులు పెంచి వేసింది.

రైతులు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటించారు. రైతు ప్రతినిధులతో శిష్ట మండలి ఒకటి ప్రభుత్వాన్ని కలుసుకొంది. పెంచిన శిస్తులను తగ్గించమని అభ్యర్థించింది. కాని ప్రభుత్వం వారి విజ్ఞప్తిని ఖాతరు చేయలేదు. పన్నుల శాఖ వారి నిర్ణయాలను మార్చ వీలులేదని, ఆ శాఖ వారి కార్యకలాపాలలో జోక్యం కలుగజేసుకో వీలులేదని జవాబిచ్చింది.

ఆ రైతు ప్రతినిధులు ఆఖరుకు పటేల్ దగ్గరకు వచ్చి వివరాలన్నీ చెప్పుకొన్నారు. పటేల్ పరిస్థితిని సాకల్యంగా పరిశీలించిన తరువాత ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించ నిర్ణయించారు. పోరాటం తప్ప గత్యంతరం లేదని గ్రహించారు. ఆ విషయం గాంధీజీకి కూడ సూచించారు.

పటేల్ అభిప్రాయం విని గాంధీజీ సంతోషంతో 'గుజరాతు రైతులకు జయమగుగాక! నేను కోరుకొనవలసినదిదే' అంటూ పటేల్‌ను ఉత్సాహ పర్చాడు. రైతులకు ధైర్యం చెప్పారు.

వల్లభభాయి పటేల్ ప్రజల మనస్సులను గమనించగోరి ప్రముఖ నాయకుడైన ఒక పెద్ద భూస్వామిని పిలిచి ఆ విషయంలో ఆయనభిప్రాయాన్నడిగాడు. 'నిజాయితీగల నలుగురు మనుష్యులు ముందు నిలబడితే తాలూకా ప్రజలందరూ వారి వెనుక నిలబడగలరు.' అని ఆయన తన అభిప్రాయం చెప్పాడు.

'మరి ఆ నలుగురిలో మీరుంటారా?' అని పటేల్ ఆభూస్వామి నడిగాడు. అందుకా భూస్వామి 'నలుగురిలో నేనుండలేను. కాని ఆ నలుగురి వెనుక మాత్రం తప్పక వుంటాను.' అని సమాధానం చెప్పాడు.

అప్పుడు పటేల్ తన సమక్షంలో వున్నవారికి పెరిగిన పన్నులకు వ్యతిరేకంగా జరుగు సత్యాగ్రహ పోరాటంలో మృత్యువును సైతం ఆహ్వానించుటకు సిద్ధంగా నుండగల నలుగురు మనుష్యులను ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేశాడు. మరుక్షణంలో నల్గురు మనుష్యులు ముందుకు వచ్చారు. అయినా పటేల్ వారితో "ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. నేను ప్రమాదం లేని సమస్యను చేపట్టను. ప్రమాదాన్ని ఖాతరు చేయని వారి సరసన నేను నిలబడతాను. మీరీవిషయంలో వెనుకంజ వేశారంటే అందరి భవిష్యత్తు దెబ్బతింటుంది. అది దేశానికే చేటు." అని పదే పదే హెచ్చరించారు.

ఈ సమస్యపై వల్లభభాయి పటేల్ ప్రభుత్వంతో కూడ సంప్రదింపులు జరిపాడు. కాని ప్రభుత్వం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అంది. ఆఖరుకు 1928 సం॥ ఫిబ్రవరినెల 12వ తేదీన జరిగిన ఒక రైతు మహాసభలో సత్యాగ్రహ పోరాటం ప్రారంభించాలని తీర్మానించబడింది. ఆ సభలో పెంచిన భూమిశిస్తును గురించి మళ్ళీ పరిశీలన జరిపించనంతవరకు రైతులెవ్వరూ ఒక్క పైసాకూడ శిస్తు చెల్లించరాదనీ,

అందుకుగాను ప్రభుత్వం రైతు భూములు దాఖలు పరచుకొన్నా, ఆస్తులు జప్తు చేయించినా, మరితర బాధలెన్ని పెట్టినా, అన్నిటిని సహించాలనీ కూడ దృఢ నిశ్చయం చేసుకొన్నారు.

ఒక వైపున శక్తివంతమైన తెల్లవాళ్ళ ప్రభుత్వం, మరొక వంక అహింసపై నమ్మకంగల గుజరాతీ రైతులు, రైతుల వినయం, క్రమశిక్షణ ఔదార్యం, ఓర్పు, పట్టుదల చూసి స్వయంగా వల్లభభాయి పటేల్ చకితుడైనాడట. ఆనాడు బార్డోలీ ఉద్యమాన్ని గమనిస్తున్న 'టైమ్సు ఇండియా' అనే ఆంగ్లపత్రిక ప్రస్తుతం బార్డోలీలో బొల్షివిజం నడుస్తూందనియు, వల్లభభాయి పటేల్ దాని 'లెనిన్' అనియు వ్రాసింది.

బార్డోలీ రైతు ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం చేయవలసిందంతా చేసింది. ఆస్తుల జప్తులు. వేలాములు, దోపిడీలు, దహనాలు, మొదలగు చర్యలద్వారా ప్రజలను భయపెట్ట యత్నించింది. స్త్రీ పురుష విచక్షణ లేకుండ ప్రజలను నానాహింసలపాలు చేసింది. కాని ప్రజల ధైర్యం మొక్కవోలేదు. అది సర్దార్ పటేల్ రూపొందించిన క్రమశిక్షణ ప్రభావమే. ఆయనపట్ల వారికున్న అచంచల విశ్వాసమే. ప్రభుత్వం పరిపరి విధాల యత్నించినా ప్రజల క్రమశిక్షణను భేదించలేక పోయింది. ఏమిచేయాలో తోచక ప్రభుత్వం సత్యాగ్రహుల శేదెలను సైతం జైలులో బంధించింది. రకరకాల ఆజ్ఞలను జారీ చేసింది. పబ్లిక్ రోడ్లవద్ద, సందులలో, గొందులలో, డోళ్ళుడప్పులు వగైరా వాయించరాదనేది మచ్చుకొక ప్రభుత్వాజ్ఞ. వల్లభభాయి పటేల్ ప్రభుత్వంవారి బేలతనాన్ని చూసి నవ్వుకొన్నారట. తుపాకులు, ఫిరంగులు గల ప్రభుత్వం డోళ్ళకు, డప్పులకు జడిసి పోయింది. "ఇక డప్పులు మోగించడం ఆపు చేయండి. అయితే యిటువంటి ఆదేశాలద్వారా ప్రభుత్వం మనలనేదో మభ్య పెట్టాలని చూస్తూంది. మనం మెలకువగా మెలగాలి. మనకిప్పుడు డోళ్ళతో డప్పులతో పనిలేదు. ప్రజలు ప్రభుత్వం వారికి శిస్తులు కట్టకుండా చూడడమే మనం ప్రస్తుతం చేయవలసిన పని" అని పటేల్ ప్రజలను హెచ్చరించారు.

ఒక రోజున వాలోడ్ గ్రామంలో సభ జరుగుతూంది. సభ కెదురుగా పోలీసు స్టేషనుంది. సభలో వల్లభభాయి పటేల్ ఉపన్యసిస్తున్నాడట. పటేల్ ఉపన్యాసం ముగియగానే అక్కడికి దగ్గరగానున్న గేదెలు అరవ సాగాయట. పటేల్ ఆ అరుపులు విని నవ్వుతూ-"అవిగో గేదెల అరుపులు వినండి, రిపోర్టర్లూ. వాలోడ్ సభలో గేదెలుపన్యసించాయని వ్రాయండి. ఘా డోళ్ళకు, డప్పులకు ప్రభుత్వం తలక్రిందులవుతూంది. ఇక యీ గేదెల గోల వినండి. ఇవి యీ రాజ్యం నుంచి న్యాయం మంట కలిసిందని నోరెత్తి వాపోతున్నాయేమో! అసలు యీ నల్లగేదెలు కూడ తెల్లశానకుల జైళ్ళలో వుంటూ వుంటూ తెల్లదొరసానులలా మారి పోయినట్లున్నాయి!" అని చమత్కరించాడట.

రోజు రోజుకూ ఉద్యమంలో ప్రజల నైతికబలం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వం నిస్తేజమవుతూ వచ్చింది. అది కాంగ్రెసుతో ఒడంబడిక చేసుకోవాలనే ఆలోచనలో పడింది. కాని అదెలాసాధ్యం? అదే సమయంలో శ్రీ కనహయ్యాలాల్ మున్షీ బార్డోలీ వచ్చారు. ఆయన అక్కడి పరిస్థితిని చూసి వివరాలన్నీ బొంబాయి ప్రభుత్వానికి వ్రాసి పంపాడు. ఆయన పంపిన వివరాలేమిటో ఒకసారి చూద్దాం—

"బార్డోలీ తాలూకాలోని స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు- మొత్తం 80,000 మంది ప్రభుత్వం వారి పన్నుల పద్ధతికి వ్యతిరేకంగా సుసంఘటితమై తమ సర్వస్వాన్ని త్యజించ సిద్ధంగా వున్నారు. వాళ్ళ ఆస్తులు జప్తు చేసేందుకు వెళుతున్న ప్రభుత్వాధికారుల కక్కడ మంగలి కూడ దొరుకుట లేదు. క్షౌరం చేయించుకోవాలంటే వాళ్ళు పాపం మైళ్ళ కొద్దీ నడిచి వెళ్ళవలసి వుంటుంది. మీరు పంపిన అధికారి మోటరు కారొకచోట బురదలో కూరుకుపోయింది. వల్లభభాయిపటేల్ అక్కడ లేక పోతే ఆ కారు బురదలోనే వుండిపోయి వుండేది. వేలంలో అతి చౌకగా భూమిని కొన్న వాడింట్లో పాచిపని చేసేందుకు కూడ మనిషి దొరకటం లేదు. కలెక్టరు అక్కడికి వెళితే రైలుస్టేషన్ వద్ద వాహనమేదీ దొరకదు. వల్లభభాయి పటేల్ ఏదైనా వాహనం పంపేవరకు కలెక్టరు స్టేషన్లో

వుండిపోవలసిందే. లేకపోతే కాలికి బుద్ధి చెప్పుకోవలసిందే. నేను వెళ్లిన గ్రామంలో పురుషులుగాని స్త్రీలుగాని తమ నిర్ణయాలకు పశ్చాత్తాప పడలేరు. పైగా మరింత పట్టుదలతోనున్నారు. వల్లభాయి గ్రామాలకు వెళ్ళినప్పుడు మాత్రం అక్కడి ప్రజలాయనకు ఘనస్వాగతమిస్తున్నారు. ప్రతిచోట ప్రజలాయన కొరకు పరుగులు తీస్తున్నారు. బాలికలు మొదలు వృద్ధుల వరకు చదువులేని స్త్రీలు గ్రామాలలో ఆయనకు హారతి పడు తున్నారు. కానుకలు సమర్పిస్తున్నారు. విదేశీ ప్రభుత్వంవల్ల తమకి కలుగుతున్న అన్యాయాలను వర్ణిస్తూ పాటలు పాడుచున్నారు. ఇదంతా కళ్లారా చూసి, చెవులారా విని నేను విస్తుపోయాను. ఈ ఉద్యమం కృత్రిమ మైనదని, కొంతమంది స్వార్థపరులు కావాలని నిలబెట్టడం ఈ మాత్ర మేనని భావిస్తూ మీరు కూర్చోవడం ఆత్మవంచన మాత్రమే అని మనవి చేస్తున్నాను. మృదువైన మాటలలో చెప్పాలంటే యీ ఉద్యమం గురించి ప్రభుత్వాధికారులు పంపిన సమాచారమంతా కట్టుకథ, పూర్తిగా అసత్యం."

మున్షీ వ్రాసిన ఉత్తరం అధికారుల నాలోచించేటట్లు చేసింది. అప్పటి వరకు తటస్థంగా వున్నవాళ్ళుకూడ బార్డోలీ రైతులతో ఒడం బడిక చేసికోవలసిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఇంగ్లండు నుంచి మాత్రం బెదరింపులతో కూడిన ప్రకటనలు వెలువడుతూనే వున్నాయి. కాని వారుకూడా చిరాకుపడ నారంభించారు. అయితే బొంబాయి ప్రభుత్వ పరిషత్ సభ్యుడు సర్ చున్నీలాల్ మెహతా మున్షీగారిని గాంధీజీ-వల్లభభాయిల వద్దకు రాయబారిగా పంపించాడు. ఒడంబడికకు ప్రాతిపదిక తయారు చేయబడింది. పరిస్థితి దారికొచ్చింది.

అప్పుడే గాంధీజీ బార్డోలీకి రావడం, కొందరు రైతులాయనను కలుసు కోవడం జరిగింది. అందులో ఒకరిని పరిచయం చేస్తూ ఒక మిత్రుడు గాంధీజీతో ఈయన "మామస్తిష్కాలను మీ కర్పించాం కాని మా మాన మర్యాదలు కాదు" అని వల్లభభాయికి చెప్పేందు కొచ్చిన రైతు చెప్పాడు. అంటే రైతులు తమ పరువును, పట్టుదలను మంట గలిపి ప్రభుత్వంతో ఒడంబడిక చేసికొనేందుకు సిద్ధంగా లేరని అర్థమన్నమాట. అధి

బార్డోలీ రైతుల ఉత్సాహం త్యాగం, తుపాకి కాల్పులపై వ్యాఖ్యానిస్తూ ఒక రైతు యీ విధంగా అన్నాడు "తుపాకి గుళ్ళతో ప్రభుత్వం ఎందరు ప్రజలను కాల్చి చంపుతుంది? ప్లేగు వ్యాధితో చచ్చిన వారికంటే ఎక్కువ ఈ తుపాకుల్లతో చస్తారా? మా గ్రామంలో ప్లేగు వ్యాధితో నాల్గు వందల మంది చచ్చారు మరి!"

ఆఖరుకు ప్రభుత్వం లొంగక తప్పలేదు. అది సత్యాగ్రహ నాయకులతో సంధి చేసుకొంది. జప్తు చేసిన భూములను తిరిగి యిచ్చి వేసేట్లు. జైలులో పెట్టిన వాళ్ళందరినీ విడుదల చేసేట్లు, ఉద్యోగంనుంచి తొలగించ బడిన కరణాలను, మునసబులను తిరిగి ఉద్యోగాలలో చేర్చుకొనేట్లు మళ్ళీ పరిశీలనజరిపి భూమి శిస్తుల నిర్ణయం చేసేట్టు ఒడంబడిక జరిగింది.

అన్ని విధాల బార్డోలీ రైతులకు విజయం లభించింది. దేశం యావత్తు వారికి హర్షాతిరేకంతో ధన్యవాదాలు తెలిపింది. గాంధీజీ వల్లభభాయి పటేల్‌ను "బార్డోలీ సర్దార్" అని సంబోధించి సత్కరించారు. ఆ నాటి నుంచి వల్లభభాయి పటేల్ "సర్దార్"గా దేశ ప్రజలచే కీర్తింప బడినారు. దేశనాయకుడయ్యాడు. ఆనాడువినమ్రుడుగా తన దేశ ప్రజలముందాయన చెప్పుకొన్న మాటలివి—

"బాపూజీ సందేశాన్ని ఉడత భక్తితో మీ ముందుకు చేర్చు వాళ్ళలో నేనొకణ్ణి మాత్రమే. నేనెంత వాణ్ణి? నేనేమి చేశాను? ఏమి చేయగలుగుతాను? బాపూజీ నాకీ శక్తినిచ్చి నన్నింత వాణ్ణిచేశారు. అంతే."

కుటుంబ సభ్యులతో

తమ సర్వస్వాన్ని దేశ సేవకి అంకితం చేయగలిగిన మహామహుల కుటుంబ జీవితాలలో మనమెన్నో నేర్చుకొన వలసిన అంశాలుంటాయి. అటువంటి వారి కుటుంబాలుకూడ మన కుటుంబ జీవితాలకాదర్శ ప్రాయాలవుతాయి.

సర్దార్ వల్లభభాయి పటేల్‌కు తన 30 సంవత్సరాల చిన్న వయస్సులోనే భార్యా వియోగం సంభవించింది. అప్పటికాయన అహమ్మదాబాదులో లాయరుగా జీవితం గడుపుతున్నాడు. ఆయనకొక కుమార్తె ఒక కుమారుడు కలిగారు. కుమార్తె మణిబెన్ పటేల్, కుమారుని పేరు డాహ్యాభాయి పటేల్. డాహ్యాభాయి అవివాహితుడు. అయినా వల్లభభాయి పటేల్ రెండవ వివాహము చేసుకోలేదు. ఇతరులు రెండవ వివాహం చేసికోవలసిందిగా ఆయనకు తరచు సలహా యిస్తుండేవారట. అందుకు బొరవ తీసికొని ఒత్తిడి చేస్తూండేవారట కూడా. ఒక మేజిస్ట్రేటు ఆయనకు తన కుమార్తెనిచ్చి వివాహం చేయవలెనని ముచ్చట పడుతూండేవాడట.

ఒకరోజు ఏవో మాటల సందర్భంలో పటేల్ ఆ మేజిస్ట్రేట్‌గారితో "జీవితంలో అనుబంధాలనేవి అంత త్వరగా ఏర్పడవు. కొద్దిరోజుల పాటు లభించిన పరిచయాలు ఆ అనుబంధాలకు పునాది రాళ్ళవుతాయి" అని అన్నారట. మేజిస్ట్రేట్‌గారు పటేల్ మాటలను ఆషామాషీగా తీసుకొనక ఆశతో అర్థంచేసికొని తన కుమార్తెను వెంటనే గోధరా రప్పించి పటేల్‌తో పరిచయాలకి ఏర్పాట్లు కూడ చేయించాడట. కాని పటేల్‌కు రెండవ వివాహం పట్ల మోజులేదు, కాంక్షలేదు. పూర్వ నిర్ణయం ప్రకారం ఆయన బారిష్టరు చదువుకు ఇంగ్లండు వెళ్ళిపోయాడు.

వల్లభభాయి పటేల్ అన్నదమ్ములు అయిదుగురు. అందులో విఠల్ భాయి పటేల్, వల్లభభాయి పటేల్ యీ యిద్దరే ప్రసిద్ధులు. ఈ యిరువురిలో రాజకీయంగా బలమైన అభిప్రాయ భేదాలుండేవి. రాజకీయ విషయాలలో యిరువురు గట్టిగా పోట్లాడుకొంటూ వుండేవారు. అయినా యింట్లోమాత్రం యిరువురు ఆదర్శ సోదరులే. ఒకరి నొకరు అమితంగా గౌరవించేవారు. బారిష్టరు చదువుకు ఇంగ్లండు వెళ్ళడంలో వారిద్దరు చేసుకొన్న ఒడంబడికను గురించి మనం తెలుసుకొన్నాం. విఠల్ భాయి ఇంగ్లండు వెళ్ళినప్పుడు తన భార్యను వల్లభభాయి కుటుంబంతో వదలివెళ్ళాడు. వల్లభభాయి ఆమెను గౌరవంగా ఆదరించారు. కాని ఆమెకి కోపం ఎక్కువ ఉండడంవల్ల తోటికోడళ్ళ కిద్దరకు పడేది కాదు. ఇంటిపోరు పడలేక వల్లభభాయి పటేల్ తన భార్యను కొంత కాలం పుట్టింటికి పంపివేశారుట. వదినగారి నొక మాటనలేదు.

విఠల్ భాయి పటేల్ వెంటనే దేశసేవా కార్యాలలో దిగిపోయాడు. అందుచేత ఆయన కుటుంబ వ్యయాన్ని కూడ వల్లభభాయి పటేల్ భరిస్తూ వుండేవాడట. అది వారి ఆదర్శప్రాయమైన నిర్ణయం. తన అన్నగారు యింటికి వచ్చినప్పుడు వల్లభభాయి ఆయనకు స్వాగతం చెపుతూ ఆయన బూటుత్రాళ్ళు కూడ తానే విప్పేవారట. ఆయనకు అన్ని ఏర్పాట్లు స్వయంగా చేసేవారు. ఆయన మళ్ళీ వెళ్ళేప్పుడు ఆయన ఖర్చుకోసరం కావలసినంత పైకం యిచ్చి పంపేవాడట. పటేల్ తన అన్నగారినలా గౌరవించేవారు. ఆ గౌరవం వట్టిమాటల్లోగాక చేతల్లో ప్రదర్శించేవారు. రాజకీయంగా వ్యతిరేకాభిప్రాయాలెన్నివున్నా వారిరువురు ఆదర్శ సోదరులుగానే జీవించారు.

విఠల్ భాయి ఎంత సంఘర్షణ ప్రియుడో అంత హాస్యప్రియుడు కూడ. ఆ హాస్యం ఒక్కొక్కప్పుడు హద్దులు మీరుతూండేది.

పటేల్ కుమార్తె మణిబెన్ పటేల్ వివాహం చేసుకొనలేదు. ఆమె తండ్రి ప్రభావంలోనే జీవితం గడుపుతూ వచ్చింది. ఆమె దేశసేవలో తన తండ్రికి చేదోడు వాదోడుగా వుంటూవుండేది. ఆయనకి సేవ

చేస్తూ ఆయన ఆరోగ్యాన్ని కాపాడుతూ వుండేది. తల్లిగా అన్నపానాదులను కని పెడుతూండేది. సలహాదారిణిగా రాజకీయాలలోకూడ ఆయన వెంట వుండేది. వల్లభభాయి పటేల్ భయంకర కష్టాలను కూడ లక్ష్యపెట్టే వారు కాదు. తన యిబ్బందులను నోరు తెరిచి యితరులతో చెప్పుకొనే వారుకాదు. కాని ఆయన కుమార్తె మణిబెన్ తండ్రి యిబ్బందులను గ్రహించి శ్రద్ధ వహిస్తూ వుండేది. ఆమె మితభాషి. కానీ యితరుల మనస్సులలోని విష యాన్ని సులభంగా గ్రహించ గలిగేది. ఈ సామర్థ్యంతో ఆమె తండ్రికి మనశ్శాంతిని సుఖాన్ని యిచ్చే యత్నంలో వుంటూ వుండేది. తండ్రికి బాధ కలిగించే ఏ విషయాన్నీ ఆమె సహించేది కాదు. ఈ కారణంగా ఆయన్ని చూడడానికి ఇంటికి వచ్చే పెద్ద మనుష్యులపట్లకూడ ఆమె అప్పు డప్పుడు కఠినంగా వ్యవహరించేది. నిజానికి పటేల్ దేశం కొరకు జీవిస్తే ఆయన కుమార్తె మణిబెన్ తండ్రి కొరకు జీవించింది.

ఒక పర్యాయం మణిబెన్ ధరించిన అతుకులు, మాసికలతో కూడిన తెల్లటి ఖద్దరు చీరె చూచి మహావీర త్యాగి "ఏవమ్మా, మీ తండ్రిగారి కొరకు దేశ విదేశాల నుంచి గొప్ప గొప్ప వారు వస్తూవుంటారు గదా! మరి నీవిటువంటి అతుకుల చీరె కట్టుకుంటే వారేమనుకొంటారు? అంత గొప్ప నాయకుని కుమార్తెవు యీ చీరెతో వుండడమేమిటి"? అని అడిగాడట.

మణిబెన్ యీ విధంగా సమాధానం చెప్పింది. "తండ్రిగారి సేవలో మిగిలిన సమయాన్ని నేను రాట్నం వడుకుతూ గడుపుతానండీ. నేను వడికిన నూలు తండ్రిగారి దుస్తులకు సరిపోతే ఆయన తీసివేసిన పాత పంచెలను కుట్టి వాటిని నేను చీరలుగా వాడుకొంటూ వుంటానండీ"

సర్దార్ పటేల్ జైలు నుంచి తరుచుగా కాకపోయినా మణిబెన్‌కు, డాహ్యాభాయికి ఉత్తరాలు వ్రాస్తూండేవాడు. ఆ ఉత్తరాల ద్వారా ఆయన ఔదార్యం, దయారసం మనకు తెలుస్తాయి. డాహ్యాభాయికి కూడ తండ్రికివలె చిన్నతనంలోనే భార్యా వియోగం సంభవించింది.

డాహ్యాభాయికి మళ్ళీ పెళ్ళి సంబంధాలొస్తూ వుండేవి. ఆ సందర్భంలో ఒకసారి వల్లభభాయి పటేల్ జైలునుంచి మణిబెన్‌కు ఉత్తరం వ్రాశాడు. "వాడి హృదయానికి తగిలిన గాయం ఒకటి రెండు సంవత్సరాల వరకు మానదు. ఆ తరువాత వాడు మళ్ళీ వివాహం చేసుకొనదలచుకొంటే నిర్వి ఘ్నంగా చేసుకోవచ్చు. వాడు చేసుకోనంటే అదీ మంచిదే. ఈ విష యంలో మరొకరిని సలహా అడగవలసిన పనిలేదు. మరొకరు సలహా ఇవ్వవలసిన పనిలేదు."

డాహ్యాభాయికి వ్రాసిన ఉత్తరంలో ఒక ఆదర్శ తండ్రిగా పటేల్ యీ విధంగా సలహా ఇస్తాడు—

"నీవు ఆఫీసు ఉత్తరాలలో వాడే భాష తీవ్రంగాను, యితరులను బాధపెట్టేది గాను వుంటుంది. ఆఫీసులో తోటివారికి మన మాటలద్వారా గాని, వ్రాతల ద్వారాగాని బాధ కలగడం మంచిది కాదు. అది విరోధానికి దారి తీస్తుంది. అదీ కోరదగినది కాదు. నీ అద్దె యింటి యజమాని యిల్లు ఖాళీ చేయవలసినదిగా నీకు కోర్టుద్వారా నోటీసు ఇచ్చాడట. ఇది నీకేవిధంగాను మంచిది కాదు. నీ స్వభావం యిలా ఎందుకు మారిందో నాకర్థం కావడం లేదు. నీవు అందరితో మంచిగా వుంటున్నావని నేను చాలాసంతోషిస్తూ వస్తున్నాను. కాని యీ మాటలు నీ గురించి విని చాల ఆశ్చర్య పడ్డాను. ఇతరులకు బాధ కలిగించే మాటలు నీవు వ్రాసివుంటే వాటికి క్షమాపణ చెప్పుకొని అందరిలో మంచిని సంపాదించి అందరితో సఖ్యంగా వుండు. నా స్వభావం కూడ ఒకప్పుడు పెడసరంగా వుండేది. కాని యిప్పుడందుకు పశ్చాత్తాప పడు తున్నాను."

ఇది వల్లభభాయి మణిబెన్‌కు వ్రాసిన మరొక ఉత్తరం— "ఇక నీవు డాహ్యాభాయితో కులాసాగా కాలం గడపవచ్చు. అక్కా, తమ్ముడు ఎక్కడైనా ఏకాంతంలో పిచ్చాపాటి మాట్లాడుకొంటూ కాలం గడపండి. మాటి మాటికి సమయం దొరకదు. మీ జీవితాలను పునః పరిశీలన చేసు కోండి. లోటుపాట్లని సర్దుబాటు చేసుకొని సంతుష్టిగా మనుగడ సాగిం

చండి. పెద్ద-పెద్ద కుటుంబాలలో సామూహిక జీవితంవల్ల సుఖం లభిస్తుందనేవి భ్రమ. పరిమిత కుటుంబాలలోనే కొంత అసౌకర్యమున్న ప్పటికీ మనిషికి కొంత సుఖముంటుంది. అయితే సుఖ-దుఃఖాలనేవి మన మానసికస్థితిపై ఆధారపడి వుంటాయి. కానిబాహ్య పరిస్థితులపై మాత్రం కాదని మనం తెలుసుకోవాలి."

మణిబెన్‌కు వ్రాసిన మరొక ఉత్తరంలో ఆయన అభిప్రాయాలు ఇవి-

"మీ ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ వుండండి. వర్షాకాలం వచ్చినందు వల్ల తిరుగుడు తగ్గించి వుంటారు. కాని వీలైతే వసారాలోనో లేక చావడి లోనో ఒక గంట తప్పనిసరిగా తిరగాలి. ఇప్పుడు బాహ్య కాలు సరిగా పనిచేస్తూ వుండాలి. మీ మానసిక శక్తిని పెంపొందించుకోవడం మీ చేతుల్లోనే వుంటుంది. మనోవ్యథలను మరచిపొండి. భగవంతునిపై భారం వేయండి. జరిగిపోయినదాన్ని మరచిపోయి జరగవలసిన దాన్ని గురించి యోచించడం వివేకవంతమైన పని కాగలదు."

ఇంగ్లండునుంచి తన కుటుంబ సభ్యులకు వ్రాసిన ఉత్తరాలలో ఇంటి సమస్యలపట్ల పటేల్‌కున్న శ్రద్ధ కుటుంబంపట్ల స్నేహ సుహృద్భావాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆయన తన అన్నగారికి వ్రాసిన ఉత్తరమొకటి చూడండి-

"చిరంజీవి కాశీభాయి ఉత్తరాలు బొత్తిగా వ్రాయటం లేదు. ఇంటి సంగతులు ఏమీ తెలియటంలేదు. కనుకమీరు తరచుగా ఉత్తరాలు వ్రాస్తూ వుండండి.

నాదొక పరీక్ష పూర్తి అయింది. దాంట్లోనేను ప్రథమశ్రేణిలో ప్యాస య్యాను. పూజ్యులైన తండ్రిగారికి, తల్లిగారికి నా నమస్కారము లంద చేయండి. భగవంతుని దయవల్ల రెండు సంవత్సరాలు సులభంగా గడిచి పోతాయి. నాకు మీ అందరి మధ్యకు వచ్చే అవకాశం లభిస్తుంది."

తన తండ్రిగారితో పటేల్ సంబంధమెలా వుండేదో యీ ఘట్టం మనకు తెలియ జేస్తుంది.

తెల్లటిపంచె, తెల్లటి చొక్కా. తెల్లటి తలపాగా తెల్లటి కప్పు దుప్పటితో ఒక వృద్ధుడు- ఆయన వృద్ధుడైనా శరీరం సడలలేదు. ఆరోగ్యంగా వున్నాడు. ఉత్సాహంగా వున్నాడు. యువకునిలా మెట్లెక్కి పటేల్ ఇంటికి వచ్చాడు. ఆయనను చూడగానే చేతిలోని హుక్కాగొట్టాన్నక్కడ పెట్టి లేచి నిలబడ్డాడు. పటేల్ సాదరంగా "నాన్నగారూ. మీరా! ఎక్కడ నుంచి?" అంటూ ముందుకు వచ్చాడు.

"వల్లభభాయీ. నీతో పనివుండి వచ్చానోయీ" అన్నాడు వృద్ధుడు.

"అయితే నన్ను పిలిపించక పోయారా! నేనే కరమసద్ వచ్చే వాణ్నికదా!" అన్నాడు పటేల్

"పని బోర్సదులో వుంటే. కరమసద్ పిలిపించి ఏమిచేయను?"

"ఏమిటో ఆపని!"

"జిల్లా అంతటా నీకు పేరు ప్రతిష్టలున్నాయి. మన స్వామీజీకి వారంటు వచ్చింది. ఇది భావ్యమా? నీ వుండగా పోలీసులు మన స్వామీజీని పట్టుకొని వెళ్లడమా?" ముసలాయన ఆత్మవిశ్వాసంతో అడిగాడు.

"స్వామీజీకి వారంటా! ఎందుకు? ఆయన పురుషోత్తముడే! భగవంతుని అవతారమను కొంటున్నాంగదా! మనందరినీ యీ భవసాగరం నుంచి గట్టెక్కించగల వాడాయనే గదా! ఆయన నెవరు పట్టుకొన గలరు?" పటేల్ వ్యంగ్యంగా నవ్వుతూ మాట్లాడాడు.

"ఇప్పుడు నీ వ్యంగ్య ధోరణి కట్టిపెట్టు. బడతాల మరియు బోచాసలీ దేవమందిరాలను స్వాధీన పరచుకొనే సందర్భంలో తగాదా వచ్చిందట, దాని కారణంగా మన స్వామీజీకి కూడ గవర్నమెంటు వారు వారంటు పంపారుట. నీవు యీ వారంటును రద్దుచేయించాలి. తప్పదు పోలీసులు స్వామీజీని పట్టుకెడితే నాపరువుతో పాటు నీ పరువు కూడ పోతుంది" అని వృద్ధుడు ఆవేశంతో అన్నాడు.

"దీనితో మన పరువుకేమి సంబంధం? పరువు నష్టం పనులు చేసే వారికి పరువు పోతుంది. నేను ఎంక్వయిరీ చేయిస్తాను. నిష్కారణంగా వారంటు లొస్తాయా నాన్నగారూ? నేను చేయవలసింది మాత్రం నేను చేస్తాను" అంటూ కొంచెం సేపాగి మళ్లీ వినయంగా ఇలా అన్నాడు పటేల్- "ఇక మీరీసాధు సన్యాసులను వదలి పెట్టండి నాన్నగారూ; వీరు మోసాలు కుట్రలు చేస్తున్నారు. గ్రామాల్లో తగాదాలు రెచ్చగొడు తున్నారు. తమతోపాటు అమాయకులను కూడ కోర్టులకీడుస్తున్నారు. ఈలోకంలో తమని రక్షించు కోలేని వారు పరలోకంలో మనలనేమి ఆదుకొంటారంటారు? వట్టి మోసం!"

"అదంతా నాకెందుకు గాని నువ్వు మాత్రం స్వామీజీపై వచ్చే వారంటును యీసారి రద్దు చేయించక తప్పదు." తండ్రిగా శాసిస్తూ ఆఫీసునుంచి బయటికి వెళ్లాడా వృద్ధుడు. తండ్రి కోర్కెను నిర్లక్ష్యం చేయలేక ఆ కేసును పటేల్ స్వయంగా తన చేతిలోకి తీసికొన్నాడు. ఇరు పక్షాల వారిని, కోర్టు సమనుల నుంచి తప్పించాడు.

స్వాతంత్ర్య సమర సేనాని

మన స్వాతంత్ర్య సమర చరిత్రలో 1929 సంవత్సరానికొక ప్రత్యేకత వుంది. ఆ సంవత్సరం అభ్యుదయ కాముకుడైన పండిత జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షుడైనాడు. ఆనాడు దేశంలో చాలమంది గాంధీజీని ఆ పదవి నలంకరించ వలసినదిగా కోరారు. కాని గాంధీజీ ఆ స్థానం ఒక యువకుని కివ్వాలని సూచించడంవల్ల అందుకు నెహ్రూయే తగిన వాడని అందరూ భావించారు.

ఆ ఎన్నికతో భారతదేశ రాజకీయ చరిత్రలో నవశకం ప్రారంభమైంది. 1929 సంవత్సరం డిశంబరు మాసం ఆఖరు రోజున రాత్రి 12 గంటలకు రావినదీ తీరాన జరిగిన బ్రహ్మాండమైన సభలో కాంగ్రెసు అధ్యక్షపీఠం నుంచి నెహ్రూ దేశానికి కావలసింది సంపూర్ణ స్వాతంత్ర్యమని ప్రకటించారు. సంపూర్ణ స్వాతంత్రతా చిహ్నం త్రివర్ణ పతకాన్నెగుర వేశారు.

ఆ తరువాత స్వాతంత్ర్య సమర రంగంలో అనేక సంఘటనలు జరిగిపోయాయి. 1928లో వచ్చిన సైమన్ కమిషన్‌ను దేశమంతా బహిష్కరించింది. ఆ కమిషన్‌వారు మనదేశాన్ని గురించి బ్రిటిష్ ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసారు. ఆ సిఫార్సుల ఆధారంగా వైస్రాయి భారత దేశానికి సంయుక్త రాజ్యాన్నివ్వడం తమ ధ్యేయంగా చెపుతూ అందుకు భారత రాజకీయ వర్గాల నాయకులతో సంప్రదింపులకై లండన్‌లో రౌండు టేబుల్ సభను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించాడు.

గాంధీగారు బ్రిటిష్ ప్రభుత్వం వారి ఎత్తులను బాగా అవగాహన చేసుకొన్నవారు కదా! ఆయన వైస్రాయి ప్రకటనకు కృతజ్ఞత తెలుపుతూ

అందుకు కాంగ్రెసు తరఫున పదకొండు షరతులను విధించారు. కాని వైస్రాయి ఆషరతులను ఆమోదించ లేకపోయాడు. ఆ షరతులలో ఉప్పుపన్ను రద్దు చేయవలెననే షరతుకూడ ఒకటి వుంది. దాని కోసమే గాంధీజీ చరిత్రాత్మకమైన ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించాలని నిర్ణయించారు. ఆయన 1930 సం॥ మార్చి నెల 12వ రోజున చరిత్రాత్మకమైన దండియాత్ర చేశారు. ఆ యాత్రా కార్యక్రమమంతా సర్దార్ పటేల్ పర్యవేక్షణలోనే రూపొందించ బడింది. గాంధీజీ దండయాత్రకు సన్నద్ధులవుతూండగా పటేల్ గుజరాతులో పర్యటన ప్రారంభించారు. ఆయనొక సభలో మాట్లాడుతూ గుజరాతు ప్రజల కిలా ప్రబోధించారు—

"ఇప్పుడు మనమొక ధర్మయుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. ఇటు వంటి యుద్ధాన్నింత వరకు ఎవరూ చూసి వుండరు. ఈ యుద్ధంలో ఒక వైపున ధర్మబద్ధమైన సాత్విక సహన శక్తులు, మరియొక వైపున ధర్మ రహితమైన ఆసురీ దౌర్జన్య బలాలు నిలబడి పోరాడుతాయి. ఈ యుద్ధంలో మీరు ఏ పక్షాన నిలబడతారో మీరే నిర్ణయించుకోండి. యావన్మంది గుజరాతీయులకు నేనొక మాట చెప్పదలచాను. ఈ సందర్భంలో చావుకు వెరచే వారందరూ మూటముల్లె కట్టుకొని తీర్థయాత్రలకు వెళ్ళిపోండి. కాని వారు తమ ఆస్తులకేదో ఏర్పాట్లు చేసుకొని మరీ వెళ్ళండి. డబ్బున్నవాళ్ళు విదేశాలకు వెళ్ళిపోండి. నిజమైన గుజరాతీయులైతే గుజరాతు కవమానం కలిగే ఏ పనీ మీరు చేయకండి. తలవంచుకొని యీ గడ్డపై తిరుగవద్దు. తలుపులు బిగించుకొని ఇండ్లలో కూర్చోండి. ఇక కొద్ది రోజులే వున్నాయి. గత 15 సంవత్సరాల నుంచి మనం నేర్చుకొన్న దానికిప్పుడు పరీక్ష రాబోతుంది. విషమ పరీక్ష. ఈ విషమ పరీక్షలో మీరెంత వరకు నెగ్గగలరో చూడవలసి వుంది. గుజరాతు ప్రజలు స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో మొదటి పుట వ్రాయనున్నారని మరువకండి. భగవంతుడు మీకు శక్తిని, ధైర్యసాహసాలను ప్రసాదించుగాక."

వల్లభాయి పటేల్ ఉపన్యాసాలు గుజరాతు ప్రజల హృదయాలను

కదిలించాయి. ప్రభుత్వం పరిస్థితిని గమనించి కంగారు పడింది. మార్చి 7న ఆయనను అరెస్టు చేసింది. అదేరోజున ఆయనకు మూడు మాసాలు కఠిన ఖైదుతో పాటు 500 రూపాయిల జరిమానా లేక మరి మూడు వారాల జైలుశిక్ష విధించింది. ఇక ఐదు రోజులకు అనగా మార్చి 12న దండియాత్ర ఆరంభ మవుతుంది. గాంధీజీ "ప్రభుత్వం వల్లభాయిని అరెస్టు చేయడంలో త్వరపడింది. పరిస్థితిని విషమం చేసింది" అన్నారు.

వల్లభభాయి జైలునుంచి విడుదలై వచ్చి చూశాడు కదా, దేశమంతా జైలుగా మారివుంది. ఆయన కూడ సంగ్రామంలోకి దూకాడు. జవహర్‌లాల్ నెహ్రూ తరువాత ఆయనే జాతీయ కాంగ్రెసు కధ్యక్షుడైనాడు మరల అదే సంవత్సరం జూన్ 13వ తారీఖున అరెస్టయి మూడు మాసాలు జైలుననుభవించాడు.

ఉప్పు సత్యాగ్రహంతో పాటు ఆనాడు గుజరాతులో 'కరబందీ' అంటే పన్నుల నిరాకరణ ఉద్యమం కూడ నడుస్తూ వుంది. ప్రభుత్వం రాజీ కొరకు సంప్రదింపులు జరుపుతూంది. సర్‌తేజబహదూర్ సప్రూ డాక్టర్ జయకర్ యరవాడ జైలులో చాలసార్లు గాంధీజీని కలుసుకొన్నారు.

అప్పుడే వల్లభభాయి పటేల్ జైలునుంచి బయటకు వచ్చారు. కాని ఆయనను సార్వజనిక సభల్లో మాట్లాడరాదని ఆఙ్క్ష విధించింది ప్రభుత్వం. అయితే అటువంటి ఆంక్షలను ఆయన ఖాతరు చేస్తాడా! ఒక సభలో మాట్లాడుతూ మళ్ళీ డిశంబరు రెండవ వారంలో అరెస్టయి నాడు. ఈమారు 9 మాసాల జైలు శిక్ష విధించబడింది.

అప్పుడు ఇంగ్లండులో రౌండు టేబుల్ సభ జరుగుతూ వుంది. భారత దేశం మితవాద నాయకులు కాంగ్రెసు నాయకులకు నచ్చచెప్తూండేవారు. తత్ఫలితంగా ఇరవై ఆరుగురు నాయకులు 1931వ సం. జనవరి 25న జైలునుంచి విడుదల చేయబడ్డారు. వారిలో సర్దార్ పటేల్ కూడ వున్నారు. గాంధీ ఇర్విన్ ఒడంబడికతో ప్రభుత్వం వారి సంప్రదింపులు సఫలమైపోయాయి. కాని ఆ తరువాత కొలది రోజులకే లార్డు

ఇర్విన్ స్థానంలో లార్డు వెల్లింగ్టన్ వైస్రాయిగా భారతదేశం వచ్చారు. వెల్లింగ్టన్ అధికార పక్షపాతి. కనుక గాంధీ ఇర్విన్ ఒడంబడిక అట్టేకాలం నిలవలేదు. గాంధీజీ రెండవమాటు రౌండు టేబుల్ కాన్ఫరెన్సుకు ఇంగ్లడు వెళ్ళారు కాని ఫలితం శూన్యం.

ఆ సంవత్సరం భారత జాతీయ కాంగ్రెసు మహాసభ కరాచీలో జరిగింది. దాని కధ్యక్షుడు మన సర్దార్ వల్లభాయి పటేల్. ఆనాడు ఆయ నిచ్చిన ఉపన్యాసం పూర్వపు అధ్యక్షోపన్యాసాలకంటె చిన్నది. సంక్షిప్త మైనది. రైతు వేదికపై ఉపన్యసించదు, పొలంలో పని చేస్తాడు. అందుకే ఆయనిలా అనగలిగాడు—

"నేనేదో చేసిన కొద్ది పనికి మీరేదో నాకు సన్మానాలు తలపెట్టారు. అయితే యీ సన్మానాలు నాకుకాదు. ఇంతవరకు దేశం కొరకు గుజరాతు చేసిన త్యాగాలకు మాత్రమే వర్తిస్తాయి."

పటేల్ కాంగ్రెసు కధ్యక్షుడుగా వున్నప్పుడే జాతీయ కాంగ్రెసు తన చరిత్రాత్మకమైన ఆర్థిక ప్రణాళికను రూపొందించి ప్రకటించింది.

గాంధీజీ ఇంగ్లండులో వున్నప్పుడు భారత దేశంలో ప్రభుత్వం దమన కాండ జరుపుతూంది. సరిహద్దు ప్రాంతంలో ఖదాయీఖిద మంగారులపై రకరకాలుగా దౌర్జన్యాలు జరుపుతూంది. గుజరాతులో ప్రభుత్వం బార్డోలీ ఒడంబడికను ఖాతరు చేయడంలేదు. పటేల్‌గారికివన్నీ చికాకు కలిగించాయి. ఆయన వెంటనే స్వదేశం రావలిసిందిగా ఇంగ్లండులో వున్న గాంధీజీకి ఉత్తరం వ్రాశారు. డిశంబరులో గాంధీజీ ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చారు. ఆయన దేశపరిస్థితులను గ్రహించి వైస్రాయితో మాట్లాడాలని ప్రయత్నించారు. కాని వీలు పడలేదు. ప్రభుత్వం జవహర్లాల్ నెహ్రూను అప్పటికే అరెస్టు చేసి వుంచింది. 1932 సం॥ జనవరి 4న గాంధీ - పటేలులు కూడ నిర్బంధించబడి 16 మాసాల పాటు ఒకే జైలులో వుంచబడ్డారు.

మహాదేవ దేశాయి ఆరోజుల్లో జరిగిన అనేక ఘట్టాలను సజీవంగా చిత్రించాడు. ఆయన ఒకసారి పటేల్‌ని అడిగాడట. టీత్రాగడం మానివేశారా అని. పటేల్ అన్నారట- "ఇక్కడ బాపూతోవుంటూ ఆయన సమక్షంలో టీత్రాగనా? వారేది తింటే నేను అదే తినాలని నిర్ణయించు కున్నాను. అన్నం వదలి రెండు పూటలు రొట్టె- పాలు తీసుకొంటున్నాను, బాపూజీ రొట్టె తిన్నారు కదా. ఆయనవలె ఆకు కూరలు వాడుతున్నాను.

బాపూజీ కొరకు షరబత్ తయారు చేయడం బరూవాలు శుభ్రం చేయడం దంత ధావనం కొరకు పుల్లలు తయారు చేయడం నా బాధ్యతలుగా తీసుకొన్నాను. అసలు మా యిద్దరినీ ఒకే జైలులో ఉంచుతారని నాకు తెలియదు. తెలిసివుంటే ఆయన కొరకు నేనేమి చేయాలో ఆశ్రమంలో కాకాజీని అడిగి తెలుసుకుని వుండేవాణ్ని. మరి బాపూజీ తన కోసరం నోరు తెరచి అడగరు. కనుక మనకు తెలియదు."

ఒకరోజు బాపు తెల్లవారు జామున 3-45 గంటలకు లేవవలసింది. 3-00 గంటలకే లేచారట. ప్రార్థనాది కార్యక్రమాలు పూర్తి అయిన తరువాత పటేల్‌తో మీరు మిగతా నిద్రను పూర్తి చేసుకోండి అని చెప్పారట. సర్దార్ "కాదండీ మేము కూడా మీతో వుండేవాళ్ళమే కదా! మీకవసరం లేని నిద్ర మాకు మాత్రం ఎందుకు? మేము మిమ్మలననుసరించే వాళ్ళం మాత్రమే." అన్నారట.

పటేల్‌గారి 'అనుసరణ' కేవలం శాబ్దికం కాదు. ఆయన రోమరోమాన్నుంచి ఆ ధ్వని వస్తూండేది. అదే రోజున మరోసారి మాటల సందర్భంలో గాంధీజీ పటేల్‌తో "అదేమండీ! ఏదో ఒక రోజున నేనైనా ఎవరి భుజాలపైనో ఎక్కవలసినదేగా!" అన్నారట. పటేల్ వెంటనే "అలా అనబోకండి దేశాన్ని నడిసముద్రంలో వుంచి మీరెలా వెళతారు? ఈ నావను తీరానికి చేర్చండి. ఆ తరువాత మీ యిష్టం చొప్పున ఎక్కడికైనా బయలుదేరండి. నేనుమీతోనే వస్తాను. అన్నారట.

గాంధీజీపట్ల పటేల్‌కున్న శ్రద్ధాభక్తులు మాత్రం అపారం. తన పట్ల ఆయనకున్న భక్తి శ్రద్ధల నెలా వినియోగించుకోవాలో గాంధీజీకి తెలుసు. ఒక రోజున గాంధీజీ ఎవరిచేతనైనా ఒక ఉత్తరం వ్రాయించ వలసి వచ్చింది. మహదేవ దేశాయి నూలు వడుకుతున్నారు. ఆ నూలు వడక డాన్ని ఆపు చేయించ దలచలేదు గాంధీజీ. పటేల్ తనచేత ఉత్తరం వ్రాయించ వలసినదిగా ప్రాధేయ పడ్డారు. "మీ చేత నిర్దాక్షిణ్యంగా వ్రాయించగలను" అంటూ గాంధీజీ పటేల్ చేత ఒక ఉత్తరం వ్రాయించ డమే గాక సాయం సమయంలో ఒక సుదీర్ఘమైన ఉత్తరానికి నకలు కూడ వ్రాయించారు. ఒక గంట కాలం పట్టింది. అందుకు దేశాయి బాధపడగా గాంధీజీ "ఏముంది దీంట్లో - అలసి పోయేవరకు వ్రాస్తాడు" అని అన్నాడట. కాని పటేల్ బాపూ పనిలో అలసి పోవడమా ! అసంభవం.

ఆయన పండుంపుల్లలు తయారు చేయడం, బాదం పప్పు నూరడం మాత్రమే కాదు, కవర్లు కూడ తయారుచేసేవాడు. ఒకరోజున ఆయన పుస్తకానికి బైండుకూడా చేశారు. ఆయన నేర్పరితనం గాంధీగారి మన్న నలు పొందింది. ఒక పర్యాయం ఒక ఉత్తరంలో గాంధీజీ పటేల్ గురించి యీ విధంగా వ్రాశాడు— "కవర్లను తయారు చేయడంలో వల్లభభాయితో ఎవరూ పోటీ పడలేరు. కొలవకుండానే కొలతలకు సరిపోయేటట్లు ఆయన కాగితాన్ని కత్తిరిస్తారు. ఆ అంచనా సరిగ్గా సరిపోయేది. అందులోనూ కవరు తయారు చేయడంలో ఆయన కాట్టేకాలం కూడ పట్టేదికాదు. ఆయన పనిచేసే తీరు విశిష్టంగా ఉంటుంది. చేయవలసిన పని నెప్పుడు ఆయన వాయిదా వేసేవాడు కాదు. ఎప్పటి పని అప్పుడే మళ్ళీ గుర్తుంచుకోవలసిన అవసరం లేకుండగనే పూర్తి చేస్తూ వుంటారు. ఏనాటి నుంచి నూలు వడకడం ప్రారంభించాడో ఆనాటినుంచి సమయం తప్పకుండ వడుకుతున్నారు. నిష్ఠతో ఆయన అదే సమయంలో నూలు ఎక్కువ వడకడం, నాణ్యమైనది వడకడం అనేది సాధించారు. ఆయన తన బాధ్యతగా స్వీకరించిన పనిని ఏనాడు మరచి పోవడంగాని, అలక్ష్యం చేయడంగాని, చెడగొట్టడంగాని జరగలేదు."

కాని గాంధీజీ పటేలుగారి నీ విధంగా, యింత ప్రశంశించినా ఆయన నేదో కారణంగా మెత్తగా చీవాట్లు పెట్టడంకూడ జరుగుతూనే ఉండేది. ఒక పర్యాయం నిమ్మసోడా కలిపి యిచ్చినప్పుడు గాంధీజీ ఆయనకిచ్చిన సలహాలు చూడండి—

— " మీరు నర్సింగు పరీక్షకు కూర్చొనవలసి ఉంటుంది సుమా. సేవకు సంబంధించిన అనేక చిన్న చిన్న విషయాలను తెలిసికొనవలసి వుంది. చూడండి, మీరు చెమ్చాను దాని చిప్ప దగ్గర పట్టుకున్నారు. చెమ్చా గ్లాసులో మునుగుతుంది కదా ఆమునిగే భాగాన్ని మనం వ్రేళ్లతో ముట్టరాదు. కనుక చెమ్చా నెప్పుడు దాని చివర భాగాన్ని పట్టుకొని గ్లాసులో వాడాలి. ఇదిగాక మీరు ముఖం తుడుచుకునే చేతి రుమాలుతో చెమ్చాను తుడిచారు. ఇది తప్పుకదా. కడిగిన గ్లాసును మీరు బోర్లా పెడుతున్నారు. బహుశ గ్లాసులో దుమ్ము-ధూళి పడదనే భావంతో అలా చేస్తున్నారేమో. కాని దానివల్ల గ్లాసును తరచు కడగడంలో మనం అలక్ష్యం చేయడం సంభవిస్తూ వుంటుంది. దీన్ని మీరు గమనించాలి. "

అయితే కోపగించుకోవడం, విసుక్కోవడం కేవలం బాపూజీ హక్కు భుక్తాలేనని భావించలేము. వల్లభభాయి పటేల్ కూడ బాపూజీని అనేక సందర్భాలలో గదుముతూ, విదలిస్తూ వుండేవారట. గాంధీజీ పట్ల ఆయనకున్న స్నేహం, శ్రద్ధ, చొరవ అటువంటివి.

ఒక పర్యాయం గాంధీజీ పడుకొనేందుకు కొబ్బరి త్రాడు మంచం తెప్పించారట. మంచం చూసి పటేల్ ఆశ్చర్యంతో " ఈ మంచం పండు కొనేందుకేనా ? కొబ్బరి పీచుతో చేసిన పరుపుకంటె యీ కొబ్బరి త్రాడు మంచిదా ? " అని అడిగారట.

" ఈ మంచం శుభ్రంగా వుంటుందయ్యా " అని గాంధీజీ సంజాయిషీ చెప్పుకొన్నారట.

" ఆహా ఏమి మంచము ! ఏమి శుభ్రము ! దీని నలుమూలలు కంతలు కంతలుగా చూసేందుకు రోతగా వుంది. రేపు దీనికి నేను నవారు నేయిస్తాను " అన్నారు పటేల్ అధికార పూర్వకంగా.

గాంధీజీ తన దొక్క నార మంచాన్ని సమర్థించుకొంటూ " వద్దు వద్దు వల్లభభాయీ. నవారుపై దుమ్ము ఎక్కువగా పేరుకొంటుంది. సులభంగా దాని దుమ్మువదలదు. ఈ మంచంపై నీరుపోస్తే చాలు దుమ్మంతా కారి పోతుంది " అన్నారు.

" దుమ్ము దేముందండీ ! చాకలి కేస్తే నాలుగు నిముషాలలో సాఫయి పోతుంది " అన్నారు పటేల్.

" కాదు దీన్ని నవారువలె మంచంనుంచి ఊడదీయ వలసిన అవసర ముండదు. మంచానికివుంచే నీరు పోసి శుభ్రం చేయవచ్చును. " గాంధీజీ కారణం చెప్పుకొన్నారు.

అప్పుడు మహదేవ దేశాయి " అవును బాపూజీ వేడి నీళ్ళతో యీ మంచం సులభంగా కడగవచ్చు. నల్లులు వుండలేవు కూడ " అన్నారు.

గాంధీజీ పక్షం బలపడడంచూసి పటేల్ " సరే మీరుకూడ ఆయన పక్షాన్నే మాట్లాడారూ ! చూడండి దీనికి నల్లులు, మిన్నల్లులు జాస్తిగా పడుతూంటాయి. పడితే ఒకపక్షాన వదలవు. నా మాట నమ్మండి. " అని ప్రాధేయ పడ్డారు.

అంతా విని గాంధీజీ నింపాదిగా యిలా అన్నారు- " నేను మాత్రం దీని మీదనే పండుకోనయ్యా మీరిటువంటి మంచాన్ని తెప్పించక పోయినా సరే, నా చిన్నతనంలో మా యింట్లోకూడ యిటువంటి మంచాలనే వాడుతూండేవారు. మా అమ్మ కొబ్బరిత్రాడు మంచంపై అల్లం రుద్దుతూండేది.

"అల్లమూ! ఇదెప్పుడూ నేను చూడలేదే! అన్నాడు మహదేవ దేశాయి ఆశ్చర్యపడుతూ.

"అల్లం పచ్చడి పట్టేప్పుడు దానిపై పొట్టు చీలుస్తుంటారు. చాకుతో గీకకుండ యీ మంచపు త్రాడుపై అల్లాన్ని రుద్దితే సులభంగాను, త్వరగాను పొట్టంతా పోయి సరై పోతుంది" అని చెప్పారు గాంధీజీ.

అప్పుడు వల్లభభాయి "అవునులే అదేవిధంగా ఉన్న ఆ ఎముకల గూడు మీదనున్న కాస్త చర్మం ఊడిపోతుంది! అందుకే చెపుతున్నాను నవారు వేయించమని" అని నిష్ఠూరంగా అన్నారు.

గాంధీజీ అంగీకరించలేదు. ఆయన కొబ్బరిత్రాడు మంచమే నాకహెూ భాగ్య మన్నారు. అయితే ఆయనపట్ల వల్లభభాయి పటేల్‌గారి కున్న ఆప్యాయత, శ్రద్ధ మన మిక్కడ చూడవలసింది. ఇంతేగాక ఆయన కున్న సమయస్ఫూర్తి, వినోద ప్రియత్వంకూడ యీ ప్రసంగంలో స్పష్ట పడుతున్నాయి. అసలు సమయస్ఫూర్తి, వినోద ప్రియత్వం సర్దార్ పటేల్‌కు సహజగుణాలేనని ఆయన సహచరులు చెపుతుంటారు.

ఏదో ఒక గంభీరమైన రాజకీయ ప్రసంగ సందర్భంలోనే మేలానా అజాద్ 'యహ్ హల్ తో తసల్లీ బక్ష్ హై' — అంటే 'యీ పరిష్కారం మనకు కొంత వరకు ఓదార్పు నిస్తుంది' అన్నాడట. వెంటనే సర్దార్‌జీ ఏమండోయి! యిప్పటి వరకు మవులాబక్ష్, ఖుదాబక్ష్ అని విన్నాం గాని యీ నాలుగో 'తసల్లీ బక్ష్' అని మరొకటి వచ్చిందే! దీన్నెక్కడి నుంచి తెచ్చారండీ!" అని అడిగారట. విన్నవారంతా విరగబడి నవ్వారట.

గాంధీజీ వినోద ప్రయత్నం లోక ప్రసిద్ధమే. కాని వల్లభభాయి హాస్యవృత్తి ప్రజలవరకు రాలేదు. హెూలీ పండగ సందర్భంలో గంజాయి భంగు పట్టించి హాస్య ప్రసంగాలు చొర్లిస్తుంటారు. ఆ కార్యక్రమాలలో యితరుల కేదో బిరుదులు కూడ ఇవ్వబడడం పరిపాటి. సర్దార్ పటేల్‌కు

ఆ సందర్భంలో ' హెవీటాంకు ' అనే బిరుదిచ్చారు. బిరుదుకు తగినట్లు టాంకుకంటె బరువైన హాస్యసంపత్తి ఆయన దగ్గర వుండేది. రాజకీయ ఎత్తుగడలతో ఆయన హాస్యధోరణి కఠోర వ్యంగ్యంగాను, విపాక్తమైన చాతుర్యంగాను కూడ పరిణమిస్తూండేదట. ఈ కారణంగా ప్రజలు వల్లభభాయి పటేలును కటు వ్యంగ్యకారునిగా భావిస్తూండేవారట. ఆయన కుర్రవానివలె నవ్వుతూండేవాడని చెపితే చాలామంది నమ్మరు. ఆశ్చర్యపోతారు. అయితే అసలు నిజమేమిటంటే, ప్రత్యర్థిని విపాక్త చాతుర్యంతో పరాజితుణ్ని చేయడంలో ఆయనెంత నేర్పరో కొంటెతనంతో స్నేహితులను పరిహాసమాడడంలో కూడ అంతే నేర్పరి. ఇదిగాక అదెంత కఠోరమైనదైనా ఆయన వ్యంగ్య ధోరణిలో అపహాస్యమనబడే దౌర్బల్యం మాత్రముండేది కాదు. వల్లభభాయి పటేల్ యితరులను చూసి నవ్వగలడు, తనను చూసుకుని నవ్వగలడు కూడా. ఆయన హాస్యధోరణి స్వామి దయానంద సరస్వతి పరిహాసవృత్తి ననుసరిస్తూ వుంటుందంటారు. ఆయన ముక్త హాస్యముంటుంది, ఉద్రిక్త వ్యంగ్యముంటుంది. అందే ఉదార హాస్యంతోపాటు క్రూర వ్యంగ్యముంటుందని చెప్పవచ్చు. కాని ఆహాస్యంలో సమస్థితి లోపించడం మాత్ర మెన్నడూ జరుగదు. సమస్థితి లేనప్పుడు వినోదంపై వైరాగ్యపు ఛాయలు క్రమ్ముకుంటాయి. అది విషాదపు నవ్వుగా పరిణమిస్తుంది గదా.

ఒక పర్యాయం కొందరు వ్యక్తులు గాంధీజీని కలుసుకునేందుకు వెళుతున్నారట. వారిలో వారికి పటేల్ తటస్థపడి ఎక్కడికి వెళుతున్నారని అడిగాడట. వారు గాంధీజీ కొరకు వెళుతున్నట్లు చెప్పారు. అయితే 'ఏం పనిమీద' అని అడుగగా "బ్రహ్మచర్యం గురించి ఆయనతో ఏమి చర్చిస్తారయ్యా! ఆయనకు నలుగురు కొడుకులు. కొడుకులందరూ వివాహితులే. భార్య జీవించివుంది. ఆయనకు బ్రహ్మచర్య మేమిటయ్యా? బ్రహ్మచర్యాన్ని గురించి తెలుసుకోవాలంటే నన్నడగండి. నాకు కేవలం యిద్దరు పిల్లలు మాత్రమే. నాభార్య చనిపోయి చాలా కాల

మయింది. నేను మళ్ళీ వివాహం చేసుకొనలేను. నేనుగదా మరి బ్రహ్మచారిని!"

కొంటెతనంతో కూడిన వినోదానికి మంచి ఉదాహరణ బాపూ లంగోటీ కథ. సత్యాగ్రహవారం ప్రారంభం కానుంది. దూది ఏకుడు పని కూడ ప్రారంభమవుతుంది ఆశ్రమంలో. మహదేవ దేశాయి బాపూజీతో కమానుకు కట్టిన నరం ఎలావుందని, అదెన్నిసార్లు తెగిందని అడిగారు. బాపూజీ అన్నారు — "ఏకడం చేతనైతే పింజ తెగదు. శంకరలాల్ నా చేతినుంచి పింజ తీసుకోగానే అది తెగిపోయింది. కాకాజీ తీసికొనగానే ఆయన చేతిలోకూడ తెగిపోయింది. కాని నా దగ్గరది చాల రోజులనుంచి నడుస్తూంది. ఇది ఏకుడు కళకు సంబంధించిన విషయం సుమా. చూడు, నేను కట్టుకున్న లంగోటా మరొకరు కట్టుకొంటే ఎప్పుడో పిగిలిపోయి వుండేది."

వల్లభభాయి వింటూ కూర్చున్నారు. వెంటనే యిలా అన్నారు— "ఇదంతా వింటూవుంటే అసలు మీరీ లంగోటా ధరించడం లేదనిపిస్తుంది. దాన్ని జాగ్రత్తగా వంకెకు తగిలించి వుంచుకొంటున్నారేమోననిపిస్తూంది".

బాపూజీ ఉదయం, సాయంత్రం నిమ్మరసం త్రాగేవారు. వేసవి కాలంలో నిమ్మకాయల ధర బాగా పెరిగి పోతుంది. కనుక బాపూజీ వల్లభభాయితో నిమ్మకాయకు బదులు చింతకాయ వాడవలసినదిగా సలహా యిచ్చారట. జైలులో చింతచెట్లు హెచ్చుగా కూడ వుండేవి. గాంధీజీ మాటలకు పటేల్ నవ్వి చింతకాయ రసంతో ఎముకలు కరిగిపోయి వాత రోగం పట్టుకొంటుందన్నారు.

"అయితే జమ్నాలాల్ చింతరసం వాడుతున్నాడుకదా, అతని ఎముకలు కరగటంలేదే?" అని అడిగారు గాంధీ. పటేల్ తడుముకొనకుండా "జమ్నాలాల్ ఎముకలవరకు వెళ్ళేదారి చింతకాయ రసానికి

దొరకదు. ఇంక చింతరన మాయననేమి చేయగలుగుతుంది?" అన్నారు.

ఒక విమర్శకుడు గాంధీజీకొక పర్యాయం ఉత్తరం వ్రాస్తూ ఆఖ రున "మీ కాలంలో జీవించు దౌర్భాగ్యుడు" అని వ్రాసి ముగించాడు. ఆ ఉత్తరానికేమి సమాధానమివ్వాలని గాంధీజీ పటేల్‌ని అడిగాడట. ఉద్దండుడైన పటేల్ 'విషం త్రాగమని వ్రాయండి' అన్నారట. అప్పుడు గాంధీజీ 'అబ్బే అలాకాదు, నాకు విషం యివ్వ' అని ఎందుకు వ్రాయ కూడదని ప్రశ్నించారట. ఆ ప్రశ్నవిని వల్లభభాయి పటేల్ యీ విధంగా సమాధానమిచ్చారు.— "కానీ దానివల్ల వాడిరోజులెలా గడు స్తాయి? మీకు విషమిస్తే మీరు పోతారు. వాడు ఉరికంబ మెక్కవలసి వస్తుంది. అప్పుడు వాడు మీతోనే వస్తాడు. మరో జన్మలో మీతోనే పడతాడు. మళ్ళీ యిదేబాధకదా! కనుక వాడే విషం పుచ్చుకొని వెళ్ళిపోతే అన్ని విధాల మంచిది."

పైకి నిష్ఠురంగా కనబడే ఉక్కువంటి ఆయన కఠోర వ్యక్తిత్వం వెనుక స్నేహభావమే కాకుండ వినోదంకూడ తొంగి చూస్తూండేది. గాంధీజీ అన్ని వస్తువులలో సోడా కలపమంటూ వుండేవారు. ఆ కార ణంగా ఏ పనిలోనైనా ఏదైనా కొంచెం అసౌకర్యం కలిగితే పటేల్ హాస్యంగా 'సోడా కలపరాదా' అనేవారు. ఇదేవిధంగా ఏదో విమ ర్శలో ఎవరో ఒకాయన 'గాంధీజీ రచనాత్మక్ గఫలతే' అను శబ్దం వాడాడట. మహదేవ దేశాయి 'రచనాత్మక్ గఫలతే' అంటే ఎలా వుంటుందని గాంధీజీనే అడిగారు. అక్కడున్న పటేల్ అందుకొని 'ఈరోజు పొయ్యిమీద మీ పప్పు మాడిపోయినట్లేనయ్యా' అన్నారు. గాంధీజీ కూడ నవ్వుకొన్నారట.

ఒకసారి ఒక పెద్దమనిషి గాంధీజీ దగ్గరకొచ్చి మనం మూడు మణు గుల శరీరంతో భూమిపై నడుస్తూంటే భూమిమీద జీవులు చిన్న చిన్నవి పాపం చాలా చచ్చిపోతున్నాయన్నాడు. వల్లభభాయి విని "అయితే కాళ్ళు నెత్తిమీద పెట్టుకొని నడిస్తే పోలా! " అన్నారట.

మరొక పెద్ద మనిషి గాంధీజీకొక ఉత్తరంలో తన భార్య కురూపిని కనుక తనకిష్టం లేదని వ్రాశాడట. అదిచూసి పటేల్ యీ పెద్ద మనిషిని ఆ కురూపం కనబడకుండా వుండేట్లు తన రెండు కళ్ళు పొడుచుకొని ఆమెవెంట వుండవలసినదిగా వ్రాయమని గాంధీజీకి సలహా యిచ్చారట.

పటేల్ తన మనస్సులో వున్నదాన్ని చెప్పేందుకెప్పుడూ సంకోచించేవాడు కాదు.. గాంధీజీ ఒక పర్యాయం తన ప్రత్యర్థి పుట్టినరోజు పండుగకు అభివందనలు పంపుతున్నారు. అప్పుడు పటేల్ ఆ ప్రత్యర్థి నాయకుని గురించి కొన్ని కటు సత్యాలు తెలియజేశారు. గాంధీజీ ఆ వివరాలు విన్న తరువాత 'ఇదిగో చూడు- యివన్నీ నీవు చెప్పావని ఆయనకు చెపుతాను సుమా!' అన్నారుట. పటేల్ 'చెప్పండీ- నాకేమి భయం! నేనే ఆయన ముందు అనగలను. ఇంతకు ముందొక పర్యాయం అన్నాను కూడ' అని జవాబిచ్చాడు.

సర్దార్ పటేల్‌కు సామెతలనేకం వచ్చు. జైలులో వుండగా అవకాశం వెతుక్కొని మరీ సామెతలు వాడుతూండేవారు. బజారు నుంచి తెప్పించే వస్తువుల దగ్గర గాంధీజీ గీచి గీచి బేరం చేస్తుండేవారు. ఒక రోజున పటేల్‌జీ గాంధీగారితో ఇలా అన్నారు— "మీరు మిగిలిస్తే జైలువారు తినేస్తారు. మీరెంత జాగ్రత్తపడినా వాళ్ళ దగ్గర లెక్క పూర్తవుతుందిలెండి. 'మియా లూటే మూఠ్ మూఠ్ అల్లా లూటే ఊంట్ ఊంట్'— కుంచెడువడ్ల కూలికెళితే కూముడు వడ్లు దూడమేసిందట!' సామెత విని గాంధీగారు దేశాయితో 'యిదిగో విను నీకొరకు మరొక సామెత సిద్ధమయింది' అన్నాడట నవ్వుతూ.

సాహిత్యం-కళలు అంటే పటేలుగారికి పెద్దగా నమ్మకముండేది కాదు. ఆయన రైతు. కేవలం వ్యవహార విషయాలే ఆయనకర్థమయ్యేవి. ఒక రోజున రవీంద్రనాథ టాగూరుతో ఆయన శాంతి నికేతనం గురించి



1949 మార్చి 30 జయపూర్‌లో జరిగిన అపూర్వ సమావేశంలో

1949 మార్చి 29 జయపూర్‌లో పటేల్ ఆకస్మికంగా దిగిపోయిన విమానం నమూనా 1949 ఏప్రిలు 7వ తేదీన క్రొత్తఢిల్లీలో జరిగిన రాజ్యాంగ శాసనసభలో దీన్ని నెహ్రూ పటేల్‌కి బహూకరించారు తరువాత పటేల్ దీనిని వాయుసేనకి యిచ్చివేశారు.





1949 అక్టోబరు 31 జన్మదినం రోజున శుభాకాంక్ష సందేశాలు చూస్తున్నారు.



నెహ్రూ, ఇందిరలతో



1950 జనవరి 24 రాజ్యాంగ శాసనంలో సంతకం పెడుతూ

తక్కర్ బాబాతో






డా॥ రాజేంద్రప్రసాదు, మౌలానా అజాద్‌లతో

1950 మే కన్యాకుమారి గుడిలో





1950 మే 18-భారతీయ నౌకాసేన ఓడ "ఢిల్లీ" మీద



పని నిస్సందేహంగా పూజ కానీ నవ్వుతూ వుండటమే జీవితమంటే
పటేల్

సంభాషణ జరుగుతూంది. అసలు శాంతినికేతనం ఎలా నడుస్తూందో పటేల్ గారికి సందేహం కలిగింది. ఆయన 'రవీంద్రులు వృద్ధులైనారు కదా మరి! ఆయన స్థానంలో ఎవరు నిలబడతారు?' అని అడగ్గా గాంధీజీ అన్నారు — "భగవంతుడు ఋషివంటి అసాధారణ ప్రజ్ఞా సంపన్నుణ్ని యీ లోకానికి పంపినప్పుడు, ఆయన ప్రారంభించిన పనిని మధ్యలో నిస్తేజం చేస్తాడని ఎలా అనుకొంటాం? అలా జరగదు."

ఆ విషయంలో కొంత వివాదం పెరిగింది. అప్పుడు పటేల్ అన్నమాట విని— "చిత్రకళ విషయం అలా వుంచండి. ఆయన నడుపుతున్న విద్యా సంస్థల గతేమిటి? వాటికి భవిష్యత్తు ఉంటుందా? మన ప్రోజక్టు ఖద్దరు మరియు చరఖాయే కదా వీటిని బాపూ లేకపోతే మరొక దూధా భాయి అయినా నిర్వహిస్తాడు. కాని శాంతి నికేతనం, విశ్వభారతుల సంగతలా కాదు. వాటిని యితరులు నిర్వహించడం సామాన్యం కాదు. వాటిని నిర్వహించేవాణ్ని ఆయన తయారు చేయలేదు కదా! ఆయన తరువాత కూడ ప్రజలు వాటిని మీ రాట్నంలాగా నడుపుకోగలరా?"

మహాదేవ దేశాయి వ్రాసివుంచిన డైరీ ప్రకారం సర్దార్ పటేల్ వినయ విధేయత కలవాడు కాదు, నిర్దయుడు-కఠినాత్ముడు కాదు: గృహస్థుడు కాడు, సన్యాసి కాదు; ఆయన రైతు. ఆయన పని ఆయనకు బాగా తెలుసు. ఆయన పనిలెప్పుడు పరాజయముండేది కాదు. ఆయనకు బాపూజీ అంటే ప్రాణం. దేశం అంటే గౌరవం. అన్ని పనులు ఆయనకు తెలుసు. అన్ని పనులు చేయగలుగుతారు. అయితే ఏ పని చేసినా దాంట్లో బాపూ, భారతదేశపు జయఘోష తొంగి చూస్తుండేది.

ఆ రోజులను గుర్తు చేసుకొంటూ గాంధీజీ ఒకసారి ఇలా అన్నారు— "ఆయన వీరత్వం నాకు బాగా తెలుసు. కాని గత 16 మాసాలలో ఆయన సౌశీల్యం నన్ను మరింతగా ముగ్ధుణ్ని చేసింది. ఆయన స్నేహ శీలత నన్ను సంతోష సముద్రంలో మునకలు వేయిస్తూ వుంటుంది.

అది నా తల్లిని నాకు స్ఫురింప జేసింది. ఆయనకు మాతృ గుణాలున్నా యని నాకంతకు ముందు తెలియదు సుమా."

జైలులో వున్నప్పుడు పటేల్ రెండుసార్లు మనోవ్యథకు గురి అయారు. 1932 సం. నవంబరులో ఆయన తల్లి పరమపదించింది. ఆమె వృద్ధురాలే అయినా తల్లి కదా. ఆ తరువాత ఆయన నాసిక్ జైలులో వుండగా ఆయన అన్నగారు విఠల్‌భాయి పటేల్ జెనీవా నగరంలో మృతి జెందాడు. ఆ యిరువురు సోదరులమధ్య గాఢమైన ప్రేమ వుండేది. అయినా అన్నగారి దహన సంస్కారాలకు వెళ్ళవలసి వచ్చినప్పుడు జైలులో వున్న వల్లభభాయి పటేల్ ప్రభుత్వం వారు విధించిన షరతులకు లోబడి జైలునుంచి బయటికి వెళ్ళదలచుకోలేదు. ఈ విషయం ప్రభుత్వానికాయన స్పష్టంగా తెలియ జేశారు. కాని ఆయన ఆరోగ్యం చెడిపోనారంభించింది. ప్రభుత్వం అప్పటికి మెల్లి మెల్లిగా ఖైదీలను వదలిపెడుతూంది కూడ. ముందుగా 1934 సం. జూలైలో పటేలునే వదలి పెట్టింది.

గాంధీజీ అప్పుడు హరిజన కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నులై వున్నారు. సవర్ణ హిందువులకు అస్పృశ్యులకు మధ్య దారుణమైన వైషమ్యాలను కల్పించాలని విదేశీ పాలకులుచేసే కుట్రలను భగ్నం చేయడమే అప్పట్లో ఆయన ప్రధాన కార్యక్రమంగా వుండేది. అందుకు తన ప్రాణాలను సైతం త్యజించేందుకు సిద్ధపడినాడాయన. పటేల్ గుజరాతు విద్యాపీఠాన్ని క్రమబద్ధంచేసి దానిలో గాంధీ బోధనలకు ప్రాధాన్యం కల్పించాలనే సంకల్పంలో వున్నారు. అందుకు కృషి చేశారు. అప్పుడే బోర్సద్ తాలూకా గ్రామాలలో ప్లేగువ్యాధి వ్యాపించ నారంభించింది. వల్లభభాయి పటేల్ భాస్కర పటేల్ అనే దేశభక్తి గల డాక్టరును వెంటతీసుకొని గ్రామాలకు వెళ్ళారు. ప్లేగువ్యాధి నివారణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆయనతోపాటు క్రమేణ అనేక కార్యకర్తలు పాల్గొన్నారా సేవా కార్యక్రమంలో.

గాంధీజీ కూడ చైత్ర-వైశాఖ మాసముల చిట-చిటలాడే ఎండను లక్ష్య పెట్టక ఆ ప్లేగువ్యాధి నివారణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒక మామిడిచెట్టు నీడలో ఏర్పాటైన సేవా శిబిరంలో ఆయన ఏడు రోజు లున్నారు. ప్రజలతో కలిసి మెలిసి ప్రజా కార్యాలలో కృషి చేయడం వల్లనే నాయకునిపట్ల ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.' ఆనాడు ప్రజలు 'నాయకులు మనకు సత్యాగ్రహ పోరాటాలలో ప్రవేశించమని చెప్పడమే కాదు, ఎలా బ్రతకాలో కూడ నేర్పగలరు' అని తెలుసుకున్నారు.

అప్పటికి భారత జాతీయ కాంగ్రెసుపుట్టి యాభై సంవత్సరాలు నిండాయి. స్వర్ణజయంతి జరపాలని నిర్ణయించారు. క్రేంద అసెంబ్లీ ఎన్ని కలు కూడ అప్పుడే వచ్చాయి. ఆ రెండు కార్యక్రమాలలో పటేల్ తన ఆరో గ్యాన్ని లెక్కచేయక శ్రమపడ్డారు. దేశమంతా కాంగ్రెసు స్వర్ణజయంతి వేడుకలు జరిగాయి. కేంద్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ లభించింది. వెంటనే 1937లో రాష్ట్రశాసన సభలకు కూడ ఎన్నికలొచ్చాయి. 11 రాష్ట్రాలలో ఎన్నికలు జరగ్గా 8 రాష్ట్రాలలో కాంగ్రెసు మెజారిటీ సంపాదించింది. అప్పుడు కాంగ్రెసు కొక ప్రధాన మైన సమస్య ఎదురైంది. కాంగ్రెసు గెలుచుకొన్న రాష్ట్రాలలో కాంగ్రెసు రాజ్యవిధానం ఎలా వుండాలి ? నూతన చట్టాన్ననుసరించి మంత్రి పదవు లను చేపట్టి పరిపాలన సాగించాలా, లేక ఆ మంత్రిపదవుల ఛాయకు పోరాదా ? కాంగ్రెసు నాయకులు దీర్ఘాలోచనలో పడ్డారు. సర్దార్ పటేల్ మాత్రం మంత్రి పదవులద్వారా పరిపాలనా బాధ్యతను చేపట్టాలనే నిర్ణ యాని కొచ్చారు. ఈ విషయంలో ఆయన గాంధీజీని కూడ ఒప్పించారు. దీన్నిగురించి చర్చలు జరిపేందుకు ఢిల్లీలో కాంగ్రెసు నాయకులు సమావేశ మైనప్పుడు పండిత మదన మోహన మాలవీయ మంత్రి పదవులను చేపట్టాలనే తీర్మానాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. తీర్మానాని కనుకూలంగా వున్న సర్దార్ వల్లభరాయి పటేల్ సమావేశంలోని కాంగ్రెసు నాయకుల కీవిధంగా అప్పీలు చేశారు.—

"వందలాది సంవత్సరాలుగా మనం స్వపరిపాలనను మరచిపోయాం. ఇప్పుడా అవకాశమొచ్చింది. మన శక్తి సామర్థ్యాలను ప్రయోగించ నివ్వండి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకొందాం. ఈ నాడు కాక పోతే మరొకనాడైనా మన రాజ్యాన్ని మనం నిర్వహించుకోవాలి కదా. ఏ రాష్ట్రానికైనా స్వపరిపాలనా బాధ్యత స్వీకరించే అవకాశం లేకపోతే అది మిగతా రాష్ట్రాలకు లభించిన అవకాశాన్ని, శక్తి సామర్థ్యాలను ఎందుకు అలక్ష్యం చేయాలో బోధపడుటలేదు. బెంగాలు, పంజాబు రాష్ట్రాల మిత్రులు యీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నారు. కారణం-వారు మంత్రి పదవులను స్వీకరించాలనుకొన్నా స్వీకరించే స్థితిలో లేరు కనుక. మంత్రిమండలి ఏర్పాటుకు కావలసిన మెజారిటీ వారికి లభించలేదు గనుక. ఇందువలన వారు మిగతా రాష్ట్రాల వారిని కూడ పాలనా బాధ్యతను చేపట్ట వద్దంటున్నారు. దీనివల్ల దేశానికి నష్టం కలుగుతుంది. ఈ తీర్మానాన్ని మనం అర్థం చేసుకొని అంగీకరించకపోతే చరిత్రలో మనం బుద్ధిహీనులుగా మిగిలిపోతాం. కనుక అవకాశమున్న రాష్ట్రాలలో కాంగ్రెసు పరిపాలనా బాధ్యతను చేపట్టడం వాంఛనీయం. ఈ తీర్మా నాన్ని యథాతథంగా ఆమోదించడం మన బుద్ధిమత్తకు, శక్తి సామ ర్థ్యాలకు నిదర్శనమని మనవి చేస్తున్నాను."

తీర్మానం ఆమోదించ బడింది. ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రి మండలులు ఏర్పాటు అయినాయి. పటేల్ కాంగ్రెసు పార్ల మెంటరీ బోర్డుకు చైర్మన్‌గా వున్నాడు. అప్పుడప్పుడు ఆయనకు చిక్కు సమస్యలెదురవుతూండేవి. 1934లో కేంద్రీయ శాసన సభకు ఎన్ని కలు జరిగినప్పుడు కాంగ్రెసుసంస్థ బొంబాయి నగరంలోని రెండు సీట్లకు బొంబాయి నగర కాంగ్రెసు అధ్యక్షుడు కె. యఫ్. నరీమన్ మరియు డాక్టర్ దేశముఖులను తన అభ్యర్థులుగా ఎన్నిక చేసింది. ఆ స్థానా లలో ఒకదానికి స్వతంత్ర అభ్యర్థిగా సర్ కావసజీ జహాంగీరు కూడ పోటీ చేస్తున్నాడు. శ్రీ జహాంగీరు గారికి కాంగ్రెసు తన అభ్యర్థిని పోటీ

పెట్టరాదని నరీమన్ అభిప్రాయ పడ్డారు. కాని అలా జరగలేదు. కాంగ్రెసు రెండు సీట్లకు పోటీచేసింది.

ఒక క్రమ శిక్షణగల సైనికుడుగా నరీమన్ కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నిర్ణయాన్ని పాటించ వలసింది. కాని ఆయన ఎందుకో ఏవో కారణాలు చెప్పి పోటీనుంచి తప్పుకొన్నారు. బోర్డు చైర్మన్ వల్లభ భాయి పటేల్ విస్తుపోయారు. ఆయన వెంటనే కన్హయాలాల్ మున్షీ చేత అభ్యర్థిపత్రం పూర్తిచేయించి కాంగ్రెసు అభ్యర్థిగా నిలబెట్టించారు. కాని నరీమన్ జహంగీరును గెలిపించాలని మున్షీకి వ్యతిరేకంగానే కృషి చేశారు. మున్షీఓడిపోయారు. దీనికి సర్దార్ పటేల్ బాధ పడ్డారు.

మళ్ళీ 1937 లో రాష్ట్ర శాసన సభకు ఎన్నికలొచ్చాయి. కాంగ్రెసు బొంబాయి నగర నియోజక వర్గంనుంచి తన అభ్యర్థిగా మళ్ళీ శ్రీ నరీమన్నే నిలబెట్టింది. నరీమన్ గెలిచారు. బొంబాయి రాష్ట్ర శాసన సభలో కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ లభించింది. కాని కాంగ్రెసు పార్టీ శాసన సభ్యులు బాలగంగాధర ఖేరను తమ నాయకునిగా ఎన్నుకొన్నారు. నాయకత్వాన్నాశించిన నరీమన్ దానికి క్షుబ్ధుడైనాడు. అదంతా సర్దార్ పటేల్ ద్వారానే జరిగిందని నరీమన్ అభిప్రాయపడ్డాడు. ఆయన కావాలని పారసీలపట్ల అన్యాయం చేశాడన్నాడు. ఈ ఆరోపణలతో పార్టీ వాతావరణం కలుషితమై పోయింది. అప్పుడా విషయాన్ని పరిశీలించేందుకు ఇద్దరు సభ్యులుగల కమిటీ నొకదానిని నియమించింది కాంగ్రెసు. ఆ యిద్దరిలో ఒకరు మహాత్మా గాంధీ, రెండవ వారు నరీమన్కు మిత్రుడైన పారసీ బారిష్టరు శ్రీ బహాదుర్జీ. కమిటీ అందరు చెప్పినది విన్నది. స్వయంగా ఆలోచించింది. ఆఖరుకు 1934 సంవత్సరపు ఎన్నికలలో నరీమన్ కావాలనే బుద్ధిపూర్వకంగానే తప్పుచేశాడని అభిప్రాయ పడింది. ఆ ఎన్నికలలో జరిగిన అవక తవకలకు శ్రీ నరీమనే కారకుడనీ, నరీమన్ సర్దార్ పటేల్పై చేసిన ఆరోపణలు నిజం కావనీ నిర్ణయాన్నిచ్చింది.

నరీమన్ మొదట కమిటీ నిర్ణయాన్ని అంగీకరించాడు. కాని ఆ తరు వాత మారిపోయాడు. కమిటీ అన్యాయం చేసిందన్నాడు. అప్పుడు కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నరీమన్‌ను కాంగ్రెసులో బాధ్యతగల పదవులకు అనర్హుడుగా ప్రకటించింది.

రెండవ సంఘటనకూడ చెప్పుకోన దగిన బాధాకరమైనదే. అప్పటి మధ్య ప్రదేశ్ ముఖ్య మంత్రి డాక్టరు ఖేర్. హిందీ ప్రదేశాలకు సంబంధిం చిన ముగ్గురు మంత్రులతో ఆయనకు సరిపడేదికాదు. పార్లమెంటరీ బోర్డు వారి మధ్య సఖ్యత కోసరం కృషి చేసింది. కాని సఖ్యత సాధ్యపడలేదు. డాక్టరు ఖేరీ ఆయన కనుకూలురైన కొందరు మంత్రులు కాంగ్రెసు నియ మాలకు విరుద్ధంగా తమ రాజీనామాలను గవర్నరు కందజేశారు. అంతా తెలిసికూడ ఆనాటి గవర్నరు వారి రాజీనామాలను ఆమోదించాడు. ఇంతేకాదు. ఆయన మిగతా మంత్రులనుంచి కూడ రాజీనామా పత్రా లను తీసికొని మళ్ళీ వెంటనే డాక్టరు ఖేర్‌కు క్రొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరాడు. డాక్టరు ఖేర్ గవర్నరు కోర్కెని అంగీకరించాడు. అయితే అది కాంగ్రెసు నియమాలకు పూర్తిగా విరుద్ధం. అది కాంగ్రెసుపై తిరుగుబాటు. పార్లమెంటరీ బోర్డుమీద మంత్రుల నందరినీ పిలిపించింది. మంత్రులందరూ తమ తప్పిదాన్నంగీకరించారు. క్రొత్త నాయకుణ్ని ఎన్నుకోవాలనే బోర్డు సూచనను వారు ఆమో దించారు. కాని ఆ తరువాత డాక్టరు ఖేర్ మరొక నాయకుణ్ని ఎన్ను కొనేందుకు కాంగ్రెసు శాసన సభ్యుల సమావేశాన్నేర్పాటు చేయబోనని వ్రాసి పంపాడు.

అప్పుడు కాంగ్రెసు పార్లమేంటరీ బోర్డు చర్యను ఖండిస్తూ అతనిపై క్రమశిక్షణ చర్య తీసుకుంది. ఆయన కాంగ్రెసులో ఏ బాధ్యత గల పదవికి అర్హుడు కాజాలడని బోర్డు ప్రకటించింది. ఈ చర్యతో మరాఠీ భాషా ప్రాంతంలో తీవ్రమైన ప్రతిక్రియ తలెత్తింది. సర్దార్ పటేల్‌పై తీవ్రమైన ఆక్షేపణలొచ్చాయి. ప్రాంతీయ వాదమనేది ఎంత ప్రమాద కరమైనదో తెలుసుకునేందుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

మరపురాని సమస్యలు

1938 సం. ఫిబ్రవరి మాసంలో జాతీయ కాంగ్రెసు మహాసభ బార్డోలీ తాలూకాలోని హరిపుర గ్రామంలో జరిగింది. సుభాష్ చంద్రబోసు ఆ మహాసభ కధ్యక్షుడు. దర్బార్ గోపాలదాస్ దేశాయి స్వాగత సమితికి అధ్యక్షుడు. కాని మహాసభ ఏర్పాట్లన్నీ సర్దార్ పటేల్ పర్యవేక్షణలోనే జరిగాయి. సభాస్థలిగా ఆయన రూపొందించిన ఈ విఠల్‌భాయి నగర్ నాయకులందరనీ ఆకర్షించింది.

హరిపుర మహాసభలో జాతీయ కాంగ్రెసు ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం చేసింది. ఆ రీత్యా స్వాతంత్ర్య పోరాట చరిత్రలో హరిపుర కాంగ్రెసుకొక ప్రత్యేకత సిద్ధించింది. భారతదేశం అప్పటికి బ్రిటిష్ రాజ్యం, స్వదేశ సంస్థానాలనే రెండు భాగాలుగా విడివడి వుంది. ఆ నాటివరకు జాతీయ కాంగ్రెసు స్వదేశ సంస్థానాల ప్రజా ఉద్యమాల పట్ల శ్రద్ధ చూపించలేదు. హరిపుర కాంగ్రెసు మొదటిసారిగా స్వదేశ సంస్థానాలలో తలెత్తే ప్రజా ఉద్యమాలకు సర్వ విధాల చేయూత నివ్వాలని, అవసరమైతే వాటికి మార్గదర్శకత్వం కూడ వహించాలని తీర్మానించింది.

కాంగ్రెసు నిర్ణయం ఫలితంగా స్వదేశ సంస్థానాలలో అనేక ప్రజా మండలులు ఏర్పడినాయి. వారుకూడ తమకు బాధ్యతాయుత పరిపాలన కావాలని కోరసాగారు. ఈ సందర్భంలో రాజకోట ఉద్యమం అనేక కారణాలుగా చెప్పుకొన దగింది. రాజకోట సంస్థానపు దివాను పెద్ద వ్యవహారదక్షుడు. రాజకీయాలలో కడు నేర్పరి. ఆయన సంస్థానపు రాబడిని పెంచేందుకు జూదగృహాల వరకు తెరిపించాడు. కార్మికుల చేత బలవంతంగా హెచ్చుగంటలు పనిచేయించాడు.

మరి ప్రజలా అన్యాయాలని ఎంతవరకు సహిస్తారు? ఢేబరుభాయి నాయకత్వంలో వారు సత్యాగ్రహంచేసి విజయం పొందారు. ఆ

సందర్భంలో సర్దార్ పటేల్ దివాన్ వీరబాలాకు సంస్థానాలలో బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా సలహా యిచ్చారు. వీరబాలా సర్దార్ జీతో ముందు సరేనని మాటిచ్చి, తరువాత ఒక ఆంగ్లేయుణ్ని సంస్థాన పరిపాలనలో సంస్థానాధీశ్వరునకు సలహాదారుగా నియమించాడు. ప్రజలపై మళ్ళీ దురంతాలు, దురన్యాయాలు, జుల్ములు, నిర్బంధాలు ఆరంభమైనాయి. కాంగ్రెసుద్వారా సామరస్య సాధనకు కృషి జరిగింది. సఖ్యతేర్పడింది. అయితే ఆ సఖ్యతకు స్థిరత్వముండేదిగాదు. జరిగిన ఒడంబడికను ఎప్పటికప్పుడు ఉల్లంఘించడం, మళ్ళీ అక్రమాలకు పాల్పడడం - యిదొక ఆటకాయితనంగా మొదలెట్టాడు దివాను. ఆఖరుకు గాంధీజీ రంగంలో ప్రవేశించవలసి వచ్చింది. గాంధీజీ సంస్థానాధిపతి ఠాకురు నరేశ్‌ను, జైళ్ళలో వున్న ఖైదీలను కలుసుకొన్నారు. సంప్రదింపులు జరిపారు. తనకందిన వివరాల నాధారంగా గాంధీజీ కొన్ని కోర్కెలతో ఒక మహజరును తయారు చేశారు. ఠాకురు నరేశుకా మహజరును పంపుతూ అందులోని కోర్కెలని అంగీకరించకపోతే ఉపవాసం ప్రారంభిస్తానని వ్రాశాడు.

ఠాకురు నరేశ్ గాంధీగారు వ్రాసినదానికి సమాధానమివ్వలేదు. గాంధీజీ ఉపవాసాన్ని ప్రారంభిస్తూ వైస్రాయిగారికొక ఉత్తరం వ్రాశాడు. వైస్రాయి వెంటనే దానికి సమాధానం పంపుతూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి సర్ మారిస్ గ్వాయరును మహజరులోని షరతులకు సరైన అర్థాన్ని విశదీకరించేందుకు నియమించాడు. జస్టిస్ గ్వాయరు రాజకోట వచ్చి సమస్యల నన్నిటిని సాకల్యంగా పరిశీలన జరిపాడు. ఆఖరికి ఆయన పదిమంది సభ్యులతో పాలనా సమితి ఒకటి ఏర్పడడం అవసరమనీ. ఆ పదిమందిలో ఏడుగురు వల్లభభాయి పటేల్ సూచించిన ప్రజా పరిషత్తు ప్రతినిధులు సభ్యులుగా వుండాలనీ, సూచించాడు. ఈ సంఘటనవల్ల మిగతా నరేశులంతా జాగ్రత్తపడ్డారు. అక్కడి ప్రజాపరిషత్తులు కూడ బాధ్యతాయుత ప్రభుత్వ పరిపాలనకు

సమ్మతించాయి. అది నిజంగా దేశానికి శుభ సూచనయే

ఆ మరునటి సంవత్సరమే కాంగ్రెసుకు మరొక పెద్ద ఇబ్బంది ఎదు రైంది. 1939 సంవత్సరపు కాంగ్రెసు మహాసభ త్రిపురలో జరుగ బోతోంది. దాని అధ్యక్ష పదవికి కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు మేలానా ఆజాద్ పేరును సూచించగా ఆయనందుకు అంగీకరించలేదు. అప్పుడు బోర్డు డాక్టరు పట్టాభి సీతారామయ్య పేరును సూచించింది. ఆ పద వికి సుభాష్‌చంద్రబోసు కూడ పోటీచేయ సంకల్పించాడు. కాంగ్రెసు వర్కింగు కమిటీ ఆయనను పోటీనుంచి విరమించుకోవలసిందిగా కోరింది. కానీ ఆయన విరమించుకోలేదు. గాంధీ నెహ్రూల విజ్ఞప్తిని కూడ ఆయన త్రోసివేశాడు. పోటీ తప్పలేదు. ఆ ఎన్నికలో సుభాషు బాబుకు విజయం లభించింది. డాక్టరు పట్టాభి ఓడిపోయాడు. గాంధీజీ పట్టాభి ఓటమిని తన ఓటమిగా స్వీకరించారు.

ఆ తరువాత కాంగ్రెసు వ్యవహారాలలో అవాంఛనీయ సంఘటనలు చాలా జరిగాయి. నిజంగా అవి కాంగ్రెసు మహాసంస్థ ప్రతిష్ఠ కనుగుణంగా లేవని చెప్పవచ్చు. ఆ రోజుల్లో సుభాష్‌చంద్రబోసు అస్వస్థుడుగా వున్నాడు. త్రిపుర మహాసభకు కూడ ఆయన హాజరు కాలేకపోయాడు. కాంగ్రెసు కార్యవర్గ సమితి గాంధీజీ నాయకత్వంపట్ల విశ్వాసం ప్రకటిస్తూ నూతన కార్యవర్గ సభ్యులను గాంధీజీ సలహాతో నియమించ వలసిందిగా అధ్యక్షుణ్ని కోరుతూ తీర్మానించింది.

సుభాష్‌చంద్రబోసు కాంగ్రెసు అధ్యక్షుడుగా కార్యవర్గ తీర్మానాన్ని అంగీకరించలేదు. జవహర్‌లాల్ నెహ్రూ ఎంత ప్రయత్నించినా పరిస్థితి కుదుట పడలేదు. అభిప్రాయ బేధాలు పెరుగుతూవచ్చాయి. సుభాష్ చంద్రబోసు తన అధ్యక్ష పదవికి రాజీనామా యిచ్చాడు. ఆయన స్థానంలో డాక్టరు రాజేంద్రప్రసాదు కాంగ్రెసుకు అధ్యక్షుడైనాడు. అయినా పరిస్థితి కుదుట పడలేదు. అదెంతవరకు విషమించిందంటే బోసుపై క్రమశిక్షణ చర్యగా ఆయనను మూడు సంవత్సరాలు కాంగ్రెసునుండి

బహిష్కరించవలసి వచ్చింది. అది ఆనాడు అందరూ బాధపడవలసిన సంఘటనే అయినా అంతకంటె దురదృష్టకరమైన విషయమేమంటే ఆ సంఘటనవల్ల సర్దార్ వల్లభభాయి పటేల్ వంగదేశీయుల కోపానికి గురి అయారు. కారణం ఆయన యదార్థవాది. మనసులో వున్నదాన్ని స్పష్టంగా ప్రకటించగలడే గాని మాటల గారడీలో ఎదుటివారిని మభ్య పెట్టడం ఆయనకు చేతకాదు. ఆయనను తెలుసుకోవాలంటే ఆయన దగ్గరకు వెళ్ళవలసిందే గాని దూరంగా వుండి కేవలం చూసేవారికి మాత్రం శత్రువుగానే కనబడతారు. సౌరాష్ట్రంలోని సంస్థానాధీశ్వరు డొక పర్యాయం "చరోతర ప్రాంతీయుడైన ఒక కుర్మ జాతీయునికి మా సంస్థానాలను పెకలించేందుకెన్ని గుండెలుండాలి!" అని మీసం మెలి పెట్టాడట. అతను పటేలును హత్య చేయించేందుకు కూడ కుట్రలు పన్నాడట. కాని ఆ తరువాత వ్యవహారాలరీత్యా ఆయనకు చేరువగా ఆయన అంతర్యాన్నర్థం చేసికొని తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడట. అప్పటినుంచి జీవితాంతంవరకా సంస్థానాధిపతి వల్లభభాయి పటేలును తన అన్నగా భావించి గౌరవించాడు.

ఆ విధంగా కాంగ్రెసుసంస్థ సమస్యల సుడిగుండంలో ఘుళ్ళు తిరుగు తూంటే ఐరోపాదేశంలో యుద్ధ మేఘాలు క్రమ్ముకొంటున్నాయి. హిట్లరు నాయకత్వంలో జర్మనీదేశం ఐరోపాలోని చిన్న చిన్న దేశాలను కబళిం చడం ప్రారంభించింది. ప్రారంభంలో ఐరోపా దేశాలన్నీ అలా దిగాలు పడి హిట్లరు విజయాలను వీక్షిస్తూ వున్నాయి. కాని పోలెండుదేశం హిట్లరు ఆక్రమణకు గురి అయినప్పుడు ఇంగ్లండు. ఫ్రాన్సు మొదలైన దేశాలు కొన్ని ఏకమై జర్మనీపై యుద్ధం ప్రకటించవలసివచ్చింది. అదే రెండవ ప్రపంచ మహాయుద్ధం.

కొంతకాలం తరువాత భారతదేశంలో వైస్రాయి కూడ ఇంగ్లండు ఫ్రాన్సుల తరపున యుద్ధాన్ని ప్రకటించాడు. ఆ విషయంలో ఆయ నిచ్చటి ప్రజా ప్రతినిధులైన మంత్రులను కూడ సంప్రదించలేదు. ప్రపం చంలో ప్రజాస్వామ్యం జీవించాలంటే మనందరం త్యాగాలు చేయడం

తప్పనిసరి - అని వైస్రాయి ప్రకటించాడు. కానీ కాంగ్రెసు మాత్రం యుద్ధం తరువాత భారత దేశంలో కూడ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశ పెడతామని బ్రిటిష్ ప్రభుత్వం మాకు స్పష్టంగా వాగ్దానం చేయాలని షరతు పెడుతూ తీర్మానించింది. అయితే గాంధీజీ ఆ కాంగ్రెసు తీర్మానా న్నంగీకరించలేదు. భారతదేశ స్వాతంత్ర్యానికి హింసాత్మక పద్ధతుల నేమాత్రం వాడకూడదని భావించాడాయన. యుద్ధాన్ని సమర్థించడమంటే హింసను ప్రోత్సహించడమని ఆయన అభిప్రాయపడ్డాడు.

కాంగ్రెసు కార్యవర్గంలోని పెక్కుమంది సభ్యులు సర్దార్ పటేలుతో సహా గాంధీజీ అభిప్రాయాలతో ఏకీభవింపలేక పోయారు. ఆ సందర్భంలో సర్దార్ పటేల్ గాంధీజీతో చెప్పిన మాటలివి — "నేను మీ ఆజ్ఞను పాటించేందుకు సిద్ధంగా వున్నాను. కాని నేను నమ్మినదాని ననుసరించి నిజాయితీగా వ్యవహరించవలెనంటే యుద్ధం తరువాత భారత దేశానికి స్వరాజ్యం యిచ్చే షరతుపై యిప్పటి పరిస్థితిలో బ్రిటిష్‌వారికి మన స్ఫూర్తిగా సహకరించగలనని హామీ యిస్తున్నాను. అహింసద్వారా యీ దేశానికి స్వరాజ్యం సిద్ధించవలెననే మీ సూత్రం నాకు వ్యావహారి కంగా గోచరిస్తూంది. ఆ మేరకు నేను అహింసను ధర్మంగా స్వీక రించాను. దాన్ని నేను మనస్ఫూర్తిగా అనుసరిస్తున్నాను. కాని స్వరాజ్యం సాధించేందుకు ప్రస్తుత యుద్ధంలో ఆంగ్ల ప్రభుత్వానికి నైతికంగా లేక సర్వవిధాలా సహకరించినందువల్ల మన అహింసా ధర్మం భంగపడుతుందని నేను భావించడం లేదు. అయినా మీరీ విషయంలో నన్ను మీ వెంట రావలసిందేనని ఆదేశిస్తే మాత్రం నేను నా అభిప్రాయాన్ని, నమ్మకాన్ని ఒక ప్రక్కకు నెట్టి మీ వెంట నడిచేందుకు సిద్ధంగా వున్నాను."

సర్దార్ పటేల్ గాంధీజీ వాదాన్నంగీకరించలేదు. మొట్ట మొదటిసారిగా గాంధీజీతో పటేల్‌గారి కేర్పడిన అభిప్రాయ భేదమిది. అయినా దీనిలో వారి మనసులను మలినపర్చే అంశమేదీ లేదు. ఈ సమస్యపై గుజరాతు

ప్రదేశ్ కాంగ్రెసులోని 105 గురు సభ్యులలో 100 మంది వల్లభభాయి పటేల్‌ను సమర్థించినపుడు గాంధీజీ పరమానంద భరితుడై "అవును గుజరాతు సర్దార్‌దే గదా!" అన్నారట.

ఇదే సమస్యపై గాంధీజీ కాంగ్రెసు సంస్థనుండి తప్పుకొన్నారు. అయినా ఆయన వైస్రాయిని కలుసుకొని కాంగ్రెసు కోర్కెను ఆమోదించవలసిందిగా సలహాయిచ్చారు. కాని ప్రభుత్వం వారి పోలసీ అంత సులభంగా మ్రింగుడు పడుతుందా! ఆరోజుల్లో వైస్రాయి కాంగ్రెసు-ముస్లింలీగు మరియు స్వదేశ సంస్థానాధీనులమధ్య వైరుధ్యం సృష్టించేందుకు నిరంతరం ప్రయత్నిస్తుండేవాడు. ఆయన యుద్ధం జరుగుతూండగా యిప్పుడు మీ కోర్కెలన్నిటినీ పరిష్కరించడం సంభవం కాదు. కనుక యుద్ధం తరువాత అన్ని రాజకీయ పార్టీలవారిని సంప్రదించి ఏదైనా చెప్పేందుకు వీలవుతుంది" అని ప్రకటించాడు.

వైస్రాయి ప్రకటనతో కాంగ్రెసు వారి ఉత్సాహమంతా చప్పబడిపోయింది. అప్పుడు రాష్ట్రాలలోని కాంగ్రెసు మంత్రి వర్గాలన్నీ తమ తమ పదవులకు రాజీనామా లిచ్చివేశాయి. అప్పటికీ ప్రభుత్వం చేసే యుద్ధ ప్రయత్నాలలో ఆటంకాలు కలుగచేయాలని కాంగ్రెసు తలచలేదు. గాంధీజీ మళ్ళీ వైస్రాయిని కలుసుకొని ప్రాధేయపడ్డారు. కాని లాభం లేకపోయింది.

అప్పుడు సర్దార్ వల్లభభాయి పటేల్ ప్రభుత్వం వారి కుహనా విధానాన్ని బట్ట బయలు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన సారాంశ మిది.

"ఈ యుద్ధంలో మీరు ఓడిపోతే మీ సర్వస్వాన్ని కోల్పోతారు. ఒకవేళ గెలిచినా ఒక బానిస దేశంవలె బలహీనంగా పడివుండేట్లు ఎంతో నష్టపడికాని ఆ గెలుపు పొందలేరు. ఈ యుద్ధం తరువాత ప్రపంచంలో ఏ ఒక్క దేశం మరొక దేశం యొక్క ఆధిపత్యంలో పడివుంద

నేరదు. ప్రపంచ ప్రజల సమ్మకాలు, సిద్ధాంతాలు యీ యుద్ధంవల్ల పూర్తిగా మారిపోతాయి. ఇది మీరు గమనించాలి". ఒక విధంగా యిది ఆనాడు భారతదేశంపట్ల పటేల్ చేసిన భవిష్యవాణి.

1940 వ సంవత్సరములో రామగఢ కాంగ్రెసు కూడ యిటువంటి తీర్మానమే చేసింది. అది సత్యాగ్రహ పోరాటాన్ని కూడ సూచించింది. అయినా అది ప్రభుత్వంతో ఒడంబడికకు సిద్ధంగానే వుంది. అయితే ప్రభుత్వం తను పట్టిన పట్టు సడలిస్తే గదా ఒడంబడికకు అవకాశం కలిగేది.

యుద్ధంలో మిత్ర రాజ్యాలస్థితి దిగజారిపోసాగింది. జర్మన్ దేశం పక్షాన జపాన్ దేశం కూడ యుద్ధరంగంలో ప్రవేశించింది. అది ఆగ్నేయాసియా దేశాలపై తన ఆధిపత్యాన్ని స్థాపించ నారంభించింది. భారత దేశ సింహద్వారం వద్ద ప్రమాదపు పిశాచి నిలబడింది. దాని వికటాట్టహాసాలకు దేశం కంపించి పోయింది. అయితే అదృష్టవశాత్తు పశ్చిమ రంగంలో సోవియట్ రష్యాదేశం జర్మనీని ఎదుర్కొన నిశ్చయించింది. రష్యా మిత్రదేశాల కూటమిలో చేరింది. అప్పుడు పరిస్థితులలో మార్పు వచ్చింది.

భారతదేశంలో సామ్యవాదులందరూ ఆ నాటి యుద్ధంలో రష్యా చేరికకు సంతోషించారు. వారు మిత్రదేశాల పక్షాన ప్రచారం ప్రారంభించారు. జపాను బారినుంచే భారత దేశాన్ని రక్షించు కొనేందుకు బ్రిటన్ తన సైన్యాల నిక్కడ సమీకరింప నారంభించింది. ఆ సైన్య స్థావరాల కొరకై అక్కడి గ్రామాలకు గ్రామాలనే అది ఆనాడు ధ్వంసం చేసింది. దౌర్జన్యాలు జరిపింది. అది అన్యాయమని గోల చేసిన నాయకులను, ప్రజలను యుద్ధప్రయత్నాలకాటంకం కలిగిస్తున్నారనే నేరం మోపి జైళ్ళలో పడేసింది. అలా జైళ్ళలో నిర్బంధించబడిన వారిలో పండిత జవహర్‌లాల్ నెహ్రూ కూడ వున్నాడు. అప్పుడంతా కాంగ్రెసుకొక సవాలుగా పరిణమించింది. గాంధీజీ ఆ అక్రమాలను సహించలేక 1940 సం.

అక్టోబరు 16న చరిత్రాత్మకమైన వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభించారు దానికి మొదట సత్యాగ్రహిగా ఆచార్య వినోబాభావే మరియు రెండవ సత్యాగ్రహిగా జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నుకోబడ్డారు. కాని నెహ్రూ అంతకుముందే 4 సంవత్సరాల శిక్షతో జైలుతో బంధించబడి వున్నారు. గనుక ఆయన స్థానంలో రెండవ సత్యాగ్రహిగా సర్దార్ వల్లభభాయి పటేల్ ముందుకు వచ్చారు. ఆయన 1940 నవంబరు 18న సత్యాగ్రహం చేయాలని నిర్ణయించుకొన్నారు. కాని ప్రభుత్వం ఆయనను 17వ తారీఖున అరెస్టు చేసి సబర్మతీ జైలులో బంధించింది.

వ్యష్టి సత్యాగ్రహం ఒక విచిత్రమైన పోరాటం. సత్యాగ్రహి సార్వజనిక సభలో "యుద్ధమే నదేంగే ఏక్‌పాయ్. నజాయగా ఏక్ భాయ్ — అంటే సైనికులను పంపిగాని, ధన సహాయం చేసిగాని మేము మీ యుద్ధ ప్రయత్నాలలో సహాయపడజాలము. అహింసా పద్ధతుల ద్వారా యుద్ధ ప్రయత్నాలను వమ్ము చేయడం మా ధర్మం" అని కేకలు వేసేవాడు. అప్పుడు పోలీసులు అతనిని బంధించి తీసుకుని వెళ్ళేవారు.

సర్దార్ పటేల్ జైలుకు వెళ్ళగానే ప్రభుత్వంవారి కూటనీతి కారణంగా అహమ్మదాబాదు మొదలైన కొన్ని చోట్ల మతకలహాలు ప్రారంభమైనాయి. జైలులో పటేల్ మనసు క్షోభించిపోయింది. ఆ క్షోభతో అసలే అంతకు ముందునుంచి అంతంతమాత్రంగా వున్న ఆయన ఆరోగ్యం మరింత క్షీణించిపోయింది. డాక్టర్లు ఆయనకు కేన్సరువ్యాధి సోకిందని నిర్ణయించారు. ప్రభుత్వం ఆయనను జైలునుంచి విడుదల చేసింది. కాని అదృష్టవశాత్తు ఆయనకు సోకిన వ్యాధి కేన్సరు కాదనీ, ప్రేగులకు సంబంధించిన జబ్బు అనీ తేలింది. దీనితో ఆయన దేశీయుల మనస్సులు శాంతించాయి.

ఆ మత కలహాలు చెలరేగిన కారణంగా గాంధీజీ తన సత్యాగ్రహ పోరాటాన్ని నిలుపు చేశారు. అప్పటికి జపాను, మలయా, బర్మా

మొదలైన దేశాలని ఆక్రమించివేసింది. అట్టి విషమపరిస్థితిని గమనించి అమెరికా భారతీయులతో సంతుష్టికరమైన సఖ్యతని ఏర్పాటు చేసుకొన వలసిందిగా బ్రిటన్‌కు సలహా యిచ్చింది.

ఆఖరుకి ప్రధాని చర్చిల్ తన మంత్రివర్గంలో ఒక సీనియరు సభ్యుడైన సర్ స్టాఫర్డు క్రిప్సును కొన్ని ప్రతిపాదనలతో భారతదేశం పంపించాడు. కాని దానివల్ల ఎట్టి పయోజనం కలుగలేదు. ఆనాడు సర్దార్ పటేల్ క్రిప్సు రాయబారాన్ని గురించి చెప్పిన మాటలివి—

" ఈ నాటివరకు మనము ఇటువంటి దౌర్భాగ్యపు ప్రతిపాదనలు చూడ లేదు. యుద్ధంతరువాత భారతదేశంలో బ్రిటిష్‌ప్రభుత్వం మరింతబలంగా పాతుకొని పోయేట్లుగా యోచించి వారీ ప్రతిపాదనలు చేశారు. దేశానికి సంబంధించిన బయటి ప్రమాదం నుంచి బ్రతికి బయట పడాలంటే దేశీయు లందరూ ఏకత్రాటిపై నిలబడి శత్రువుని ఎదుర్కోవాలి. అందుకు దేశీయులకు సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం అవసరమవుతుంది. బ్రిటన్ భారతీయుల కొరకెప్పుడూ పోట్లాడదు. వారిపై చిరకాలం తమ ఆధిపత్యాన్ని నిలుపుకొనేందుకే పోట్లాడుతుందనే సత్యాన్ని మనం గమనించాలి. భారతదేశ సంరక్షణే బ్రిటన్ తన కర్తవ్యంగా భావిస్తే భారతీయుల కోర్కెలను ఈవిధంగా ఎన్నడూ తృణీకరించి వుండదు."

ఈ శబ్దాలతో సర్దార్ పటేల్ అప్పటి దేశస్థితికి స్పష్టంగా అద్దం పట్టాడు.

చేదు మందు

ప్రయత్నాలన్నీ వీగిపోయిన తరువాత గాంధీజీ 'క్విట్ ఇండియా'— ఆంగ్లేయులారా భారతదేశాన్ని వదలి వెళ్ళండి – అని గర్జించారు. ఇంత పెద్దదేశాన్ని యుద్ధం ముగిసేవరకు తమ చేతులలో వుంచుకొని ప్రమాదం పాలుచేయడం తమకే ప్రమాదకరం కనుక మర్యాదగా యీ దేశాన్ని వదలి వెళ్ళవలసినదని ఆయన ఆంగ్లేయులకు సలహా యిచ్చారు. ఇటు భారత ప్రజలకుకూడా ఆంగ్లేయులీ దేశాల్ని వదలివెళ్ళే వరకు వారింక యీ దేశంలో తమ పరిపాల నిర్వహించడం అసంభవమని భావించి యీ దేశాన్ని వదిలేంత వరకు ధైర్యంగా ప్రశాంతంగా సత్యాగ్రహ పోరాటం జరుపుతూనే వుండవలసినదిగా పిలుపు నిచ్చాడు.

కాంగ్రెసు కార్యవర్గం కూడా 1942 సం॥ జులై 14 న ఆ మేరకొక తీర్మానాన్ని రూపొందించింది. బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసు కోర్కె నంగీకరించక భారత దేశాన్నింకా తమ అధీనంలో వుంచుకొనే ధోరణిని విడవక పోతే 1920 సం॥ తరువాత కాంగ్రెసు దేశ స్వాతంత్ర్యంకొర కవలంబించిన పద్ధతులన్నిటినీ తిరిగి అవలంబించి స్వరాజ్య సిద్ధికి తన సర్వస్వాన్ని త్యజించ సంకల్పించినదని ఆ తీర్మాన సారాంశం. ఆ తీర్మానాన్నంగీక రించేందుకు 1942 ఆగస్టు 7న బొంబాయిలో కాంగ్రెసు కార్యవర్గం సమావేశమైంది. తన ఆరోగ్యం సరిగా లేనప్పటికీ సర్దార్ పటేల్ ఆ సత్కృస్యపై తీవ్రంగా కృషిచేశారు. అందుకాయన దేశమంతా తిరిగి రాబోయే యుద్ధం కొరకు ప్రజలను సిద్ధంగా వుండమని ప్రబోధిం చారు. కాంగ్రెసు సమావేశంలో ఆ 'క్విట్ ఇండియా' తీర్మానం ప్రవేశ పెట్టబడి నప్పుడుసర్దార్ పటేల్ నిప్పులుగక్కుతూ మాట్లాడారు.

ఈ ఉద్యమం మరొక రకమైంది. మన పనులు బాగానే సాగుతూంటాయి. మన జీవితాలు సురక్షితంగానే వుంటాయి. మహా అయితే జైళ్ళలో మాత్రం కూర్చోవలసి వస్తుంది. జైళ్ళలో హాయిగా పుస్తకాలు చదువుకుంటూ, తింటూ కూర్చోవచ్చులే, దర్జాగా కాలక్షేపం చేయవచ్చులే అని మీరనుకొంటూ ఉంటే ఈ తీర్మానం ఆమోదించకండి. 'క్విట్ ఇండియా' అని అరవకండి. అలాకాక యీ ఉద్యమంలో స్వరాజ్యం కొరకు చావవలసి వస్తుంది కనుక చచ్చేందుకు సిద్ధంగా వుండాలనుకొంటే మాత్రం యీ తీర్మానం జోలికిరండి. ఇంకొక విషయం- యీ పోరాటంవల్ల లభించేది మన సుఖాల కొరకు కాదని గుర్తించండి. అది దేశగౌరవం కొరకు. మనం కేవలం దేశంకొరకు తపించేందుకే ముందుకొస్తున్నామనే త్యాగబుద్ధితోనే యీ ఉద్యమాన్ని చేపట్టండి."

1942 ఆగష్టు 8 న కాంగ్రెసు కార్యవర్గం ఆ చరిత్రాత్మకమైన తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. ఆ రెండవ రోజునే ప్రభుత్వం మిగతా నాయకులందరితోపాటు సర్దార్ పటేల్‌ను కూడా అరెస్టుచేసి అహమ్మదునగరు జైలులో నిర్బంధించి వేసింది. దేశం యావత్తు దిగ్భ్రాంతి చెందింది, డిగాలు పడింది. కాని వెంటనే దేశ ప్రజల క్రోధం కట్టలు త్రెంచుకొని ప్రవహించింది. గాంధీజీ ఎవరికి వారే నాయకులనే మంత్రాన్నుపదేశించి వెళ్ళారు. కాబట్టి ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలను కొల్లగొట్టారు, కొన్నిటిని ఆక్రమించారు. రైలు పట్టాలు పీకివేశారు. టెలిగ్రాఫ్ తీగెలు త్రెంచి వేశారు. పోలీసు స్టేషన్లు తగలబెట్టారు. అటు ప్రభుత్వంకూడా తుపాకీ గుండ్లతో విప్లవాన్ని అరికట్ట ప్రయత్నించింది. ప్రజలను నానా హింసలు పెట్టింది. దేశమంతా ఒక పెద్ద బందిఖానాగా మారిపోయింది. ప్రభుత్వ అరాచకాలతో దేశం మాడిపోయింది. నలువైపులా హాహాకారాలు, ఆర్తనాదాలు మిన్ను ముట్టాయి.

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ ఉద్యమంలో 60,000 మంది పట్టుబడ్డారు. 18,000 కు పైగా నిర్బంధితులైనారు. 2,500 మంది

చనిపోయారు. లేక గాయపడ్డారు. కోట్లకొలది రూపాయలు జరిమానాలుగా వసూలు చేయబడ్డాయి. వేలకొలది యిళ్లు బూడిద పాలయాయి. ప్రజలపై గుండ్ల వర్షం కురిపించేందుకు విమానాలు ఉపయోగించ బడ్డాయి. ఆ విధంగా దేశ స్వాతంత్ర్యం కొరకు జరిగిన ఆ మహా యజ్ఞంలో తమ ప్రాణాలను ఆహుతి నిచ్చేందుకు నాడు భారతీయులు వెనుకాడలేదు.

మరొక వైపున ఆనాటి ప్రపంచయుద్ధం సర్వ నాశనాన్ని హారతిగా పట్టివుంది. జపానుదేశం భారత దేశంపై కన్నువేసే వుంది. బంగాళా సముద్ర ప్రాంతమంతా మహా అలజడిగా ఉంది. అక్కడ విమానాల బడ బడ ధ్వను లెక్కువయాయి. సుభాష్‌చంద్రబోసు 1941లో భారతదేశం నుంచి బయటకుపారిపోయాడు. ఆయన అజాద్‌హింద్ సైన్యాన్ని ఏర్పాటు చేసి జపాను సహాయంతో భారత దేశంలో రాజ్యంచేస్తున్న బ్రిటిష్ ప్రభుత్వంపై యుద్ధాన్ని ప్రకటించాడు. బ్లేయరు రేవును ఆయన సైన్యం ఆక్రమించిందికూడా. 1944 మేనెలలో ఇంఫాల్ నగరాన్ని చుట్టుముట్టాడుకూడా. ఆయన 'ఢిల్లీచలో' అనే లక్ష్యంతో ముందుకుసాగాడు. 'స్వాతంత్ర్యం లేక మృత్యువు' అనుధ్యేయంతో ఆయన సైన్యం యుద్ధంలో పరుగులుతీస్తూంది.

గాంధీజీ అప్పుడు పూనా నగరంలోని ఆగాఖాన్ భవనంలో బంధించబడివున్నారు. 1942 ఆగష్టు 15 న అకస్మాత్తుగా ఆయన ఆంతరంగికుడు, కార్యదర్శి మహదేవ దేశాయి పరమ పదించాడు. 1944 ఫిబ్రవరి 22 న ఆయన అర్ధాంగి కస్తూరిబా గాంధీ దివంగతురాలయింది. అంతకు పూర్వం ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వ విధానానికి నిరసనగా గాంధీజీ 21 రోజులు ఉపవాసం చేసివున్నారు. ఒక సందర్భంలో ఆయన జీవించాడేమో అనేభయం కూడా వ్యాపించింది. కస్తూరిబా చనిపోయిన తరువాత గాంధీగారి ఆరోగ్యం మరింత క్షీణించింది. 1944 మే 6న ప్రభుత్వమాయనను జైలునుంచి విడుదల చేసింది. కాని సర్దార్ పటేలును మాత్రం వదలిపెట్టలేదు. పటేల్జీ అహమ్మదునగరు కోటలో బంధితులై వున్నారు. ప్రేగులకు సంబంధించిన పాతరోగం తిరిగి ఆయనను వేధించసాగింది. దానివల్ల ఆయన పడుకోలేరు, భోజనం

చేయలేరు. కేవలం నీరుమాత్రం త్రాగి వుంటున్నారు.

సర్దార్ పటేల్ ఆరోగ్యం దిగజారి పోతూండగా 1945 సంవత్సరం మే నెలలో ప్రపంచయుద్ధం ముగిసింది. మిత్రదేశాలు విజయం పొందాయి. భారత వైస్రాయి కాంగ్రెసు కార్యవర్గసభ్యులందరినీ జైళ్ళ నుంచి విడుదలచేసి సిమ్లాలో జూన్ 25 న ప్రస్తుత పరిస్థితిని చర్చించేందుకు రాజకీయ నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన జారీ చేశాడు.

1945 జూన్ 15 న మిగతా అగ్రనాయకులతో పాటు వల్లభభాయి పటేలుగారు కూడా విడుదల అయారు. వెంటనే ఆయన గాంధీగారిని కలుసుకొని. ఆ తరువాత నాయకుల సమావేశానికి సిమ్లా వెళ్ళారు. ఆ సమావేశానికి ప్రాతిపదిక మతపరమైనది కావడం వల్ల సమావేశం సంతుష్టి కరమైన వాతావరణాన్ని సృష్టించలేకపోయింది. మహమ్మదాలీ జిన్నా ఆ సమావేశంలో కఠిన వైఖరి అవలంబించాడు. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో వున్నపుడు ముస్లింలీగు ముస్లిం ప్రజలను చాలావరకు తన వైపు త్రిప్పుకొనేందుకు ప్రయత్నించింది, త్రిప్పుకొంది కూడ. అందువల్ల ఆయన పాకిస్తాన్ కావాలని మొండిపట్టు పట్టాడు. అప్పటికి బ్రిటన్‌లో లేబరు పార్టీరాజకీయాధికారం చేపట్టింది. దాని విధానంలో మార్పు రావలసి వుంది. కనుక ఆగష్టు 15 న బ్రిటిష్ ప్రభుత్వం "భారత ప్రజలకిచ్చిన వాగ్దానాల ప్రకారం, భారత నాయకులతో సంప్రదించి వారికి త్వరలో స్వయం పరిపాలనని ఇచ్చేందుకు శక్తి కొలది ప్రయత్నిస్తుంది." అని ప్రకటించింది.

సైన్యంలో కూడ తిరుగుబాటు లక్షణాలు పొడచూపిన కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం చాలా వరకు లొంగి వచ్చింది. 1946 సం. ఫిబ్రవరి మాసంలో బ్రిటిష్ నౌకా దళంలో నిజంగానే తిరుగుబాటు వచ్చింది అట్లీ లేబరు పార్టీ ప్రభుత్వం వెంటనే భవిష్యత్తును గమనించ గలిగింది అది లార్డు పెథిక్ లారెన్సు నాయకత్వంలో మంత్రుల సంఘాన్నొక దానిని సంప్రదింపుల కొరకై భారతదేశం పంపింది. ఆ సంఘం చాలా

రోజులు భారతదేశంలో వుండి నాయకులతో సంప్రదింపులు జరిపింది.

1946 మే నెలలో ఆ సంఘం తనప్రణాళిక నొకదానిని ప్రకటించింది. ఆ ప్రణాళికలో బ్రిటిష్ భారత దేశాన్ని, స్వదేశ సంస్థానాలను కలుపుకొని అఖిలభారత సంఘ రాజ్యం స్థాపించ బడుతుందనీ, ఆ సంఘ రాజ్యం అధీనంలో విదేశ వ్యవహారాలు. రక్షణ, రవాణా విషయాలు మాత్రమే వుండి మిగతా విషయాలన్నీ ఆ యా ప్రాంతాలకే వదలివేయ బడుతాయనీ, విశదపరచబడింది.

కాంగ్రెసు నాయకులు కేబినెట్ మిషన్ ప్రణాళికని ఆమోదించలేదు. అయినా కొన్ని సర్దుబాట్లతో తాత్కాలికంగా దాన్ని అంగీకరించేందుకు సిద్ధపడ్డారు. ఆ ప్రకారం లోగడ కాంగ్రెసు మంత్రివర్గాలు పనిచేసిన ప్రాంతాలన్నిటిలో తిరిగి కాంగ్రెసు మంత్రివర్గాలేర్పడ్డాయి. 1946 సెప్టెంబరు 2న కేంద్రంలో పండిత జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఇంటరిమ్ గవర్నమెంటు ఏర్పడింది. హోంశాఖ సర్దార్ వల్లభభాయి పటేల్ కివ్వబడింది. ముస్లింలీగు ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వంతో చేరలేదు. ఆ తరువాత చేరింది. చేరిన వెంటనే అది హోంశాఖ తనకు కావాలని పట్టుపట్టింది. సర్దార్ పటేల్ హోంశాఖను ముస్లింలీగు కిచ్చేందుకు సుతరాం అంగీకరించలేదు. విధిలేక ముస్లింలీగు ఆర్థిక శాఖను తీసికొని సంతుష్టిపడింది.

ఆనాడు కొందరు పెద్దలు హోంశాఖ విషయమై సర్దార్ పటేల్ పట్టుపట్టడం సమంజసంగా లేదన్నారు. కాని వారికి పరిపాలనా సంబంధమైన రహస్యాలు తెలియవని చెప్పాలి. ఏమంటే మతకలహాల కనువైన వాతావరణ ముందానాడు. పోలీసు శాఖ హోంశాఖ అధీనంలో వుంటుందెప్పుడూ. ముస్లింలీగు ఆ పోలీసు బలాన్ని దుర్వినియోగ పర్చగలదనే బలమైన అనుమానం పటేల్ కుంది. అది అక్షరాల నిజమని ఆ తరువాత అందరూ అంగీకరించారు. అందులోను కేంద్రప్రభుత్వాన్ని ముక్కలు ముక్కలు చేసేందుకే తానా ప్రభుత్వంలో చేరినట్లు ముస్లింలీగు నాయకులే

ప్రకటించారు. అంతకు పూర్వమే 1946 ఆగష్టు 16 న ముస్లింలీగు డైరెక్టు యాక్షన్ దినం జరుపుకొంటుకూడ. ఆ కారణంగా దేశంలో అశాంతి ప్రబలింది. మత కలహాలు చెలరేగాయి. నలుదెశలా పశుత్వం రాజ్యం చేస్తూంది. స్త్రీ జీవితాలకు, పిల్లల జీవితాలకుకూడ భద్రత లేని స్థితిఏర్పడింది.

బ్రిటిష్ ప్రధాన మంత్రి 1948 సం.. జూన్ మాసంలో భారతీయులకు స్వరాజ్యాన్నిస్తామని ప్రకటించాడు. కాని క్రొత్త వైస్రాయి లార్డు మౌంటు బాటన్ పరిస్థితి మరీ విషమించిందని గమనించాడు. అటు ముస్లింలతో పాకిస్తాన్ కోర్కె బలపడుతూ వస్తూంది. ఇక కాలయాపన కూడదను కొన్నాడాయన. అప్పుడాయన చొరవ తీసుకొని బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రదించాడు. ఫలితంగా 1947 ఆగష్టు 15న భారతీయులకు స్వరాజాన్నిచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని జూన్ నెల మూడవరోజున ఒక ప్రకటన చేశాడు. అయితే భారత దేశాన్ని చీలదీసి పాకిస్తాన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనకూడ ఆ ప్రకటనలో వుంది. గాంధీజీ మాత్రం దేశాన్ని విభజించే ప్రతిపాదనపై స్వరాజాన్నే నిరాకరించారు.

అటువంటి ఉద్రిక్త వాతావరణంలో 1947 వ సంవత్సరం జూన్ నెల 14 వ తేదీన వైస్రాయి క్రొత్త ప్రతిపాదనపై చర్చించేందుకు ఢిల్లీలో కాంగ్రెసు కార్యవర్గం సమావేశమైంది. అందరి మనస్సులు సంతాప గ్రస్తమై వున్నాయి సమావేశ హాలులో కొందరు దుఃఖిస్తున్నట్లు కూడ గమనించబడింది. భారతదేశం రెండు ముక్కలుగా తునిగి పోబో తూంది. ఆ సందర్భంలో సర్దార్ పటేల్ మాట్లాడేందుకు లేచాడు ఆయనకూడ సంతప్త హృదయుడే, కాని కార్యశూరుడు కదా! అప్పుడాయన చెప్పిన ఈమాటలు ఆయన మనస్సును, కాంగ్రెసు స్థితిని మనకు తెలియ చేస్తాయి —

" నేను నా జీవితమంతా సమైక్య భారతదేశం కొరకు శ్రమించాను. ఈ విభజన ప్రతిపాదనవల్ల మీరు బాధ పడుతూన్నట్లు నేనూ బాధ పడుతున్నాను. కాని దీన్ని అంగీకరించక తప్పదు. ఇప్పుడు మరొకమార్గం

మనకు లేదని నేను మీకు గట్టిగా చెప్పదలచుకొన్నాను. ఈ పరిస్థితిని మీరందరూ గమనించాలి. గత తొమ్మిది మాసాలుగా దేశపాలనను మనం నిర్వహిస్తున్నాం. ఈ కాలంలో నాకు కొన్ని బాధాకరమైన అనుభవాలు కలిగాయి. ఇప్పుడు మనమీ విభజన నంగీకరించక గత తొమ్మిది నెలలుగా బ్రిటిష్ ప్రభుత్వపు నీడలో పరిపాలన నిర్వహించినట్లుగానే యిక ముందుకూడ మంత్రి పదవులను నిర్వహించడం సంభవిస్తే అనతి కాలంలోనే దేశమంతా పాకిస్తాన్‌గా మారిపోయే ప్రమాద ముందని నేను భయపడుతున్నాను. ఈ నా భయాన్ని మీరు అర్థం జేసికోండి. కనుక భారతదేశ మంతటినీ పాకిస్తానులో చేరిపోకుండా కాపాడాలంటే మీరు ఈ దేశ విభజన తీర్మానాన్ని అంగీకరించాలి. దేశం రెండు ఖండాలైనా సరే దేశంనుంచి ఆంగ్ల శాసనాన్ని తొలగించడం మన తక్షణ కర్తవ్యం. అందుకు మనమందరం నడుములు బిగించాలి. ఇదే దేశప్రజల శ్రేయస్సు. ఈ శ్రేయిస్సు కొరకు యీ చేదు మందును త్రాగ వలసిందిగా దేశ విభజన నంగీకరింపలేక బాధపడుచున్న మిత్రులందరినీ అర్థిస్తున్నాను."

గాంధీగారు సమ్మతించక పోయినా దేశ స్వాతంత్ర్యం కొరకు సర్దార్‌జీ కలిపియిచ్చిన ఆ చేదు మందు నందరూ త్రాగారు. త్రాగక తప్పలేదు.

స్వరాజ్యం వచ్చింది

దేశం స్వరాజ్యాన్ని సాధించింది. నలుబదికోట్ల ప్రజలు బానిస బంధనాలను త్రెంచుకొని స్వేచ్ఛా వాయువులు పీల్చారు. 1947 ఆగష్టు 15న భారత-పాకిస్తానులు స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. దేశంలో అప్పటికి మతకలహాలు ప్రజ్వరిల్లుతూనే వున్నాయి. క్రూర పైశాచిక కృత్యాల వికటాట్టహాసం తొలగలేదు. అయినా దేశమంతా స్వరాజ్య భానోదయానికి జేజేలు పలికింది.

"యజ్ఞాహుతుల, బలిదానాల భయంకర
పీడకల గడిచి పోయింది.
విలాయిత దీపాలారిపోయాయి, విదేశీ
సత్తా సమసి పోయింది.
అమర వీరుల దివ్య స్మృతులతో నామనను
తొలికిసలాడింది.
రెండు శతాబ్దాల దీర్ఘరాత్రి గడిచింది
ముక్తి బావుటా రెపరెపలాడింది".

—(చిరంజీవ్)

దేశమంతా సభలు జరిగాయి. ప్రజలకు మిఠాయి పంచబడింది. పేదలకి అన్నదానాలు జరుపబడ్డాయి పట్టణాలు కరెంటు కాంతులతోను, గ్రామాలు నూనె దీపాలతోను మిరుమిట్లు గొలిపాయి. దేశం మహాత్మా గాంధీ జయనామ ధ్వనితో మారుమ్రోగింది. లక్షలాది త్రివర్ణ పతాకాలు భారత వినువీధుల్లో విజయోత్సాహాన్ని వెదజల్లుతూ రెపరెపలాడాయి. ఆ రాత్రి దివ్యరాత్రిగా భాసించింది.

బ్రిటిష్ శాసనం అంతరించింది. కాని దేశం మొదటి గవర్నరు జన రలుగా ఆ లార్డుమౌంటు బాటన్‌గారినే వరించింది. సర్దార్‌పటేల్, జవ హర్‌లాల్ నెహ్రూ ప్రభృతులు ప్రారంభంలో అనుభవనీయుడైన మౌంటు బాటన్ ఆ పదవి నిర్వహించడం దేశానికి శ్రేయస్కరమని భావించారు. ఆయనను వారు తమ మిత్రునిగా చేసుకొన్నారు. ఆయనకూడ భారత మిత్రునిగానే తన బాధ్యతను నిర్వహించాడు.

స్వతంత్ర భారతావనికి ప్రథమ ప్రధానమంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూ, ఉపప్రధానమంత్రి సర్దార్ పటేల్. హోంశాఖతోపాటు స్వదేశ సంస్థానాల వ్యవహారాలుకూడ ఆయనకే అప్పచెప్పడం జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి స్వరాజ్యాన్నిచ్చినప్పుడు సుమారు 600 స్వదేశ సంస్థానాలకుకూడ స్వయం నిర్ణయాధికారం ప్రసాదించింది. అవి తమ వీలుప్రకారం భారతదేశంలోగాని, పాకిస్తాన్‌లోగాని చేర వచ్చు. అనేక సంస్థానాలు ఎందులోనూ చేరక పూర్తి స్వతంత్రంగా వుండవలెననే సంకల్పాన్ని కూడా వెల్లడించాయి. కేబినెట్ మిషన్ నివేదికలో స్వదేశ సంస్థానాలు భారత పాకిస్తాన్ దేశాలలో చేరక స్వతం త్రంగా వుండ వీలులేదని ఎక్కడా వ్రాసి వుండలేదని జిన్నా వ్యాఖ్యా నించాడుకూడ. కనుక సంస్థానాలు కోరితే పూర్ణ స్వతంత్రంగా వుండ వచ్చునని భావించబడింది.

కాని సంస్థానాల స్వతంత్ర సత్తా కాంక్షకు పరిణామం దేశం కొన్ని వందలు ముక్కలుగా పగిలిపోవడమేగాక దేశ ప్రజలలో చాలామంది ఆ సంస్థానాధీశ్వరుల నిరంకుశ పాలనలో మగ్గిపోతూ వుండడమే అవు తుంది. అటువంటి పరిస్థితిలో సంస్థానాధీశ్వరుల సామ్రాజ్య కాంక్షని అరికట్టి సంస్థానాలన్నిటిని భారత యూనియన్‌లో చేర్చడం ఎంత క్లిష్ట తరమైనపనో ఊహించలేము. ఆ పని సర్దార్ పటేల్ చేయవలసి వుంది.

ఆ నాడు సంస్థానాల వ్యవహారాల శాఖలో శ్రీ మీనన్ కార్యదర్శిగా వున్నాడు. శ్రీ మీనన్ సహాయంతో సర్దార్ పటేల్ ఒక పథకం తయారు

చేశారు. ఆయన సంస్థానాధీశ్వరులందరికీ యీ విధంగా పత్రాలు వ్రాయించాడు — "మనందరి శ్రేయస్సు ఒక్కటే మనందరం ఒక మహత్తరమైన సంప్రదాయానికి, సంస్కృతికి వారసులం. మనందరం ఒకే రక్తాన్ని పంచుకొని జీవిస్తున్నాం. ఉదాత్తమైన జీవన విధానానికి మనం బద్ధులం. కాంగ్రెసు యీ మహత్తరమైన పునీత సంస్కృతికి శత్రువు కాదు. కనుక మన పరస్పర శ్రేయస్సుకొరకు, భవిష్యత్తుకొరకు పరస్పర సహకార సుహృద్భావాలతో కృషి జరగకపోతే దేశంలో అరాచకం ఏర్పడుతుంది. తత్ఫలితంగా అందరికీ సర్వనాశనమే శరణ్యమని మీరందరూ గుర్తిస్తారని నేను ఆశిస్తున్నాను."

పటేల్ వెలిబుచ్చిన యీ అభిప్రాయంతో సంస్థానాధీశ్వరులకు ధైర్యం వచ్చింది. వారికందరకీ పూర్వమున్న భయాలు తొలగిపోయాయి. పటేల్ వ్రాయించిన పత్రంలో యింకా యిలావుంది — "మనకు విదేశాలతో ఒడంబడికలు కుదుర్చుకొన్నప్పుడు వ్రాసుకునే సంధి పత్రాలవంటి అగ్రిమెంటుపత్రాలవసరం లేదు. మనం సోదరులం. సోదరులు యిష్టాగోష్ఠి జరుపుకొని ఉభయులకు అంగీకార యోగ్యమైన కొన్ని విషయాలను రూపొందించుకొంటారు. ఆ ప్రకారం సుఖంగా, సంతోషంగా జీవిస్తారు. మనంకూడ అదేవిధంగా సుహృద్భావంతో సమావేశం జరుపుకుందాం. మన భవిష్యత్తును మనం రూపొందించుకుందాం." సర్దార్ వ్రాయించిన యీ మాటలు సంస్థానాధిపతులందరికీ నచ్చాయి.

యీ ప్రాతిపదికపై యిరుపక్షాలు సమావేశమై సంప్రదింపులు జరిపాయి. వారు నాలుగుసార్లు సమావేశమైనారు. మధ్య మధ్య ఎన్నో ఆటంకాలు వచ్చాయి. ట్రావెన్కూరు దివాన్ సర్. సి. పి. రామస్వామి అయ్యర్ మొండిగా వ్యవహరించాడు. హైదరాబాదు నవాబుస్ను కలుపుకొని ఆయన రాజసత్తా నిలుపుకోవాలని సర్వ ప్రయత్నాలు చేశాడు. వారిరువురు మేము స్వతంత్రంగా వుంటామని ఎదురు తిరిగారు

కూడా. భోపాలు నవాబుకూడా కొంత అపసవ్యంగానే వ్యవహరించాడు. జోధపూరు, జైసల్మేరు రాజులను మిస్టర్ జిన్నా తనవైపు త్రిప్పుకోవాలని యిచ్ఛకాలాడాడు. ఆఖరుకు ప్రజలలో వచ్చిన తిరుగుబాటుకు బెదిరి పోయి తిరువాన్కూరు లొంగిపోయింది. తమ భవిష్యత్తుని ఊహించు కుని భయపడి హైదరాబాదు, మరీ మిగతా ముస్లిం సంస్థానాలు - ఏవో మాంగ్రోలు, మాణవేదరవంటి రెండు మూడు చిన్న రాజ్యాలు మినహా- మూడు విషయాలలో భారతీయ సంఘంతో చేర నిర్ణయించాయి. ఆ మూడు విషయాలు 1 దేశరక్షణ, 2 విదేశాలతో సంబంధం, 3 రవాణా సౌకర్యాలు.

చిన్న చిన్న రాజ్యాలు, తాలూకాదారులు స్వరాజ్యానికి పూర్వం వున్న స్థితిలో వుండేట్లు ఒడంబడిక చేసుకొన్నాయి. అంటే వైస్రాయి పర్యవేక్షణలో పొలిటికల్ డిపార్టుమెంటుతో వారికెటువంటి సంబంధాలు అంతకు పూర్వముండేవో అవే సంబంధాలు ఆలాగే కొనసాగుతున్నా యన్నమాట.

సర్దార్ వల్లభభాయి పటేల్ కరారు నామాలు తయారు చేయడంలో చాలా ఔదార్యంతో, దూర దృష్టితో వ్యవహరించాడు. ఆయన ఔదార్యానికి స్నేహ ప్రవృత్తికి సంతోషించి రాజులందరూ ఎటువంటి సంకోచం లేకుండా కరారు నామాలపై సంతకాలు చేశారు.

జూనాగఢ ఎట్టి స్థితిలోను పాకిస్తాన్‌తో చేరాలని కోరలేదు. అక్కడి ప్రజ 80 శాతం హిందువులే. రాజు మాత్రం ముస్లిం. అక్కడ హిందూ జైన మతాలకు చెందిన అనేక తీర్థస్థలాలున్నాయి. సంస్థానం సరిహద్దు పాకిస్తాన్‌కు దూరంగానే వుంది. నవాబు మాత్రం తన సంస్థానాన్ని పాకి స్తాన్‌లో చేర్చాలని సంకల్పించాడు. కాని ప్రజలు అందుకు తీవ్రంగా వ్యతిరేకించారు, తిరుగుబాటు చేసి స్వయంగా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అది చూసి నవాబు తన విలువైన కొన్ని వజ్రాలను

ఉద్యోగులను తీసుకొని పాకిస్తానుకు పారిపోయాడు. ప్రజా ప్రభుత్వం మరింత బలపడి నవాబు సైన్యాన్ని కూడా ఎదుర్కొంది. కొంత రక్తపాతం జరిగింది. దీనితో దివాన్ శాహనవాజ్ భుట్టో భయపడ్డాడు. ఆయన పాకిస్తాన్ అధ్యక్షుడు జిన్నాకు సమాచారమందించాడు. జిన్నా నవాబుతో మంతనాలు జరిపాడు. నవాబు దివాన్‌తో సంప్రదించాడు. ఆఖరుకు పాకిస్తాన్ అభ్యంతరాలను లెక్కచేయక జూనాగఢ సంస్థానం భారత యూనియన్‌లోనే చేరిపోయింది.

1947 నవంబరులో సర్దార్ పటేల్ జూనాగఢ వెళ్ళారు. ఆయన ప్రధాన పాటలీ కూడా వెళ్ళారు. అచ్చటే ప్రసిద్ధ సోమనాథ దేవాలయముంది. శిథిలావస్థలో వున్న ఆ దేవాలయాన్ని పునరుద్ధరించి మహాదేవుని ప్రతిష్ఠ చేయిస్తానని అక్కడి ప్రజల కాయన వాగ్దానం చేశాడు. పటేల్ సంకల్పం దేశప్రజల మన్ననలు పొందింది.

సర్దార్ పటేల్ సంస్థానాధిపతులపట్ల ఉదార బుద్ధితో వ్యవహరించారు. దాపరికం లేకుండా, అరమరికలు లేకుండా వారి గౌరవ మర్యాదలకు భంగం రాకుండ వారితో వ్యవహారం జరిపించారు. ఇది ఆయన వ్యక్తిత్వాన్ని పెంచింది. 1947 ఆగష్టు 11న సంస్థానాధిపతుల గురించి ఆయన చెప్పిన మాటలివి—

"15వ తేదీ లోపల వారు భారత యూనియన్‌లో చేరిపోతే నేను సంతోషిస్తాను. ఆ తరువాత ఎవరైనా చేరితే వారితో మా సంబంధాలు మరొక విధంగా వుంటాయని మనవి చేస్తున్నాను. ఇప్పటి విధంగా పరతులు అప్పుడుండక పోవచ్చును. తమ తమ సంస్థానాల శ్రేయస్సు కోరే వారందరూ భారత దేశంతో చేతులు కలపాలి. యూనియన్‌లో చేరిపోవాలి. నేటి ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు ఒంటరిగా బ్రతకడం ఎంత క్లిష్టతరమైన విషయమో వారికి తెలియనిది కాదు. ఒంటరిగా

వున్న చెట్టు గాలి దెబ్బకు సులభంగా పడిపోతుంది. అరణ్యంలో చెట్ల మధ్య వున్న చెట్టు సురక్షితంగా వుంటుంది. ఈ సత్యాన్ని వారు గమనించి తమ భవిష్యత్తును వెంటనే తేల్చుకొనమని సలహా యిస్తున్నాను. ఈ నాడు లాహోరు నుంచి అస్సాంవరకు, కొంత బెంగాలు భూభాగాన్ని మినహాయించి, దేశం యావత్తు ఒకటే రాజ్యంగా వుండే అవకాశం లభిస్తుంది. ఈ అవకాశం వెయ్యి సంవత్సరాల తరువాత మనకు లభిస్తుంది. ఈ అవకాశాన్ని కాపాడని వమ్ము చేయవద్దని మనవి చేస్తున్నాను"

విశాల భారత నిర్మాత

స్వతంత్ర భారత దేశం అనేక సమస్యలతో సతమతమవుతూంది. లక్షలాది ప్రజల ఇళ్ళ-వాకిళ్ళు పోగొట్టుకొని పాకిస్తాన్ నుంచి భారత దేశం వచ్చేస్తున్నారు. వాళ్ళకు గృహవసతి నివ్వాలి. ఆనాడు విచ్చల విడిగా జరుగుతున్న మతకలహాల మారణ హోమాన్ని అరికట్టాలి. కాశ్మీరుపై పాకిస్తాన్ దురాక్రమణ జరిపింది. హైదరాబాదు సంస్థానం భారత దేశంలో చేరలేదు. ఇటువంటివి మరెన్నో సమస్యలు ఆనాడు మనకుండేవి. కాని మన నాయకులు నిరుత్సాహ పడలేదు. భీతి చెంద లేదు. అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు, సమగ్రంగా పరిష్క రించారు.

ఒరిస్సా, మధ్య భారత్ రాష్ట్రాలలో చిన్న చిన్న సంస్థానాలు అధి కంగా వుండేవి. ఎంత చిన్నవంటే ఒరిస్సాలో ఒక సంస్థానపు వైశాల్యం కేవలం 46 చతురపు మైళ్ళు అటువంటప్పుడు స్వాతంత్ర్యమంటే అర్థ మేమిటో నింపాదిగా యోచించవలసిన అవసరమేర్పడింది. ఆ చిన్న రాజ్యాలలో ప్రజలుకూడ చైతన్యవంతులే. అందుకే తరుచు సంఘర్షణలు జరుగుతుండేవి.

"అప్పుడు ఒరిస్సాతో హైదరాబాదు సరిహద్దు కలిసి వుండేది. బ్రిటిష్ పొలిటికల్ ఏజెంట్ల సహాయంతో చిన్న చిన్న సంస్థానాలను ఆక్రమించా లని కూడ హైదరాబాదు కుట్రలు పన్నుతూండేవి. బస్తరులో యినుప ఖనిజముంది. దానికి పట్టా వ్రాయించుకోవాలని పథకం వేశాడు నిజాం నవాబు. సర్దార్ పటేల్‌కిది తెలిసి దాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు.

నవ యువకుడైన బస్తరు నరేశ్‌ను పిలిపించి మెలుకువతో నుండవల సిందిగా హెచ్చరించారు.

ఇలా ఒకటి కాదు, రెండు కాదు. ఆనాడు అనేక సమస్యలు ఎదురవు తూండేవి. ప్రతీదీ చిక్కుగానే పరిణమించేది. సర్దార్ పటేల్ ప్రశాం తంగా యోచించారు. ఆఖరుకాయన ఒరిస్సా సంస్థానాలన్నిటినీ ఒరిస్సాలో, మధ్య భారత్‌లోని సంస్థానాలన్నిటినీ మధ్య భారత రాష్ట్రంలో కలిపి వేయాలనే నిర్ధయానికొచ్చారు.

ఆ సంస్థానాల ప్రజలు కూడ మిగతా భారతీయులతోపాటు స్వతంత్ర జీవితాన్ని గడపాలని కోరుకున్నారు. పరిస్థితిని రాజులు కూడ అవగాహనచేసుకోసాగారు. రాజులతో సంప్రదింపులు జరిపేటప్పుడు పటేల్ వారి స్వంత ఆస్తుల విషయం కూడ దృష్టిలో పెట్టుకొనే వ్యవహరించాడు. ఆఖరుకొక లక్ష రూపాయిలు సంవత్సరాదాయం వున్న సంస్థానాలకు 15 శాతం, 4 లక్షలున్న వాటికి 10 శాతం, మరియు 5 నుంచి 10 లక్షల వరకు ఆదాయమున్న వాటికి 7½ శాతం భృతిగా చెల్లింప నిశ్చయింప బడింది. వారికి కొన్ని అధికారాలతోపాటు కొంతవరకు స్వంత ఆస్తులు నిర్వహించుకొనేట్లు కూడా అంగీకారం కుదిరింది. ఈ అంగీకారాల నాధారంగా న్యాయ మంత్రి అగ్రిమెంటు నొకదానిని రూపొందించాడు.

1947 డిశంబరు 13న సర్దార్ పటేల్ ఒరిస్సాలోని చిన్న చిన్న సంస్థానాధిపతులను సమావేశ పరచారు. తమకు స్వతంత్రంగా బ్రతికే సాధన సంపత్తి లేదు కనుక పరిపాలనా బాధ్యతలను వదలుకొని భారత దేశంలో విలీనమై పోవడంలోనే తమ శ్రేయస్సుందని వారికి నచ్చ జెప్పారు. అలా చేస్తే భారత ప్రభుత్వం ఆ సంస్థానాధిపతుల బిరుదు లను, గౌరవ మర్యాదలను కాపాడగలరని కూడ హామీ యిచ్చారు రాజ్యాధికారం వదలుకోవడం కూడ అంత సులభమైనపని కాదు కదా. రాజులందరూ పటేల్ ప్రతిపాదనలపై తీవ్రంగా ఆలోచించుకున్నారు.

ఆఖరుకు మయూర్‌భంజ్ సంస్థానం మినహాయించి మిగతా సంస్థానాలన్నీ విలీనీకరణ ప్రతిపాదనని అంగీకరించాయి. మయూర్‌భంజ్ రాజా కూడ ఆ తరువాత ఆలోచించుకొని అందరితో చేతులు కలిపాడు. సర్దార్ పటేల్ అప్పటి విశేషాల నీవిధంగా వర్ణించారు.

"నేను యిటీవల ఒరిస్సా వెళ్ళాను. అక్కడ చిన్నవి పెద్దవి కలిపి 28 సంస్థానాలున్నాయి. వారందరిని యీ చిన్న చిన్న నూతులలో ఎప్పటి వరకు కప్పలుగా పడివుంటారని ప్రశ్నించాను. వారికి నచ్చచెప్పాను. నేను వారితో అన్నాను. —"మీరు మీ రాజ్యాధికారాల నెంతవరకు నిలుపుకొంటారు? నేను రాజ కుటుంబంలో జన్మించలేదు. కాని ఈ నాడు యావద్భారత శాసన వ్యవస్థలో నా జోక్యముంది. మీ రాజ్యాధికారాలు నా బాధ్యతముందెంత? మీరుకూడ కోరితే యిటువంటి విస్తృతాధికారాన్ని చేపట్టవచ్చు". ఆ రాజులంతా నామాట విన్నారు. ఈ నాడు వారు నిశ్చింతగా నిద్రపోతున్నారు. వారి బాధ్యతలన్నీ నాపై వచ్చిపడ్డాయి. అక్కడనుంచి విమానంలో నేను నాగపూర్ వెళ్ళాను. నాగపూర్‌లో 18 సంస్థానాలున్నాయి. వాటిని సలామీ సంస్థానాలంటారు. నేను కూడ అక్కడికి వెళ్ళగానే వారికి సలాం చేశాను. నేను వారందరికీ నచ్చచెప్పగా విని వారుకూడా విలీనీకరణకి అంగీకార పత్రాలపై సంతకాలుచేశారు".

గాంధీజీ విలీనీకరణ పురాణమంతా విని యీ విలీనీకరణ అజీర్తి చేసిన కుర్రవాడికి ఆముదం త్రాగించడం వంటిదని వ్యాఖ్యానించారు. దానివల్ల సంస్థానాల అధిపతులకే మేలు కలిగించని చెప్పారు.

ఒరిస్సా, నాగపూరు సంస్థానాల రద్దు తరువాత క్రమంగా దేశంలోని సంస్థానాలన్నీ ఆ మార్గానికే రావడం ప్రారంభించాయి. సౌరాష్ట్రంలో రజవాడాలుకాని తాలూకా దారీలుకాని రెండువందలకు పైగా వున్నాయి. అక్కడ కొన్ని సమస్యలు తలెత్తాయి. ప్రజా వుద్యమాలు నడిచాయి. యోచించి యోచించి ఆఖరుకు వాటినన్నిటిని కలిపి సంయుక్త సౌరాష్ట్ర సంఘంగా రూపొందించాలని నిర్ణయించారు. ఆ సంఘానికొకడు

ఏజెంటుగా వ్యవహరించేందుకు కూడ నిర్ణయింప బడింది. 1948 ఫిబ్రవరి 15న సర్దారే దాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించారు. సంయుక్త సంఘానికి రాజ ప్రముఖుడుగా జామ్ సాహెబ్, ముఖ్యమంత్రిగా శ్రీ ఉఛంగరాయి డేబర్, ఎన్నిక అయారు. ఆ సందర్భంలో సౌరాష్ట్ర భవిష్యత్తుకు, దేశప్రగతికి మీరు చూపిన యీ అత్యుత్తమ మార్గం అందరికీ అనుసరణీయమని జామ్ సాహెబ్‌ని అభినందిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ సందేశం పంపారు.

కొల్హాపూరు సంస్థానం బొంబాయి ప్రాంతంతో కలిసిపోయింది. బరోడా మాత్రం స్వతంత్రంగా వుండాలని తీవ్రప్రయత్నం చేసింది. ఆఖరికి అక్కడకూడా బాధ్యతాయుత ప్రజాప్రభుత్వం ఏర్పడింది. కుట్రలు పన్నిన మహారాజును దింపి ఆయన కుమారుని బరోడా గద్దెనెక్కించారు.

సర్దార్ వల్లభభాయి పటేల్ అఖండ భారతదేశం కొరకెంత తపించిపోయారో చెప్పలేము. ఆయన 1949 మార్చి 30న రాజస్థాన్ యూనియన్ ప్రారంభోత్సవానికి జయపూరు వెళుతున్నారు. దారిలో విమానం చెడింది. అనుభవనీయుడైన వైమానికుడు జయపూరు సమీపంలో ఒక నది ఒడ్డున యిసుక మైదానంపై విమానాన్ని నెమ్మదిగా దింపివేశాడు. ఆ తరువాత ఆయన సురక్షితంగా జయపూరు చేరినప్పుడు శ్రీ మీనన్ భావాతిరేకంతో పటేల్‌ను కౌగలించుకొని కంటతడి పెట్టాడట. అప్పుడు స్నేహాసిక్తుడైన పటేల్ ఆత్మ విశ్వాసంతో యిలా అన్నారు — "నాకేమీ జరగలేదు, జరుగదుకూడ. మీరు భయపడబోకండి. అయినా అఖండ భారతవర్ష లక్ష్యం పూర్తి కాకుండా యీ పటేల్‌కేమీ జరుగదని గుర్తుంచుకోండి."

మధ్యభారత్‌లోని రాజులందరూ అంతకు పూర్వమే సమీకరింపబడ్డారు. ఇప్పుడు రాజస్థాన్ నరేశులందరూ భారత యూనియన్‌లో చేరారు. హిమాచల్, పంజాబు సంస్థానాలు కూడ విలీనీకరణని ఆమోదించాయి. 1949 సం.లో తిరువాన్కూరు, కొచ్చిన్ సంయుక్త

రాజ్యం స్థాపించ బడింది. మైసూరు మహారాజు చాలా సంతోషంతో తన సంస్థానాన్ని భారత దేశంలో కలిపివేశాడు. మిగతా సంస్థానాధిపతులవలె ఆయన తన ప్రివీపర్సు విషయంకూడ ప్రస్తావించలేదు. అయితే సర్దార్‌పటేల్ వివేకం ఔదార్యాన్ని విస్మరిస్తుందా? అప్పుడాయన రోగశయ్యమీద వున్నారు. మీనన్‌ను పిలిచి మైసూర్ మహారాజాకు ప్రివీపర్సుగా ఎంత నిర్ణయించారని అడిగారు. మీనన్ యింతవరకు నిర్ణయించలేదని చెప్పాడట. అప్పుడు పటేల్ వెంటనే మీనన్‌ను మైసూరు వెళ్ళి మహారాజాతో సంప్రదించి రమ్మని పంపారు.

ఈ విధంగా ఒక్క హైదరాబాదు సంస్థానం తప్ప మిగతా అన్ని స్వదేశ సంస్థానాలు తమతమ ఆధిపత్యాలను వదలుకొని భారత యూనియన్‌లో చేరిపోయాయి. అన్ని సంస్థానాలలో ప్రజా ప్రభుత్వాలు నెలకొన్నాయి.

హైదరాబాదు కథ వినడానికి పూర్వం కాశ్మీరును గురించి కొంత తెలుసుకో వలసివుంది. అన్ని సంస్థానాలతోపాటు కాశ్మీరుకు కూడ భారత పాకిస్తానలో ఏదో ఒక దానిలో విలీనమై పోవలసిందిగా సలహా యివ్వబడింది. కాని అప్పటి కాశ్మీరు మహారాజు హరిసింహ స్వతంత్ర ప్రతిపత్తి స్వప్నం చూడసాగాడు. పాకిస్తాన్‌కది రుచించలేదు. అప్పుడది ప్రథమంగా తన దేశంనుంచి కాశ్మీరుకువెళ్ళే ధాన్యాలను, యితర వస్తువులను అరికట్టివేసింది. తరువాత అచ్చట కొండ జాతీయులైన కబాయిలీలను రెచ్చగొట్టి, ప్రోత్సహించి కాశ్మీరుపై దాడి చేయించింది.

మహారాజా నిజాన్ని గుర్తించాడు. కాశ్మీరును కాపాడవలసినదిగా ఆయన భారత ప్రభుత్వాన్ని అర్థించాడు. అక్కడి ప్రజానాయకుడైన షేక్ అబ్దుల్లా కూడా భారత ప్రభుత్వ సహాయాన్ని కోరాడు. వారి కోర్కెనంగీకరిస్తూ సర్దార్ పటేల్ ముందుగా కాశ్మీరు భారతదేశంలో కలిసిపోవాలనే షరతు పెట్టారు. అలా విలీనీకరణ జరగకపోతే కాశ్మీరుకు భారతదేశమందించే సహాయం సభ్య ప్రపంచంలో విదేశజోక్యంగా

పరిగణింపబడుతుంది. నిజమేమరి. కాశ్మీరు మహారాజా పరిస్థితినర్థం జేసికొన్నాడు. వెంటనే విలీనీకరణ పత్రంపై సంతకం చేశాడు. వెను వెంటనే భారత ప్రభుత్వం కూడ కాశ్మీరు సంరక్షణ కొరకు సైన్యం పంపింది. 1947 అక్టోబరు 27న పెద్దపెట్టున భారతసైన్యం శ్రీనగరు చేరింది. కబాయిలీ అక్రమదారుల ఆటలు కట్టాయి. ఆ మరునాటి నుంచే వారు ఆక్రమించుకొన్న భూభాగాలు వదలి వెనుకకు పోసాగారంభించారు. పరిస్థితి అదుపులోకొచ్చింది. షేక్ అబ్దుల్లా ప్రజాప్రతినిధిగా కాశ్మీరు ప్రధానమంత్రి బాధ్యత అంతకు పూర్వమే నిర్వహించి వున్నాడు.

ఇంత జరిగిన తరువాత ఆ కాశ్మీరు తగాదా సంయుక్త రాష్ట్ర సంఘానికి నివేదించవలసి వచ్చింది. అది జవహర్‌లాల్ నెహ్రూకు లార్డు మౌంటుబాటన్ గారిచ్చిన సలహా. సర్దార్‌పటేల్ కది యిష్టంలేదు. అయినా తప్పలేదు. ఇప్పటికికూడ యీ అర్థం లేని ప్రశ్న సంయుక్త రాష్ట్ర సంఘంలోని భద్రతాసమితి పరిష్కరించవలసిన సమస్యల జాబి తాలో నిద్రిస్తూనే వుంది.

హైదరాబాదు భారత పాకిస్తానలో దేనిలోనూ తాను చేరజోనని, ఆ రెంటివలె మూడవ స్వతంత్ర దేశంగా వుండగలనని ప్రకటించింది. కాని బ్రిటిష్ ప్రభుత్వం అందుకంగీకరించలేదు. అయినా నిజాం నవాబు అందుకు ఎత్తులు వేస్తూనే వున్నాడు. 1947 ఆగష్టు 15 వరకు ఆయన ఏ నిర్ణయంచేయలేదు. పైగా స్వరాజ్య వేడుకలలో పాల్గొన్నసంస్థాన ప్రజల పట్ల నిజాం పోలీసులు అమానుషంగా వ్యవహరించారు. హైదరాబాదులో "ఇత్తెహాద్ ముస్లిం" అనే మతసంస్థ ఒకటుండేది. దానికి కాశింరజ్వీ నాయ కుడు. ఆ సంస్థ స్వయం సేవకులను రజాకారులంటారు. నిజాం పోలీసులతో కలిసి రజాకారులు భారత జాతీయ పతాకను తగుల బెట్టారు. సంస్థానం లోని హిందువులను నానాహింసల పాలుచేశారు. గృహ దహనాలు, దోపిడీలు, మానభంగాలు, ఒకటేమిటి? వారి రాక్షస కృత్యాలకంతులేదు. సంస్థానంలోని హిందువులను నాశనంచేసి ముస్లిం జనాభాను పెంచడం

వారి ధ్యేయం. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ యీ విషయాలను సంవిధాన సభలో ప్రస్తావించారు. నవాబుకు నిరసన తెలిపారు. అయితే నవాబు హైదరాబాదులో అటువంటి కృత్యాలు జరిగినట్లు అంగీకరించలేదు.

ఆ తరువాత నిజాం నవాబు పాకిస్తాన్‌కి ఆప్తుడైన లీయక్‌అలీని తనకు దివానుగా నియమించుకొన్నాడు. ఆ నియామకం నవాబు కపటంతో చేసిన పని. లీయక్‌అలీ మద్దతుతో రజాకారులు సంస్థానంలో అరాచకాన్ని సృష్టించడమే కాకుండ, యుద్ధం కొరకు విదేశాలనుంచి ఆయుధ సామాగ్రి కూడ తెప్పించే ఏర్పాట్లు చేశారు.

సర్దార్ పటేల్ మొదట్నుంచీ హైదరాబాదు రాజకీయాలను గమనిస్తూనే వున్నారు. అక్కడి వారిచేష్టలు వెర్రి తలలు వేయడం చూసి ఆ సమస్యను తాను స్వయంగా చేపట్టారు. అప్పటి గవర్నరు జనరల్ రాజగోపాలాచారితో, ప్రధాని నెహ్రూతో సంప్రదించి పోలీసుచర్య తీసుకోవాలని నిశ్చయించారు.

నిజాం నవాబు ఆటలు కట్టేందుకు కేవలం 108 గంటల కాలం పట్టింది. 1948 సెప్టెంబరు 17న నిజాం సైన్యం భారత పోలీసు దళం ముందు లొంగిపోయింది. రజాకారులనేకమంది నాశనమయ్యారు. వారి నాయకులు పట్టుబడ్డారు. లీయక్‌అలీ (నిజాం మంత్రి) పాకిస్తాన్ పారిపోయాడు. ఆఖరుకు నవంబరు 23 న నిజాం నవాబు ఒక ఫర్మానా ద్వారా హైదరాబాదు సంస్థానాన్ని భారత దేశంతో విలీనం చేసినట్లు ప్రకటన జారీ చేశాడు.

ఈ విధంగా దేశంలోని సంస్థానాలన్నీ ఒకదాని తరువాత మరొకటి పొప్పిన చీట్ల పేకమేడలాగా కూలిపోతూ వచ్చాయి. అవి ఎక్కడికక్కడ భారతదేశంతో సంలీనమై పోయాయి. సమైక్య భారతదేశ స్వప్నం ఆ విధంగా సత్యమై నిలచింది. సర్దార్‌పటేల్ ఒక ఇంద్రజాలికునివలె వంద లాది దేశపు ముక్కల నొకచోట చేర్చి వాటికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

దేశానికొక బలమైన శరీరాన్నిచ్చారు. ఖండిత భారతదేశాన్ని అఖండ భారతంగా మార్చివేశారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ స్వర్గీయ నెహ్రూ సంవిధాన సభలో యీ విధంగా అన్నారు.—

"కొన్ని వందల సంవత్సరాల పూర్వాంనుంచి యీ దేశంలో వ్రేళ్ళు పాతుకొనివున్న జమిందారీ విధానం, సామంత శాహ యింత సులభంగా పెకలించబడుతుందని ఎవరూ వూహించలేదు. ఆరుమాసాల పూర్వం నేనీ విషయాన్ని యిలా జరుగుతుందని భావించలేదు. ఈ అతి క్లిష్ట సమస్యను యింత సునాయాసంగా పరిష్కరించడంలో నా మిత్రుడు సహచరుడు సర్దార్ వల్లభభాయి పటేల్ చూపించిన ప్రజ్ఞ ప్రశంసనీయ మైనదని వేరుగా చెప్పనవసరం లేదు. ఇందుకు దేశంతోపాటు మేము సర్దార్‌జీకి ఋణపడివున్నాము. పాకిస్తాన్ విడిపోగా మిగిలిన భారత దేశాన్ని సమైక్య స్థితిలో నిలిపి వుంచడంలో సర్దార్ నేర్పు, సామర్థ్యం. ఈ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి వుంటాయి."

నిజంగా సంస్థానాల విలీనీకరణ భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఒక అద్భుతమైన సంఘటన. భవిష్యత్తులో చరిత్రకారులు స్వాతంత్ర్య ప్రాప్తికంటేకూడ యీ సంస్థానాల విలీనీకరణ అతి ముఖ్య మైన సంఘటనగా చిత్రించగలరు, కారణం అది చరిత్ర గతినే మార్చి వేసింది కనుక.

అయిదు సంవత్సరాలు గడిచిన తరువాత అలవర్ నరేశ్ అన్న మాట లను గమనించండి — "మొట్టమొదట మేము పటేల్‌గారంటే భయపడే వాళ్ళం. మా మనసులను బాధపెట్టి బలవంతంగా మా అధికారాల నంతం జేస్తున్నాడని తలచేవాళ్ళం. డల్హౌసీ పోలసీ కారణంగా 1857లో వచ్చిన దేశీరాజుల తిరుగుబాటువలె భారత ప్రభుత్వానికి విరుద్ధంగా భవిష్యత్తులో ఒక పెద్ద తిరుగుబాటు రాగలదని భావించేవాళ్ళం. కాని సర్దార్ సాహెబ్ మాపై అధికారచక్రం ప్రయోగించలేదు. ఆయన మా మధ్య స్నేహసరితను ప్రవహింప జేశారు; మా మనస్సులను

దోచుకొన్నారు. తల్లిదండ్రులు తమపిల్లలనెలా సంతోషపరచ గలరో అలా పటేల్ జీ మమ్మల్ని సంతోషపెట్ట గలిగారు. మా శ్రేయస్సును మాకు తెలియజెప్పి మా జీవితాలకు సార్థక్యమిచ్చారు."

తన పరాజయాన్నంగీకరిస్తూ భోపాలు నవాబు సర్దార్‌జీకొక ఉత్తరం వ్రాశాడు — "నా సంస్థానాన్ని భారతదేశంలో కలిపివేసే విషయంలో నేనెప్పుడూ వ్యతిరేకంగానే పనిచేస్తూ వచ్చాను. స్వతంత్రంగా వుండాలని సాధ్యమైనంతవరకు యత్నించాను. ఈ నిజాన్ని మీ దగ్గర దాచలేను. ఇప్పుడు నేను నా పరాజయాన్ని అంగీకరిస్తున్నాను. ఇంతకు పూర్వం నేను మీకెంత బద్ధవిరోధినో యిప్పుడంత ఆప్త మిత్రుణ్ని, నిజాయితీగల స్నేహితుణ్ని. మీరు ఈ విషయాన్ని నమ్మగలరని భావిస్తున్నాను. నేను నా హృదయంలో ఎవరిపట్లా చెడుభావాన్ని కలిగి వుండను. ఎందుచేతనంటే మీరుగాని మీ తరఫున అధికార్లుగాని మొదటినుంచీ నాపట్ల బాధ్యతాయుతంగా, గౌరవపూర్వకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు నేను మీకు హామీ యిస్తున్నాను — "దేశంలోని విచ్ఛిన్నకర, వినాశకర శక్తులను నిర్మూలించడంలో మీరు దృఢంగా వ్యవహరిస్తున్నంతవరకు, సంస్థానాధిపతుల శ్రేయస్సును మీరు కోరుతూన్నంతవరకు నేను మీకు విశ్వాసపాత్రుడైన మిత్రునిగా మీ అండనుండగలను".

సర్దార్ పటేల్ సంస్థానాల సమస్యనేగాక మరొక ప్రముఖ సమస్యను కూడా పరిష్కరించారు. ఆనాడు సివిల్ సర్వీసులో వున్న ఆంగ్లేయాధికారుల స్వభావంపై దేశనాయకులకు నమ్మకముండేది కాదు. తాను లేకపోతే భారతదేశ పరిపాలనా నిర్వహణ సక్రమంగా జరగదని ఆ అధికారులు భావిస్తూ వుండేవారు. తామక్కడ వుండేందుకు వారు రెండు షరతులు పెట్టారు. ఒక నిర్ణీతకాలం తరువాత వారు జీతంపై సెలవు తీసికొని ఇంగ్లండు వెళ్ళేందుకు బ్రిటిష్ ప్రభుత్వం తరఫున వారికధికారమివ్వబడింది. ఇప్పుడు భారత ప్రభుత్వం వారి అధికారాన్ని కాయ

పరదాలి. ఇదిగాక వారు బ్రిటిష్ పౌరులుగానే భారతదేశంలో వుండ గలగాలి. సర్దార్‌పటేల్ వారందరూ యీ దేశంనుంచి వెళ్ళిపోవాలనే కోరుకునేవారు. ఇప్పుడు వెతకబోయిన తీగ కాలికి తగిలింది. ఆయన వారి కోర్కెలు ఆమోద యోగ్యాలు కావని స్పష్టంగా చెప్పివేశారు. దానితో ఆ ఆంగ్లేయాధికారులు తమంతట తామే యీ దేశం వదలివెళ్ళి పోయారు.

సర్దార్ పటేల్ పర్సనల్ సెక్రటరీ శ్రీ వి. శంకర్ ఆయనను గురించి అన్నమాటలు గమనించండి—

"ఇంటరిమ్ గవర్నమెంటులో గృహమంత్రిగా, సూచనా ప్రసారణ మంత్రిగా ప్రవేశించినప్పుడు సర్దార్‌పటేల్ వయస్సు 71 సంవత్సరాలు. ఉప ప్రధానిగావుంటూ దేశ విభజనవల్ల ఉత్పన్నమైన సమస్యలతో సతమతమవుతూ స్వదేశ సంస్థానాల భారాన్నికూడ స్వీకరించినప్పుడు ఆయన వయస్సు 72 సంవత్సరాలు. పోతే ఆయన జీవితంలోని 73, 74, 75వ సంవత్సరాలు తెగిపోయిన భారత భూభాగపు పూసలను మరల నొక దారానికి గ్రుచ్చడంలో; దేశంలో ఎడ్మినిస్ట్రేషన్ మరియు ఆర్గనైజేషన్ అనే పడుగు - పేకల వ్యవస్థను సువ్యవస్థితం చేయడంలో; దేశంలో శాంతి స్థాపించడంలో; దేశ భవిష్యత్తుకు పునాదులు వేయడంలో; ప్రశాసనం, న్యాయం, చట్టం, అర్థం, మొదలైన వాటికి క్రొత్త రూపాలు సంతరింప చేయడంలో; దేశానికి రిపబ్లిక్ రాజ్యాంగాన్ని రూపొందించ డంలో గడచిపోయాయి. ఆ పుణ్యకాలంలోనే దేశంలోని సుమారు 600 స్వదేశ సంస్థానాలను ఒకే రాజ్యాంగం క్రిందికి తేవడంలో అపూర్వ సఫలత సాధించారు. ఒక దేశనాయకుడు లేక రాజకీయవేత్త తన 80వ పడి వయస్సులో యిన్ని అపూర్వ విజయాలను సాధించడం మానవజాతి చరిత్రలోనే అరుదైన విషయం. అందులోనూ 70వ సంవత్సరం దాటిన తరువాత, ఆఖరి 4 - 5 సంవత్సరాలలో ఆవయస్సులో గుండెజబ్బుతో పాటు దారుణమైన జీర్ణకోశపు వ్యాధితో బాధపడుతూండేవారు. ఆయన

అప్పటి అనారోగ్య స్థితిని తెలిసికొంటే, అటువంటి స్థితిలోకూడ ఆ వయస్సులో అనితర సాధ్యమైన మహత్కార్యాలని ఎలా సాధించగలిగారో మనకాశ్చర్యం కలుగుతుంది. ఆయన సమస్యలను పరిశీలించే తీరు, ఆ సమస్యలపై నిర్ణయాలు తీసుకొనే పద్ధతి, ఆ నిర్ణయాల నమలుపరచే విధానం — అన్నీ మాకు ప్రత్యేకంగా గోచరించేవి. ఆ ప్రత్యేకతే సర్దార్ పటేల్‌జీ వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వంముందు మనం తలలు వంచవలసిందే. పటేల్ సాధించిన ఘన విజయాలను తలచుకొంటూంటే యీనాటికీ మన కళ్ళు చెమ్మగిలుతాయి.

నీవే దిక్కు ప్రభూ

సర్దార్ వల్లభభాయి పటేల్ ఉక్కు శరీరంలో బిస్మార్కులోని సంఘటనా సామర్థ్యం. చాణక్యుని రాజకీయ ప్రతిభ, ఐకమత్యంపట్ల అభ్రహం లింకన్‌కున్నంత ఏకనిష్ఠ, ఏకాగ్రత—అన్నీ యిమిడివుండేవి. ఆయన కవగాహనగాని, సమస్యలుగాని, ఆ సమస్యలలో ఆయన విడదీయలేని చిక్కులుగాని వుండేవి కావు. ఆయన పరిస్థితుల మధ్య పాషాణం పగిది కాలూని నిలువగలరు. తన హాస్య ధోరణిలో ఎదుటి వారిని కడుపుబ్బ నవ్వించగలరు.

ఆయన సంభాషణలో అతిగా మాట్లాడేవాడు కాదు. చాలమితంగా మాట్లాడేవారు. కాని ఆయన మాట్లాడేవారు. ఆయన మాటలలో అర్థ గాంభీర్యముండేది. తిక్త విషయాన్ని తియ్యటి మాటల్లో చెప్పడం ఆయన కలవాటు లేదు. సాధారణంగా అటువంటి మనుష్యులు నిజాయితీ పరులు, నమ్మకస్తులు అయివుంటారు. కాని వారి నీతి నిజాయితీలు నిష్ఠురత్వం క్రిందనే జమకట్ట బడుతూంటాయి.

ఒక పర్యాయం లార్డు సేంకే గాంధీగారికొక ఉత్తరం వ్రాసాడట. ఆ లెటరులో గాంధీజీని గురించి ఆయనెన్నో అవకతవకలు, అబద్ధాలు వ్రాశాడట. దానికి జవాబుగా గాంధీజీ ఒక పెద్ద ఉత్తరం వ్రాయించాడట. ఆ సమయంలో అక్కడేవున్న పటేల్‌గారు. గాంధీగారితో "ఇంత పెద్ద ఉత్తరం దేనికి? దీనంతటికీ బదులు మీావన్నీ అపోహలు, అబద్ధాలు అని వ్రాయిస్తే పోలా!" అన్నారట.

సర్దార్ పటేల్ గాంధీగారి కనన్య భక్తులు. కాని అవసరం కలిగితే ఆయన పట్ల వ్యతిరేక అభిప్రాయాలను కూడ ప్రకటిస్తూండేవారు.

భారతదేశ విభజన విషయంలో ఆయన గాంధీజీని కాదన్న విషయం పాఠకులకు తెలిసిందే. ఆనాటి పరిస్థితులనుబట్టి దేశాన్ని రెండు చేయక తప్పదని పటేల్ గట్టిగా నమ్మాడు. ఆ నమ్మకాన్ని గాంధీజీ ముందాయన దాచలేదు. ఒకవేళ గాంధీజీ తన సిద్ధాంతాల కనుగుణంగా ఆయన దేశ పరిపాలనా వ్యవస్థను నిర్మించలేదు గనుక ఆయనను ప్రభుత్వంనుంచి తప్పుకొనమని కోరితే పటేల్ ఒకక్షణంకూడ ప్రభుత్వంలో వుండరు. అయితే గాంధీజీకి పదవిలోవున్న పటేల్ సాధక బాధకాలు తెలుసు. కనుకనే ఎన్ని అభిప్రాయ భేదాలొచ్చినా యిరువురి మధ్య స్నేహబంధం మాత్రం సడలలేదు.

సర్దార్ పటేల్ పట్ల దేశంలో కొన్ని అపోహలున్నాయి. ఆయన హిందూ పక్షపాతి అని, హిందూరాజ్య స్థాపన ఆయన రాజకీయ లక్ష్య మని, ముస్లింలపట్ల పెడసరంగా ప్రవర్తించేవారని కొందరనుకొంటూ వుంటారు. కాని హిందువులను ఉద్దేశించి ఆయన అన్న యీ మాటలు వారి అపోహలను తుడిచి వేస్తాయి— "కొందరీనాడు గోసంరక్షణ-గోసంరక్షణ అని గోల చేస్తున్నారు. కాని యీ దేశంలో స్త్రీలకు రక్షణ లేదు, వృద్ధులకు రక్షణలేదు, పిల్లలకు రక్షణలేదు. యిక గోసంరక్షణ కర్థమేముంటుంది! గోహత్యపై నిషేధంలేని దేశాలలో గోవులనెంతో బలిష్ఠంగా, ఆరోగ్యవంతంగా పుంచుకొంటున్నట్లు చూస్తున్నాం. గోహత్య పాపంగా భావించబడే యీ దేశంలో మన గోవులెలా వుంటు న్నాయి? ఒక్కసారి యోచించండి. గోసంరక్షణకొరకు గోలచేసేదాని కంటె గోవులను శ్రద్ధతో సాకడం మాత్రం మీరు నేర్చుకోండి."

పై మాటలవల్ల పటేల్ గారిలో మతరీత్యా హిందూ పక్షపాతమంటూ ఏమీ లేదని తెలుస్తూంది. నిజంగా ఆయనకు హిందూముస్లిం సామ రస్యంపట్ల మక్కువ ఎక్కువగా వుండేది. ఆ ఐకమత్యం ఆయనకు తన ప్రాణంకంటే విలువైనది. ఆయన తన పద్ధతిలో అనువైనంతవరకు కొన్ని లక్షలమంది ముసల్మానుల ప్రాణాలను కాపాడారు. భారత

దేశంలో భారత పౌరుడుగా వుంటూ పాకిస్తాన్‌పట్ల విధేయత కలిగివుండే ముస్లింలు దేశద్రోహులు, పాపులు అని చెప్పేందుకుకూడ ఆయన సంకోచించేవారు కాదు. అటువంటి ముస్లింలను పాకిస్తాన్ వెళ్ళి పోవల సిందిగాకూడ హెచ్చరించేవాడాయన. అది ఉభయులకు శ్రేయస్కర మని నిష్కర్షగా చెపుతూండేవారు.

ఈ సర్దార్ పటేల్‌లోని యీ యదార్థవాద మనస్తత్వం చాలమందికి బాధ కలిగించేది. వారు అనేక సార్లు గాంధీ నెహ్రూల కాయనపై ఫిర్యాదు చేశారు. గాంధీజీ ఏనాడు పటేల్‌పై వచ్చిన ఆరోపణలను నమ్మే వాడు కాదు. " వల్లభభాయి ఏనాడు సంకుచిత జాతీయవాది కాదు. ముస్లింల కన్యాయం జరిగే పని ఆయనేనాడు చేయలేదు; చెయ్యరు. " అని గాంధీగారంటూ వుండేవారు. అందుకనుగుణంగానే వల్లభభాయి పటేల్ ముస్లింలకేనాడు అన్యాయం చేయలేదు కూడ.

సర్దార్ పటేల్‌కు పండిత జవహర్లాల్ నెహ్రూకు మధ్య వస్తూండే అభిప్రాయ భేదాలు మాత్రం కొన్ని గట్టివే వుండేవి. ఇందుకు కారణం వారి స్వభావాలలో వున్న భేదమే. నెహ్రూ భావకుడు. ఆయన అభి ప్రాయాలపై పాశ్చాత్య ప్రభావం అధికంగా వుండేది. పటేల్ స్పష్టవాది. ఈయన ఆలోచనకు పాశ్చాత్య జీవితాలకెట్టి సంబంధం లేదు. ఈ దేశపు సామాన్య గృహస్థువలే ఆలోచించే వాడెప్పుడూ పటేల్. నెహ్రూ ఈ దేశపు సమస్యల గురించి యోచించేప్పుడు కూడ ప్రపంచ స్థితిగతికి ప్రాధాన్య మిచ్చేవారు. పటేల్ అలాకాదు. తన యింటికి ప్రథమ స్థాన మిచ్చేవారాయన. ప్రతి సమస్యకు వ్యర్థంగా ప్రపంచకళ్యాన్నంట గట్టే వారుకాదు. ఈ ప్రధానమైన దృష్టి భేదంవల్ల అనేక విషయాలపై ఆ అభిప్రాయ భేదాలు వస్తూనే వుండేవి.

పటేల్ - నెహ్రూ లిరువురు తమ దేశాన్ని, దేశ స్వాతంత్ర్యాన్ని అధికంగా గౌరవించేవారు, కాంక్షించే వారు. వారిరువురు ఒకరినొకరు గాఢంగా గౌరవించుకొనేవారు, అయితే కొందరు స్వార్థపరులు మాత్రం

ఆ యిరుపురి మధ్య అఖాతాన్ని సృష్టించ ప్రయత్నిస్తూండేవారు. వారి ప్రయత్నాల పర్యవసానంగానే ఒకప్పుడు సర్దార్ పటేల్ కేంద్ర మంత్రి వర్గాన్నుంచి బయటకు వెళ్ళిపోయేందుకు కూడ సిద్ధపడ్డారు. ఆ సందర్భంలో ఆయన గాంధీగారి కిలా వ్రాశారు —

" ఈ పరిస్థితిలో మంత్రి వర్గాన్నుంచి తప్పుకొనేందుకు మీరు అనుమతిస్తే దేశానికి, నాకుకూడ మేలు చేసిన వారవుతారు. నేనీనాటి వరకు ఏపనిని ఏ విధంగా చేస్తూ వచ్చానో ఆ పనిని మరొక విధంగా చేయగలగడం సాధ్యంకాదు. చేయలేను. నేను నా దీర్ఘకాల మిత్రులకు బాధాకరంగా మంత్రి వర్గంలో పడివుంటే, మీ హృదయవేదనను లక్ష్యపెట్టకుండ పదవినంటి పెట్టుకొని వుంటే నన్ను గురించి లోకమేమనుకొంటుంది ? పదవీ వ్యామోహంతో నేను గ్రుడ్డివాణ్నయినానని నిందిస్తుంది. ఇది నాకు అసహ్యకరమైనస్థితి. ఈ స్థితినుంచి మీరు నన్ను సాధ్యమైనంత త్వరలో తప్పించాలి. "

కాని పై ఉత్తరం వ్రాసిన తరువాత కూడ బొంబాయిలో ఒక సభలో మాట్లాడుతూ ఆయనేమన్నారో చూడండి —

" మీరిప్పుడే ముస్లింలను యీ దేశం నుంచి తరిమి కొట్టండనే నినాదాలు విన్నారు. ఆ నినాదాలిచ్చే వారు క్రోధంవల్ల పిచ్చివారైపోయారు. క్రోధంతో తన్ను తాను మరచి పోవువాడు నిజంగా పిచ్చివానికంటె దిగజారిన వాడన్నమాట. అసలు పిచ్చివాని పిచ్చి మనం కుదర్చవచ్చు. కాని క్రోధంతో అంధుడైన వాడినెలా మార్చగలం ? భారతదేశంలో మిగిలిన కొద్దిమంది ముస్లింలను తరిమివేస్తే మనకు కలిగేలాభం లేదని వారు గ్రహించలేకున్నారు. నేను దాపరికం లేకుండా చెపుతున్నాను - మీ చర్యలు ఎంత మాత్రం సహించరానివి. "

అందుకే గాంధీజీ మా ముగ్గురి అభిప్రాయాలొక్కటే అంటూ వుండేవారు. మేమందరం ఒకే ధ్యేయం కొరకు పాటు పడుతున్నామనే వారు.

గాంధీజీ తన ఆఖరు రోజున - 1948 జనవరి 30 న సర్దార్ పటేల్‌తో అన్నమాటలివి — " ఇదిగో వల్లభభాయీ, సెంట్రల్ కేబినెట్‌లో మీ రిరుపురూ వుండాలి. ఉండితీరాలి. ఇటువంటి స్థితిలో మీ యిరువురిలో ఎవరు కేబినెట్ నుంచి తప్పుకొన్నా దేశానికి ప్రమాదం సంభవిస్తుంది. జాగ్రత్త. "

అలా అన్న కొన్ని నిమిషాలకే పూజ్య బాపూజీకి అంతిమ ఘడియలు సమీపించి ఆయన అమరులయ్యారు. మహాత్ముని అంతిమ కోర్కె ననుసరించి ప్రభుత్వ క్రమశిక్షణను, దేశ గౌరవాన్ని కాపాడుటలో పటేల్ - నెహ్రూలు యిరువురు శక్తివంచన లేకుండ కృషి చేశారు; త్యాగం చేశారు. వారి అభిప్రాయ భేదాలు దేశానికి మంచి చేయడంలో మాత్రం వారి కడ్డురాలేదు. అదే గొప్ప విషయం.

సర్దార్ పటేల్ దాదాపు అస్వస్థులై పోయాడు. కాని శ్రమించడం మానలేదు. నెహ్రూపట్ల ఆయనకున్న స్నేహభావం తగ్గలేదు. తనమృత్యువుకు రెండున్నర మాసాలకు పూర్వం, 1950 అక్టోబరు 2 న ఆయనన్న మాటలివి —

" పండిత జవహర్‌లాల్ నెహ్రూ మనకు నాయకుడు. బాపూజీ ఒక ప్రకటన ద్వారా కూడ ఆయనను తన వారసునిగా నిర్ణయించారు. బాపూజీ సైనికులందరూ జవహర్‌లాల్ నెహ్రూ ఆదేశాలను గౌరవంగా పాటించాలి. అది వారి ధర్మం. హృదయ పూర్వకంగా తమ నాయకుని ఆదేశాలను పాటించనివారు దేవునిపట్ల అపరాధం చేసిన వారవుతారు. నేను నాయకునిపట్ల నమ్మకంలేని సైనికుణ్ని కాదు. నేనీ రోజున ఏ స్థానంలో వున్నానో ఆ స్థానాన్ని గురించి ఏనాడూ ఆలోచించను. నాకు తెలిసిందల్లా ఆయన నన్నెక్కడ నిలబెట్టాడో అక్కడ నిలవడమే.

ఈ ప్రకటన తరువాత యిక ఆయన రాజకీయంగా ప్రకటనలు చేయలేదు. ఆయన జీవితంలోని ఆఖరు అధ్యాయం ముగిసింది.

ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. గుండెజబ్బు ఆయనను క్రుంగ దీసింది. విశ్రాంతి కొరకు మసూరీ, డెహరాడూన్ వెళ్ళాడు. కాని లాభం లేక పోయింది. ఇక బొంబాయి వెళ్ళి పూర్తి విశ్రాంతి తీసుకోమని డాక్టర్లు సలహా యిచ్చారు.

1950 డిశంబరు 12 న వల్లభభాయి బొంబాయికి ప్రయాణం కట్టక తప్పలేదు. కాని ఆయన కప్పుడే మృత్యు దేవత పదధ్వని వినిపించింది. ఒక మిత్రునితో ఆయన " యిక నా జీవితపు ఆఖరి అధ్యాయం ముగు స్తుంది " అన్నారు బొంబాయి వెళ్ళేముందు.

అటువంటి స్థితిలో కూడా ఆయన తన శాఖాధికారులతో గంటసేపు చర్చలు జరిపారు. వారి కవసరమైన సలహాలు, ఆదేశాలు యిచ్చారు కూడ. ఆయనకు వీడ్కోలిచ్చేందుకు విమానాశ్రయానికి రాష్ట్రపతి డాక్టరు రాజేంద్ర ప్రసాద్, ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడ వచ్చారు. ఆ స్నేహమయ వాతావరణంలో పటేల్ రాజేంద్రప్రసాదుతో కరచాలనంచేస్తూ " జవహర్‌లాల్ చేయవలసిన పనులు మరిన్ని పెరుగు తాయి " అని తన ఆఖరి మాటలుగానే అన్నారట

ఆనాటి వీడ్కోలు అంతిమ వీడ్కోలవుతుందని అప్పుడెవరికీ తెలియదు కదా. బొంబాయి వెళ్ళిన తరువాత గుండెజబ్బు కొంచెం శాంతించింది. కాని అది నూనె లేక ఆరిపోయే దీపమన్నమాట. ఆఖరిస్థితి. ఆ మరునాడే మళ్ళీపరిస్థితి విషమించింది. బాధలో ఆయన నోటివెంట 'నా సర్వస్వం నీ చేతిలో వుంది ప్రభూ! నీవే నాకిక దిక్కు ప్రభూ!' అనుభక్తి పూర్వకమైన మాటలు వెలువడ్డాయి.

డిశంబరు 15వ నాటి రాత్రి మళ్ళీ గుండెపోటు తీవ్రంగా వచ్చింది. ఆయనకు స్పృహ తప్పింది. అంతే మళ్ళీ స్పృహ రాలేదు. ఆయన భౌతిక లీలను త్యజించి ఈశ్వర సాన్నిధ్యాన్ని చేరుకొన్నారు.

విద్యుత్తులాగా ఆ వార్త దేశమంతటా వ్యాపించింది. రాజేంద్ర

ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, మిగతా అనేకమంది నాయకులు బొంబాయి చేరుకొన్నారు. తన ఆప్త మిత్రుని కోల్పోయిన జవహర్ లాల్ నెహ్రూ వెక్కి వెక్కి ఏడ్చారు. పటేల్‌తో సంభవించిన అభిప్రాయ భేదాలవల్లనే నెహ్రూ శక్తి స్తోమతలు పెరిగాయనేది కూడా ఇక్కడ గమనించవలసిన సత్యం. నెహ్రూయే స్వయంగా యీ విషయంలో అన్నమాటలు గమనార్హాలు.—

"కష్టాలలో, సుఖాలలో, విజయాలలో, పరాజయాలలో కూడా మనకాయన శక్తివంతమైన వాణి వినిపిస్తూండేది. మనం కళ్ళుమూసుకొని అనుసరించదగినంత సహచరుడు, మిత్రుడు ఆయన దుర్బలహృదయాలకు శక్తినివ్వగల బలమైన వ్యక్తిత్వమాయనది."

అంతిమ యాత్ర ఆ మహానాయకునికి తగినట్లుగానే వుంది. దాందుస్ చేస్తూ, పాటలు పాడుతూ అయిదు లక్షలమంది ప్రజలాయన భౌతిక కాయం వెంట స్మశానం వరకు నడిచారు. 'రఘుపతి రాఘవ రాజారాం పతిత పావన సీతారాం' అనే పవిత్ర రామనామాన్ని లక్షల గొంతులు ఆలాపించాయి. ఆకాశం మారు మ్రోగింది.

జన్మలేదు, మృత్యువులేదు. ఎల్లప్పుడు ఆత్మ సచ్చిదానంద స్థితిని అన్వేషిస్తూ వుంటుంది. ఆ అన్వేషణే జీవునికి యాత్ర, అనంతయాత్ర, అదే ప్రాణి మనుగడ. లోహపురుష్ సర్దార్ వల్లభభాయి పటేల్ జీవితం కఠినశ్రమ, నిరంతర కృషి ద్వారా ఆ మహత్తర సత్యాన్ని అన్వేషించింది. అంతే, అది అనంత యాత్రలో ఒక మజిలీ మాత్రమే. ఇటువంటి మహనీయులను దృష్టినందుంచుకునే కవి ఈ మాటలనాలాపించాడు.

తల్లి చిరిగి పోయిన చీరె చెరగును కుట్టువాడా,
కోట్లకొలది నిరుపేదల కంటినీరును తుడుచువాడా,
దేశమేనాదని నేనేదేశమని బ్రతుకుతూండే పిచ్చివాడా,
జాతిసేవలో చచ్చికూడా బ్రతుకకలిగిన అమరజీవీ,

నీకివే మా అభివందనాలు
నీకివే మా జోహారులు.